సాక్షి 24|7
సిద్దిపేట
ఆదివారం 27-8-2017



ప్రాజెక్టు కావాలంటూ చేతులెత్తి అంగీకారం చెబుతున్న ప్రజలు..

కాళేశ్వరణం



నిర్వాసితురాలి కంటతడి

వాడీవేడిగా..

- పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ
- కరువు నేలకు కల్పతరువన్న నేతలు
- చేతులెత్తి అంగీకారం చెప్పిన గ్రామస్తులు
- ప్రాజెక్టు సరే.. పరిహారం మాటేమిటి?
- అడ్డుతగిలిన వేములఘాట్ వాసులు
- అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆందోళనలు
- అరెస్టులు, అడ్డగింతలతో హడావుడి
- 106 మంది నుంచి అభిప్రాయ సేకరణ

సాక్షి, సిద్దిపేట:

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ శనివారం జిల్లా కేంద్రం సిద్దిపేటలో వాడీవేడిగా సాగింది. ఒక పక్క అనుకూలంగా, మరోపక్క పరిహారం కోసం పట్టుబట్టడం వంటి ఘటనలతో వాతావరణం వేడెక్కింది. వయోలా గార్డెన్‌లో జిల్లా కలెక్టర్ వెంకట్రామిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా వ్యాప్తంగా వివిధ వర్గాలు, పార్టీలు, ప్రజా సంఘాలు, రైతులు, భూమిని కోల్పోతున్న వారు.. మొత్తం 106 మంది తమ అభిప్రాయాలను వినిపించారు. ప్రాజెక్టు నిర్మాణంతో కరువు ప్రాంతంగా ఉన్న జిల్లా సస్యశ్యామలం అవుతుందని, సమృద్ధిగా నీరుంటే పర్యావరణమూ మెరుగు పడుతుందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. అయితే ప్రాజెక్టు నిర్మాణానికి తాము

- మిగతా 2లో

నీళ్లు లేకే నాకు కన్నీళ్లు మిగిలాయి..



నా భర్త రాజయ్య నాలుగు బోర్లు వేసినా నీళ్లు పడలేదు. దీంతో అప్పుల పాలై ఆత్మహత్య చేసుకున్నాడు. నా లాంటి పరిస్థితి ఎవరికీ రావద్దు. రైతులు బోర్లు వేసి నష్టపోవద్దు. అలా జరగాలంటే గోదావరి జలాలు రావాలి. – లక్ష్మమ్మ, దుబ్బాక

పరిహారం సంగతేమిటి?



కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి మేం అడ్డుకాదు. మా గ్రామం ముంపునకు గురవుతుంది. అంతా కోల్పోతున్న మాకు, మా భూములకు చట్టబద్ధమైన పరిహారం ఇవ్వాలి. మా గ్రామాలకు, ప్రజలకు అన్ని వసతులు కల్పించాలి. మెరుగైన జీవనానికి ఏర్పాట్లు చేయాలి. – రంగారెడ్డి, వేములఘాట్ రైతు



మల్లన్నసాగర్ వద్దంటూ ప్రదర్శనగా వస్తున్న వేములఘాట్ వాసులు

ధర్నా..గందరగోళం.. ఆందోళన


రంగధాంపల్లి చౌరస్తా వద్ద పోలీసుల బందోబస్త్


ప్రతాప్‌రెడ్డి అరెస్టు దృశ్యం

సిద్దిపేటఅర్బన్/సిద్దిపేటటౌన్/తొగుట(దుబ్బాక):

- ప్రజాభిప్రాయ సేకరణకు మల్లన్నసాగర్ ముంపు బాధితులు ర్యాలీగా నినాదాలు చేసుకుంటూ రావడంతో వారిని పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేశారు.
- తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షుడు వంటేరు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్రజాభిప్రాయ సేకరణ టీఆర్‌ఎస్ సభను తలపించిందన్నారు.
- తెలంగాణలో ప్రాజెక్టులు నిర్మించకపోతే ప్రజలు బతకడం కష్టమని, ఈ ప్రాంతం ఎడారిగా మారే ప్రమాదం ఉందని తెలంగాణ ఉద్యమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.
- సేకరణకు తమను అనుమతించకపోవడాన్ని నిరసిస్తూ వేములఘాట్ నిర్వాసితులు తొగుట తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు.
- పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణకు జిల్లా నలుమూల నుంచి భారీగా రైతులు, ప్రజలు తరలిరావడంతో ఇన్‌చార్జి సీపీ చంద్రశేఖర్‌రెడ్డి పర్యవేక్షణలో సిద్దిపేట, సంగారెడ్డి, కామారెడ్డి, మెదక్ జిల్లాల నుంచి పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ప్రజాభిప్రాయానికి దరఖాస్తుల వెల్లువ

- పలు అంశాలపై వినతులు
- 106 మంది అభిప్రాయాల వెల్లడి
- వినతి పత్రాలు స్వీకరించిన జేసీ
- 4 గంటల పాటు కొనసాగిన ప్రక్రియ

సిద్దిపేటజోన్: కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై సిద్దిపేట జిల్లాలో నిర్మించనున్న అనంతగిరి, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్లపై శనివారం వయోలా గార్డెన్‌లో నిర్వహించిన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణకు వినతులు వెల్లువెత్తాయి. ఆయా రిజర్వాయర్ల పరిధిలో భూ సేకరణ, ముంపు గ్రామాలపై, పర్యావరణంపై పలువురు అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ప్రజాభిప్రాయ సేకరణ కొనసాగింది. పలువురు కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారానే జిల్లా సస్యశ్యామలం అవుతుందని అభిప్రాయపడ్డారు. మరికొందరు తాము ప్రాజెక్ట్‌కు వ్యతిరేకం కాదని భూ సేకరణలో భాగంగా ప్రభుత్వం అందించే పరిహారాన్ని మరింతసముచితంగా ఇవ్వాలని కోరారు. గార్డెన్ స్థల పరిమాణానికి మూడు రెట్ల మంది ఎక్కువగా తరలి వచ్చారు. వేములఘాట్ వాసుల రాకతో తోపులాట నెలకొంది. ప్రజాభిప్రాయ సేకరణలో మాట్లాడే అవకాశం ఇవ్వాలని ముంపువాసులు డిమాండ్ చేశారు. ప్రజాభిప్రాయ సేకరణ తీరు, పరిహారంపై వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. నినాదాలు చేయడంతో పోలీసులు వారిని అక్కడి నుండి బయటకు పంపించారు. ప్రాజెక్ట్‌కు మద్దతుగా నినాదాలతో కొందరు చేతులు లేపి సంఘీభావం వ్యక్తం చేయగా మరికొందరు ప్లకార్డులతో నిరసన తెలిపారు.


జేసీకి వినతిపత్రాలు అందచేస్తున్న వివిధ వర్గాల ప్రజలు

కాళేశ్వరణం

▶మొదటిపేజీ తరువాయి

వ్యతిరేకం కాదని, తమ జీవనాధారం, భూములు, గ్రామాలు ముంచి ప్రాజెక్టులు కట్టడం సరికాదని, ఇప్పటికన్నా మెరుగైన జీవితం గడిపేలా ప్రభుత్వం పరిహారం ఇచ్చి, భూములు తీసుకోవాలని వేములఘాట్ గ్రామస్తులు మొరపెట్టుకున్నారు. వేములఘాట్ గ్రామస్తులు, రైతులు తమకు మాట్లాడే అవకాశం ఇవ్వాలని, రెండు పంటలు పండే భూములకు సరైన పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. వీరికి మద్దతుగా అఖిలపక్షం నాయకులు రంగాధాంపల్లి చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. దీంతో ఆందోళనకారులను పోలీసులు రాజగోపాలరావుపేట, సిద్దిపేట రూరల్, చిన్నకోడూరు పోలీస్ స్టేషన్లకు తరలించారు.


వేములఘాట్ నుంచి వచ్చిన మహిళలను అడ్డుకుంటున్న పోలీసులు

ప్రాజెక్టుతో బతుకులు బాగుపడతాయి

జిల్లాలోని ప్రతీ సెంటు భూమినీ సాగులోకి తెచ్చేందుకు కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి రంగనాయకసాగర్, కొండపోచమ్మసాగర్, కొమురవెల్లి మల్లన్నసాగర్, అనంతగిరి సాగర్ రిజర్వాయర్లతో తమ బతుకులు బాగుపడతాయని, పర్యావరణ అనుమతులు ఇవ్వాలని జిల్లా ప్రజలు కోరారు. ఇప్పటికే జిల్లాలో సకాలంలో వర్షాలు కురవడం లేదని, భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో లక్షలు వెచ్చించి బోర్లు వేసినా ఫలితంలేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువుల్లో నీళ్లలేక పల్లెలు ఎడారులుగా మారాయని, పశుపక్ష్యాదులు కనుమరుగవుతున్నాయన్నారు. ప్రాజెక్టులు పూర్తి చేస్తే పల్లెలకు పాత కళ వస్తుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 19 మండలాల్లోని భూముల్ని గోదావరి జలాలతో తడపాలని కోరారు. దీంతో వలసలను కూడా నివారించవచ్చని పలువురు అభిప్రాయపడ్డారు.



ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొన్న కలెక్టర్, ఇతర అధికారులు


ఆందోళనకు దిగిన వారిని అడ్డుకుంటున్న పోలీసులు

మాకు న్యాయం చేయాలి..

జిల్లాలో నిర్మించే రిజర్వాయర్లతో తమ పంటపొలాలు, గ్రామాలు ముంపునకు గురవుతున్నాయని, తమకు న్యాయం చేయాలని మల్లన్నసాగర్ ముంపు ప్రాంతాలైన వేములఘాట్, తుర్కాపూర్, ఎర్రవల్లి గ్రామాల రైతులు కోరారు. పర్యావరణ అనుమతులు, ప్రజాభిప్రాయ సేకరణ ప్రాజెక్టు నిర్మాణానికి ముందు చేపట్టాలని, ఇప్పుడు చేయడంలోని అర్థమేమిటని ప్రశ్నించారు. ప్రజాభిప్రాయ సేకరణ, ప్రజల ఇబ్బందులను తెలుసుకునేందుకు సిద్దిపేటలో సభ నిర్వహించడం కాదని, ముంపు గ్రామాల్లో నిర్వహించాలని ఆయా గ్రామాల ప్రజలు జిల్లా అధికారులకు తెలిపారు. తాము ప్రాజెక్టుల నిర్మాణానికి అడ్డు కాదని, అయితే తమ భూములకు 123 చట్టం ప్రకారం కాకుండా 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలని పట్టుబట్టారు. అలా ఇవ్వని పక్షంలో తమకు పరిహారం వద్దని, తమ భూములనూ ఇచ్చే ప్రసక్తే లేదన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ అంటూ అధికారులు తమకు నచ్చిన వారిని మాత్రమే మాట్లాడనిస్తున్నారని, తమ అభిప్రాయాన్ని వినిపించే అవకాశం ఇవ్వలేదని పలువురు ముంపు గ్రామస్తులు వాపోయారు.

నివేదిక ప్రభుత్వానికి అందచేస్తాం



కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం కోసం పర్యావరణ సమస్యలపై నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణకు అనూహ్య స్పందన వచ్చింది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 106 మంది అభిప్రాయాలను వినిపించారు. పూర్తి నివేదికను ప్రభుత్వానికి అందచేస్తాం. ప్రభుత్వ నిబంధనల మేరకు రైతులకు మేలు చేస్తాం. ఎవరూ అధైర్యపడొద్దు. రైతుల సమస్యలు తెలుసుకునేందుకు కలెక్టర్, డీఆర్‌వో, ఆర్‌డీవో అధికారులు అందుబాటులో ఉంటారు. **– వెంకట్రామిరెడ్డి, జిల్లా కలెక్టర్**

గోదావరి జలాలే శరణ్యం



ఈ ప్రాంతంలో రైతుల ఆత్మహత్యలు ఎక్కువగా జరుగుతున్నాయి. వాటి నివారణకు గోదావరి జలాలు మళ్లించడమే శరణ్యం. పలు గ్రామాలు ముంపుకు గురికావడం విచారకరం. అయితే వారి త్యాగంతో ఇతర ప్రాంతాలు సస్యశ్యామలమవుతాయి. **– పాకాల శ్రీహరిరావు, తెలంగాణ రాష్ట్ర రైతు సమాఖ్య అధ్యక్షుడు**

పర్యావరణానికి ఇబ్బంది లేదు



కాళేశ్వరం ప్రాజెక్టుతో పర్యావరణానికి వచ్చే ఇబ్బంది లేదు. దేశంలో ఇప్పటి వరకు నిర్మించిన ప్రాజెక్టుల వల్ల ఎక్కడా పర్యావరణ ఇబ్బందులు వచ్చిన సందర్భాలు లేవు. గోదావరి జలాలతో సిద్దిపేట జిల్లా సస్యశ్యామలం అవుతుంది. **– కొత్త ప్రభాకర్‌రెడ్డి, మెదక్ ఎంపీ**

మల్లన్నసాగర్‌తోనే కష్టాలు తీరుతయి



మల్లన్నసాగర్ ఈ ప్రాంతానికి వరప్రసాదం. కరువు కాటకాలతో అల్లాడిన ప్రజలు ఈ ప్రాజెక్టుతో ఉపశమనం పొందుతారు. త్వరితగతిన దీన్ని నిర్మించాలి. భూములు కోల్పోయే రైతులకు న్యాయంగా పరిహారమిచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంది. **– సోలిపేట రామలింగారెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే**

బీడు భూముల్ని తడపాలి



గోదావరి నీళ్లు ఏటా వందల వేల టీఎంసీల మేర వృథాగా సముద్రం పాలవుతున్నాయి. ఆ నీటిని మళ్లించి బీడు భూములను తడపాలి, అందుకోసం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం కావాలి. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి పర్యవరణం పరంగా ఇబ్బందులు లేవు. **– సతీష్, హుస్నాబాద్ ఎమ్మెల్యే**

ఆత్మహత్యలు ఆగుతాయి



నూటికి నూరు శాతం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించాలి. కరువుతో పంటలు పండక రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారు. ఈ ప్రాజెక్టుతో వాటికి చెక్ పెట్టవచ్చు. ప్రాజెక్టుతో పర్యావరణ సమస్య ఉండదు. అందరూ సహకరించాలి. **– ఫారూఖ్ హుస్సేన్, ఎమ్మెల్సీ**

పోలీస్ నిర్బంధంలో సేకరణా?



‘మా భూములు కోల్పోతున్నాం.. మాకు న్యాయం చేయండి’ అని వస్తుంటే పోలీసులు అడ్డుకుంటున్నారు. ఇదేనా ప్రజాభిప్రాయ సేకరణ అంటే? ఇటువంటి పరిస్థితుల్లో మా మాటెలా చెప్పాలి? మాకు న్యాయం చేయాలి. మమ్మల్ని ఆదుకోవాలి. **– శ్రీనివాస్‌రెడ్డి, వేములఘాట్ రైతు**

ముంపు ప్రజలను మెప్పించాలి



ముంపు ప్రాంత ప్రజలను మెప్పించి, ఒప్పించి ప్రాజెక్టు నిర్మించాలి. ప్రాజెక్టు ద్వారా 17 లక్షల ఎకరాలకు నీరందిస్తారు. హర్షణీయం. కానీ 17 వేల ఎకరాలను ఇస్తున్న నిర్వాసితులను ఆదుకోవాలి. అటవీ భూములపై క్లియరెన్స్ వచ్చిందా?. **– ఒంటేరు ప్రతాప్‌రెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు**

పర్యావరణ అనుమతులేవీ?



ప్రాజెక్టుల నిర్మాణంలో ముంపునకు గురవుతున్న అటవీ భూములకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందా?. ఇప్పటి వరకు స్పష్టం చేయలేదు. పర్యావరణ అనుమతి లేకుండా ప్రాజెక్టులు కట్టరాదు. భూమి కోల్పోయే రైతులకు న్యాయం చేయాలి. **– చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు**

‘గోదావరి’తో బతుకులు మారుతై



సిద్దిపేట జిల్లా రైతుల ఆత్మహత్యలు ఆగాలంటే జిల్లాకు గోదావరి జలాలు రావాలి. ఈ గోస తీరాలి. రైతుల బతుకులు మారాలంటే గోదావరి జలాలు రావాలి. ఇందుకు ప్రాజెక్టులు కట్టాలి. బీడు భూములను సస్యశ్యామలం చేయాలి. **– శంకరవ్వ, చిన్నగుండవెల్లి**

చావులోనూ వీడని స్నేహం

- రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకుల మృతి
- ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు
- మృతులంతా ఎర్రారం వాసులే..


ప్రభాకర్(ఫైల్)


మృతుడు ప్రభాకర్


ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో

జోగిపేట(అందోల్): ఒకరంటే ఒకరికి ప్రాణం.. కులమత భేదాలు లేకుండా సంవత్సరాలుగా కలిసి ఉంటున్నారు... పండుగల్లో మమేకమయ్యే స్నేహితులు... రోడ్డు ప్రమాదంలో కలిసి చనిపోవడం అందరి హృదయాలను కదిలించింది. శుక్రవారం సాయంత్రం జోగిపేటలోని శ్రీరామ ఫంక్షన్ హాల్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అందోలు మండలం ఎర్రారం గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం... ఎర్రారం వైపు నుంచి వస్తున్న ఆటోను జోగిపేట వైపు నుంచి వస్తున్న హైదరాబాద్–2 డిపోకు చెందిన టీఎస్ 08 యూబీ 5100 నంబరు గల ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో ఆటో నడుపుతున్న రమేశ్(23), పాషా(22) అక్కడికక్కడే మృతి చెందారు. ప్రభాకర్(20)కు తీవ్రగాయాలు కావడంతో సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి 108 వాహనంలో తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. అందోలు మండలం ఎర్రారం గ్రామానికి చెందిన ఈ ముగ్గురు జోగిపేటకు పని నిమిత్తం వస్తుండగా ఈ సంఘటన చోటు చేసుకుంది.

అరగంట సేపు ప్రాణాలతో...

ఆటోను బస్సు ఢీకొనగానే ఎడమవైపు రోడ్డు పక్కకు దూసుకుపోయింది. ఆటోలోని వారంతా ఇరుక్కుపోయారు. వారిని బయటకు తీసేందుకు అరగంట సమయం పట్టింది. డ్రైవర్‌కు ఆటో ఇనుప రాడ్లు బలంగా గుచ్చుకోవడంతో పేగులు బయటకొచ్చాయి. బలమైన గాయాలు తలగడంతో పాషా ఆటోలోనే మృతి చెందారు. చాకలి ప్రభాకర్‌కు తలపై బలమైన గాయాలయ్యాయి. కొన ఊపిరితో అతడు చాలా సేపు కొట్టుమిట్టాడాడు. ప్రభాకర్ తల నుంచి తీవ్ర రక్తస్రావం కావడంతో అస్వస్థతకు గురయ్యాడు. అతన్ని జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమ చికత్సలు చేసి సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు. అప్పటికే చాలా రక్తస్రావం కావడంతో మార్గమధ్యంలోనే మృతి చెందాడు. సీఐ వెంకటయ్య, ఎస్ఐ పరమేశ్వర్ సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.


పాషా(ఫైల్)


రమేశ్ (ఫైల్)

అత్తగారు బైకు కోసం డబ్బులిస్తే ఆటో కొన్నాడు..

ఆరు మాసాల క్రితం రమేశ్‌కు టేక్మాల్ మండలం వెల్పుగొండకు చెందిన లక్ష్మితో వివాహం చేశారు. అత్తగారు వరకట్నం కింద బైక్ తెచ్చుకోవాలని డబ్బులు ఇచ్చారు. బైక్ ఎందుకని... ఆటో అయితే నడిపించుకొని ఆర్థికంగా సమస్యలు తీర్చుకోవచ్చునని రమేశ్ నిర్ణయించుకున్నాడు. కొత్త ఆటోను కొనుగోలు చేశాడు. జీవనాధారం అవుతుందనుకున్న ఆటోలోనే తన ప్రాణాలు పోతాయని ఊహించలేదు. ఈ విషయాన్ని అతని భార్య గుర్తు చేసుకుంటూ రోదిస్తుంచడం ఆ ప్రాంతంలోని వారినందరినీ కంట తడిపెట్టించింది. పాషా హైదరాబాద్‌లో కుక్కర్‌గా పని చేస్తున్నాడు. ప్రభాకర్ ప్రైవేటు పనులు చేసుకుంటున్నాడు.

ఎర్రారంలో విషాదఛాయలు

అందోలు మండలం ఎర్రారానికి చెందిన ముగ్గురు యువకులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రమాదం సమాచారం అందగానే వందలాది మంది సంఘటనా స్థలానికి, ఆస్పత్రికి తరలి వచ్చారు. పండుగల సమయాల్లో ఒకరికొకరు కలుసుకుని ఆనందంగా ఉండే స్నేహితులు రోడ్డు ప్రమాదలో మృతి చెందడాన్ని గ్రామస్తులు జీర్ణించుకోలేకపోతున్నారు. అందరితో కలుపుగోలుగా ఉండే రమేశ్ సుపరిచితుడు.

ఆటో డ్రైవర్ రమేశ్ తండ్రి బొట్టు చెన్నయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పరమేశ్వర్ తెలిపారు. హైదరాబాద్ డిపోకు చెందిన బస్సు అతివేగంగా... అజాగ్రత్తగా నడిపినందుకు డ్రైవర్ గండికోట శేఖర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. మృతదేహాలకు జోగిపేట ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

మానసిక ఒత్తిడితో వ్యక్తి ఆత్మహత్య

సిద్దిపేటఅర్బన్: పట్టణంలోని ఓ బైక్ జోన్‌లో మేనేజర్‌గా పని చేస్తున్న వ్యక్తి మానసిక ఒత్తిడితో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల పరిధిలోని లింగారెడ్డిపల్లి శివారులోని మెట్టుబండల వద్ద శనివారం వెలుగు చూసింది. పోలీసులు, కుటుంబీకుల కథనం ప్రకారం... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తూర్పుగోదావరి జిల్లా మండపేటకు చెందిన ఎనమల రామకృష్ణ అలియాస్ కృష్ణ ఫణీంద్ర(35) రెండున్నర ఏళ్ల నుంచి సిద్దిపేట పట్టణంలోని ఖదరపురాలో భార్యతో కలిసి ఉంటున్నాడు. పట్టణంలోని ఆర్ఆర్ బైక్ జోన్‌లో మేనేజర్‌గా పని చేస్తున్నాడు. మూడు రోజుల క్రితం బైక్ జోన్‌లో ఆడిట్ నిర్వహించారు. అక్కడ ఏమైందో తెలియదుగానీ... ఫణీంద్ర మనస్థాపానికి గురయ్యాడు. శుక్రవారం సాయంత్రం కృష్ణఫణీంద్ర ఇంట్లో చెప్పి తన బైక్(ఆక్టీవా) తీసుకుని బయటకు వెళ్లాడు. రెండు బీర్లు, పురుగుల మందు డబ్బాతో లింగారెడ్డిపల్లి శివారులోని మెట్టుబండల వద్దకు వెళ్లాడు. మొదట బీర్లు తాగాడు. తర్వాత పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ గోపాల్‌రావు తెలిపారు.


ఆత్మహత్య చేసుకున్న ఫణీంద్ర

రోడ్డు ప్రమాదంలో తల్లి, కుమారుడు మృతి


- పండుగకు ఇంటికి వస్తూ మృత్యువాత
- తొనిగండ్లలో విషాదఛాయలు


శారద మృతదేహం


బాలుడి మృతదేహం

రామాయంపేట(మెదక్): వినాయక చవితి పండుగను తమ స్వగ్రామంలో నిర్వహించుకుందామని బైక్‌పై సంతోషంగా వస్తున్న ఆ కుటుంబాన్ని చూసి విధికి కన్ను కుట్టింది. కారు రూపంలో వచ్చిన మృత్యువు తల్లి, కుమారుడిని బలి తీసుకుంది. ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన కుటుంబ పెద్ద, అతని కూతురు చావుబతుకులతో పోరాడుతున్నారు. రామాయంపేట మండలం తొనిగండ్లలో విషాదం నెలకొంది. వివరాల్లోకి వెళ్తే... తొనిగండ్ల గ్రామానికి చెందిన అమ్మన్నగారి సురేశ్ మండలంలోని లక్ష్మాపూర్ పంచాయతీ పరిధిలోని బాపనయ్య మోతుకుల తండాలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. అతని భార్య శారద (40) కామారెడ్డి జిల్లా బిక్కనూరు మండల కేంద్రంలోని హైస్కూల్‌లో సీనియర్ అసిస్టెంటుగా పని చేస్తున్నారు. వీరికి 11 ఏళ్లలోపు కుమారుడు శ్రీనిధ్(తనీశ్), కూతురు శ్రీనిధి ఉన్నారు. శ్రీనిధ్ కామారెడ్డిలో ఐదో తరగతి, శ్రీనిధి రెండో తరగతి చదువుతున్నారు. ఉద్యోగరీత్యా వారు కామారెడ్డిలో నివాసం ఉంటున్నారు. వినాయక చవితి పండుగను తమ స్వగ్రామంలో నిర్వహించుకోవడానికి సురేశ్ తన భార్యా పిల్లలతో కలిసి బైక్‌పై తొనిగండ్లకు బయలుదేరారు. ఆ జిల్లాలోని బిక్కనూరు మండలం అంతంపల్లి తండా వరకు రాగానే వెనుక నుంచి అతివేగంగా వస్తున్న కారు బైక్‌ను ఢీకొంది.


శారద(ఫైల్)


శ్రీనిధ్(ఫైల్)

ఈ ప్రమాదంలో శారతతో పాటు ఆమె కుమారుడు శ్రీనిధ్ అక్కడిక్కడే మృతి చెందారు. సురేశ్‌తో పాటు కూతురు శ్రీనిధి తీవ్ర గాయాలకు గురయ్యారు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

పండుగ రోజు విషాదం

- ఆకుల సేకరణకు వెళ్లి..
- విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి


ప్రశాంత్ (ఫైల్)


ప్రశాంత్ మృతదేహం

శివ్వంపేట(నర్సాపూర్): వినాయక చవితి పండుగ కోసం హుషారుగా పూజకు అవసరమైన ఆకుల సేకరణకు వెళ్లిన యువకుడు విద్యుత్ షాక్‌తో మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన శివ్వంపేటలో శుక్రవారం జరిగింది. ఎస్ఐ గంగరాజు, గ్రామస్తుల కథనం ప్రకారం... ఆ గ్రామానికి చెందిన నర్సింగరావు, మల్లమ్మల దంపతుల కొడుకు ప్రశాంత్(23) కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శుక్రవారం వినాయక చవితి పండుగ సందర్భంగా ఇంట్లోకి పూజకు అవసరమైన ఆకుల సేకరణకు పొలాల్లోకి వెళ్లాడు. అడవి పందుల బారి నుంచి రక్షించుకునేందుకు ఇదే గ్రామానికి చెందిన గొల్ల సత్తయ్య తన మొక్కజొన్న పంట చుట్టూ విద్యుత్ తీగ ఏర్పాటు చేశాడు. ఆ తీగను గమనించని ప్రశాంత్ అటుగా వెళ్తున్న క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపించారు. పండుగ వేళ యువకుడు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తూప్రాన్ సీఐ లింగేశ్వర్‌రావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి తండ్రి నర్సింగరావు ఫిర్యాదు మేరకు పోలీసులు గొల్ల సత్తయ్యపై కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అదుపు తప్పిన బైక్.. మహిళ మృతి


మృతిచెందిన కవిత

జగదేవ్‌పూర్(గజ్వేల్): బైక్ ఆదుపు తప్పిన ప్రమాదంలో మహిళ మృతి చెందిన సంఘటన శుక్రవారం మండలంలోని అలిరాజ్‌పేట గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ వీరన్న కథనం ప్రకారం... మండలంలోని పీర్లపల్లి గ్రామానికి చెందిన ఎరుకలి కిషోర్, కవిత దంపతులు. ఇటీవల కిషోర్ తండ్రి మృతి చెందారు. శుక్రవారం 3వ రోజు కావడంతో దినకర్మ కోసం కిషోర్, కవిత బైక్ మీద జగదేవ్‌పూర్ వచ్చారు. దినకర్మకు కావాల్సిన సామగ్రి దొరక్కపోవడంతో బైక్‌పై ఇద్దరూ గజ్వేల్‌కు బయలుదేరారు. అలిరాజ్‌పేట దగ్గరకు రాగానే కుక్కను తప్పించబోయి బైక్ అదుపు తప్పడంతో వెనుకాల ఉన్న కవిత కింద పడింది. ఆమెకు తలకు తీవ్ర గాయాలయ్యాయి. గజ్వేల్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలోనే కవిత మృతి చెందింది. పండుగపూట కుటుంబంలో విషాదం నెలకొంది. ఈ మేరకు ఎస్ఐ వీరన్న కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం


రూపేరావు(ఫైల్)

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని కిష్టాయిపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. బొల్లారం సీఐ సతీష్‌రెడ్డి కథనం ప్రకారం... కిష్టాయిపల్లి గ్రామానికి చెందిన వేణుగోపాల్ రూపేరావు(52) ఈ నెల 23న ఇంటి నుంచి గడ్డపోతారం పారిశ్రామిక వాడలో తాను నిర్వహిస్తున్న దుకాణానికి వెళ్తున్నానని చెప్పాడు. నాటి నుంచి ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికినా అతని ఆచూకీ లభించలేదు. అతని భార్య భాగ్యలక్ష్మి శనివారం బొల్లారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ సతీష్‌రెడ్డి చెప్పారు.

వాతావరణం

రానున్న 24 గంటల్లో విదర్భ, పశ్చిమ మధ్యప్రదేశ్, దక్షిణ ఉత్తరప్రదేశ్‌తోపాటు పశ్చిమ తీరప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. తెలంగాణ, ఉత్తరాంధ్ర, ఉత్తరాఖండ్, పశ్చిమ ఉత్తరప్రదేశ్, తూర్పు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌తోపాటు ఒడిశాలో మోస్తరు వర్షం కురుస్తుంది. పశ్చిమ రాజస్తాన్, దక్షిణ తమిళనాడులో చిరుజల్లులు కురుస్తాయి.

సిద్దిపేట వాతావరణం

గరిష్టం కనిష్టం

28.4°/25.6°

జాతీయం

నగరం	గరిష్ట	కనిష్ట
ఢిల్లీ	32.8	26.5
కోల్‌కతా	34.4	27.2
బెంగళూరు	28.5	20.8
ముంబై	29.2	24.2
చెన్నై	34.9	26.0

పట్టణ వాతావరణం

పట్టణం/జిల్లా	గరిష్ట/కనిష్ట	పట్టణం/జిల్లా	గరిష్ట/కనిష్ట
చిత్తూరు	35.5/26.0	విశాఖపట్నం	32.4/27.0
తిరుపతి	35.5/26.0	గుంటూరు	32.4/25.2
ఒంగోలు	34.9/25.7	కర్నూలు	32.1/24.0
నెల్లూరు	34.4/26.4	ఆదిలాబాద్	31.6/20.8
శ్రీకాకుళం	33.9/26.6	ఏలూరు	31.5/25.7
విజయనగరం	33.9/26.6	రాజమండ్రి	31.5/25.7
కాకినాడ	33.4/26.1	తాడేపల్లిగూడెం	31.5/25.7
నల్లగొండ	33.4/23.2	కరీంనగర్	31.4/25.0
కడప	33.3/23.0	మెదక్	31.2/20.6
అనంతపురం	33.2/23.6	మహబూబ్‌నగర్	30.1/22.6
విజయవాడ	32.6/25.2	నిజామాబాద్	29.9/23.4
వరంగల్	32.6/24.5	హైదరాబాద్	29.5/21.1
ఖమ్మం	32.6/20.2	రంగారెడ్డి	29.5/21.1

బుల్లితెర

www.sakshi.com

సాక్షి SAKSHI TV


ఉ. 07.00 గంటల నుండి ప్రతి గంటకు సాక్షి న్యూస్ బులెటిన్

ఉ.06.30 సత్యవాక్యం
ఉ.07.00 న్యూస్ 360
ఉ.07.30 కేఎస్‌ఆర్ లైవ్ షో
ఉ.09.00 రీజనల్ న్యూస్
ఉ.09.30 కాకినాడ ఎలక్షన్
ఉ.10.00 సాక్షి న్యూస్
ఉ.10.30 కాకినాడ ఎలక్షన్
ఉ.11.30 కాకినాడ ఎలక్షన్
మ.02.30 కెరీర్ ప్లస్
సా.04.30 కాకినాడ ఎలక్షన్
సా.05.00 స్పీడ్ న్యూస్
సా.05.30 జనపథం
సా.06.30 పండగ వేళ
రా.07.30 స్టార్ స్టార్
రా.08.00 మనసులో మాట
రా.09.00 న్యూస్ 360
రా.10.30 సదరన్ స్పైస్

టీవీలో ఈరోజు సినిమాలు



జెమిని మూవీస్
ఉ.09.30 రొమాన్స్
మ.12.00 కొండవీటి దొంగ
మ.03.00 సత్యమేవ జయతే
సా.06.00 ఏవండీ ఆవిడ వచ్చింది
రా.09.00 సందడి



మూవీస్ నౌ
ఉ.08.00 రిచ్చీ రిచ్
ఉ.10.00 డెత్ రేస్
మ.02.55 యాంట్-మ్యాన్
సా.09.00 క్యాసినో రాయల్
రా.11.55 క్లిఫ్‌హ్యాంగర్




హెచ్‌బీవో
ఉ.07.34 పాన్
ఉ.09.21 కుంగ్‌ఫు పాండా 2
మ.01.00 ద కంజ్యూరింగ్ 2
సా.05.08 సూసైడ్ స్క్వాడ్
రా.11.00 10,000 బి.సి.



స్టార్ మూవీస్
ఉ.06.01 టెర్మినేటర్ సాల్వేషన్
ఉ.10.18 పెంగ్విన్స్ ఆఫ్ మడగాస్కర్
మ.02.57 ఫెంటాస్టిక్ ఫోర్
రా.07.02 అనకొండ 3
రా.09.00 టైటానిక్



మా మూవీస్
ఉ.07.00 ఓం
ఉ.09.30 సత్యం
మ.03.00 అందాల రాక్షసి
సా.05.00 ఈగ
రా.10.30 మహేశ్



జీ సినిమా
ఉ.07.21 జర్నీ బాంబే టు గోవా
ఉ.10.35 హ్యాపీ న్యూ ఇయర్
మ.02.31 వివాహ్
సా.06.04 ధమాల్
రా.09.00 ఫిర్ హెరా ఫెరీ

తిరుమల సమాచారం


తిరుమలలో శనివారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. దర్శనం కోసం భక్తులు వేచి ఉండే వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో 31 కంపార్టుమెంట్లు నిండి క్యూ వెలుపలకు వెళ్లింది.

సాయంత్రం 6 గంటలకు అందిన సమాచారం :గదుల వివరాలు:

ఉచిత గదులు – ఖాళీ లేవు
రూ.50 గదులు – ఖాళీ లేవు
రూ.100 గదులు – ఖాళీ లేవు
రూ.500 గదులు – ఖాళీ లేవు

సేవలు

సహస్రదీపాలంకరణ సేవ – ఖాళీ లేవు
వసంతోత్సవం – ఖాళీ లేవు
ఆర్జిత బ్రహ్మోత్సవం –ఖాళీ లేవు



కొమురవెల్లి ఆలయ సమాచారం

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ సాధరణం కంటే ఎక్కువగా ఉంది. భక్తులు స్వామిని ఆలయ ముఖ మండపం నుంచి అర్ధ మండపం ద్వారా దర్శించుకున్నారు.

నిత్య పూజలు:

ఆలయంలో తెల్లవారుజామున 4 నుంచి 4:30 వరకు స్వామి వారి మేలుకొలుపు (ఒగ్గు ప్రార్ధన). 4:30 నుంచి 5 వరకు సుప్రభాతం. ఉ.5 నుంచి 6 వరకు స్వామి వారికి తీర్ధపు బిందె తెచ్చుట (రుద్రాభిషేకం). మ.12కు మహానివేదన (ద్వార బంధనం). ఉ.6 నుంచి రాత్రి 7 వరకు దైవ దర్శనం. రాత్రి 7:30 స్వామి వారికి నిత్యాభిషేకం. రాత్రి 8:30కి ద్వార బంధనం.

ఆర్జిత సేవలు:

ఉ.6 నుంచి ఉ.10 వరకు అభిషేకాలు, ఉ.9 నుంచి సా.6 వరకు వాహన పూజలు, ఉ.10:30 నుంచి స్వామి నిత్య కల్యాణం, రాత్రి 8 గంటలకు ఒగ్గు ప్రార్ధన (పవళింపు సేవ).

ఆలయంలో ఆదివారం గదుల సమాచారం:

రూ.300 గదులు 60 ఖాళీగా ఉన్నాయి,
రూ.600 గదులు 24 ఖాళీగా ఉన్నాయి.
దేవస్థాన కార్యాలయ ఫోన్: 08710–226201
ఆలయ ఈఓ రామకృష్ణారావు ఫోన్: 94910 00652
గదుల విచారణ ఇన్‌చార్జి అధికారి ఎం.పోచయ్య
ఫోన్: 95537 83488





భారీగా పెరిగిన పత్తి సాగు

Padi-Panta

- పప్పు ధాన్యాలపై తీవ్ర ప్రభావం
- చీడపీడల బెడద తగ్గుముఖం

మునిపల్లి(అందోల్): గతంకంటే పత్తి సాగు జిల్లాలో గణనీయంగా పెరిగిందని వ్యవసాయాధికారుల లెక్కలు చెబుతున్నాయి. సాధారణంగా రైతులు సాగు చేయాల్సిన విస్తీర్ణాన్ని మించి పత్తి పంట సాగు చేస్తున్నారు. పత్తి పంట అధికంగా సాగు చేయడంతో వివిధ రకాల పప్పు ధాన్యాల సాగుపై తీవ్ర ప్రభావం చూపిస్తోందని సంబంధిత వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ప్రతి సంవత్సరం పత్తి పంట సాగును పెంచుకుంటూ పోవడమే తప్ప పప్పుధాన్యాల సాగుపై మొగ్గు చూపకపోవడంతో పత్తి పంటపై రైతులు ఎంత మమకారం పెంచుకున్నారో అర్థం చేసుకోవచ్చు. ఇందుకు పత్తి పంట సాగు తేలిక కావడమే కాకుండా చీడపీడల బెడద కూడా తక్కువనే చెప్పవచ్చు. పత్తి పంటకు సరైన వర్షాలు లేకున్నా తట్టుకునే శక్తి ఉండడంతో రైతులు పత్తి పంటను ఎక్కువగా సాగు చేస్తున్నారు. వివిధ రకాల పప్పుధాన్యాలకు వర్షం సక్రమంగా పడకపోతే పంట ఎక్కడికక్కడ వాడిపోయి.. ఎండిపోవడమే కాకుండా పంట దిగుబడి కూడా అంతంతమాత్రంగానే ఉంటుందని రైతులు గట్టి నమ్మకం పెట్టుకున్నారు. దీంతోనే ఆయా గ్రామాల్లో రైతులు పత్తి పంటను సాగు చేస్తున్నారు. పత్తి పంటలో కలపుతీత పనులు సులువు కావడమే కాకుండా పత్తి పంటకు పురుగు నివారణ కోసం వివిధ రకాల మందులను పిచికారీ చేయడం రైతులకు తేలికవుతుంది. గతంలో పత్తి పంటలకు పచ్చ పురుగు, శనిగ పురుగు బెడద కారణంగా పంట నష్టపోవడంతో వివిధయా గ్రామాల్లో రైతులు తీవ్రంగా నష్టపోయి అప్పుల బాధ తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు ఉన్నాయి.

పెరిగిన సాగు విస్తీర్ణం..

పత్తి పంటను సాధారణం విస్తీర్ణం కంటే రైతులు రెండు రెట్లు అధికంగా సాగు చేస్తున్నారు. గతంలో వివిధరకాల పప్పుధాన్యాలు, జొన్నలు, మిరప, కంది, శనగ, పెసర, మినుము పంటలతోపాటు అనేక పంటలు సాగు చేసేవారు. ఆ పంటల సాగులో పెట్టిన పెట్టుబడి రాకపోవడమే కాకుండా దిగుబడి అంతంతమాత్రం రావడంతో రైతులు పత్తి పంట సాగుపై మమకారం పెంచుకున్నారు. మండలంలోని తాటిపల్లి, చీలపల్లి, పెద్దలోడి, మునిపల్లి, ఖమ్మంపల్లి, పొల్కంపల్లి గ్రామాలతోపాటు ఆయా గ్రామాల్లో పత్తి పంటను రైతులు సాగు చేస్తున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో సుమారు 53,518 ఎకరాలుండగా.. వాటిలో 28 వేల ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేస్తున్నారంటే పత్తి పంటపై రైతులు ఏమేర మమకారం పెంచుకున్నారో అర్థం చేసుకోవచ్చు. మిగతా వ్యవసాయ భూముల్లో చెరుకు, సోయాబీన్, కంది, జొన్న, వరి తదితర పంటలను రైతులు సాగు చేస్తున్నట్లు వ్యవసాయాధికారుల లెక్కలు చెబుతున్నాయి.



పత్తి పంట దిగుబడి కోసం ఎరువు పోస్తున్న యువకులు

ప్రతి ఏటా పెరుగుతుంది..

ఆరు సంవత్సరాల క్రితం మండలంలో కేవలం 8 వేల ఎకరాల్లో రైతులు పత్తి పంట సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. పత్తి పంట అధిక దిగుబడి కోసం వివిధ రకాల చీదపీడలు ఆశించకుండా ఎప్పటికప్పుడు రైతులు వివిధ రకాల మందులను పిచికారీ చేస్తున్నారు. దీంతో వాటి బెడద తగ్గుముఖం పడుతోందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

పత్తి పంటతోనే అధిక లాభం..

వివిధ రకాల పప్పుధాన్యాల కంటే పత్తి పంటపైనే అధిక దిగుబడి సాధించవచ్చు. పత్తి పంటకు గిట్టుబాటు ధర అంతంత మాత్రంగా ఉన్నా దిగుబడి ఎక్కువగా వస్తుంది.

– గొల్ల మధు, తాటిపల్లి

రైతులకు అవగాహన..

పత్తి పంటతోపాటు వివిధ రకాల పంటలు ఎలా దిగుబడి సాధించాలో రైతులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం. పంటల్లో అంతర పంటలు వేయాలని రైతులకు పలు సూచనలు ఇస్తున్నాం.

– రహీం, వ్యవసాయ విస్తీర్ణ అధికారి




చికెన్ (సుగుణ)	స్కిన్	స్కిన్‌లెస్
	135	158

భవిష్యం

మేషం: పనుల్లో ముందడుగు. ఆస్తిలాభం. కార్యజయం. ఆస్తి వివాదాల పరిష్కారం. శుభవార్తలు. వాహనయోగం. వ్యాపారవృద్ధి. ఉద్యోగులకు ఉన్నతహోదాలు.

వృషభం: కొత్త వ్యక్తుల పరిచయం. శుభకార్యాలకు హాజరవుతారు. ఆలయ సందర్శనం. విందువినోదాలు. కుటుంబ సభ్యులతో సఖ్యత. వృత్తి, వ్యాపారాలు సాఫీగా సాగుతాయి.



మిథునం: పనుల్లో జాప్యం. ఆర్థిక ఇబ్బందులు. ఆకస్మిక ప్రయాణాలు. ఆస్తి వివాదాలు. ఆలోచనలు స్థిరంగా ఉండవు. వ్యాపారాలు, ఉద్యోగాలలో ఒత్తిడులు.

కర్కాటకం: దూరప్రయాణాలు. కార్యక్రమాలలో ఆటంకాలు. వ్యయప్రయాసలు. బంధువిరోధాలు. అనారోగ్యం. వ్యాపారాలు నిరాశ. ఉద్యోగులకు పనిభారం.

సింహం: నూతన పరిచయాలు. సంఘంలో గౌరవం. వస్తు, వస్త్రలాభాలు. చిన్ననాటి మిత్రుల కలయిక. విందువినోదాలు. వ్యాపారాలు విస్తరిస్తారు. ఉద్యోగులకు మంచి గుర్తింపు.

కన్య: వ్యయప్రయాసలు. బంధుమిత్రులతో వివాదాలు. అనుకోని ప్రయాణాలు. ఇంటాబయటా చికాకులు. ఆలోచనలు స్థిరంగా ఉండవు. వ్యాపారాలు, ఉద్యోగాలలో ఒడిదుడుకులు.

తుల: దూరపు బంధువుల కలయిక. యత్నకార్యసిద్ధి. చిన్ననాటి మిత్రుల నుంచి కీలక సమాచారం. భూములు, వాహనాలు కొంటారు. వృత్తి, వ్యాపారాలలో అనుకూల మార్పులు.

వృశ్చికం: వ్యవహారాలలో ఆటంకాలు. ఆదాయానికి మించిన ఖర్చులు. బంధువులతో మాటపట్టింపులు. ఆధ్యాత్మిక చింతన. వ్యాపార, ఉద్యోగాలలో నిరుత్సాహం.

ధనుస్సు: దూరప్రాంతాల నుంచి కీలక సమాచారం. విందువినోదాలు. కార్యజయం. గత సంఘటనలు గుర్తుకు వస్తాయి. వ్యాపారాలు విస్తరిస్తారు. ఉద్యోగులకు ఉన్నతస్థితి.

మకరం: ఇంటర్వ్యూలు రాగలవు. ఆస్తి వివాదాల పరిష్కారం. శుభవార్తలు. కుటుంబసభ్యులతో ఉత్సాహంగా గడుపుతారు. వ్యాపారాలు, ఉద్యోగాలలో ప్రోత్సాహకరంగా ఉంటుంది.

కుంభం: రాబడికి మించి ఖర్చులు. ఆకస్మిక ప్రయాణాలు. కుటుంబసమస్యలు. అనారోగ్యం. దైవదర్శనాలు. వృత్తి, వ్యాపారాలలో నిరాశ తప్పకపోవచ్చు.

మీనం: వ్యవహారాలలో అవరోధాలు. ధనవ్యయం. బంధువులతో తగాదాలు. ఆరోగ్యభంగం. వ్యాపారాలు సామాన్యంగా ఉంటాయి. ఉద్యోగులకు కొద్దిపాటి చికాకులు.

– సింహంభట్ల సుబ్బారావు

కన్నుల పండుగ...

వినాయక చవితి వేడుకలు కన్నుల పండుగగా జరుగుతున్నాయి. వీధివీధినా మండపాలను అలంకరించి గణనాథుడికి రకరకాలపూలు, పత్రితో భక్తిశ్రద్ధలతో పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. పర్యావరణ హితంగా ఉండేలా ఈ సారి మట్టి విగ్రహాల వైపు ఎక్కువగా మొగ్గు చూపారు. ఉత్సాహంగా ఫొటోలు దిగుతూ యువత సందడి చేశారు. –సిద్దిపేట జోన్





హలో సాక్షి..

సిద్దిపేట:	98665 53321
సిద్దిపేట రూరల్:	90109 09073
సిద్దిపేట అర్బన్:	99859 16666
చిన్నకోడూరు:	97054 44264
నంగునూరు:	97053 47326
బెజ్జంకి:	94405 01027
చేర్యాల:	80961 45250
కొమురవెల్లి	95055 07605



public demand

సిగ్నల్ టైమర్ పెంచండి



సిద్దిపేట పట్టణంలోని విక్టరీ టాకీస్ కూడలి వద్ద ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్ టైమర్ సమయం తక్కువగా ఉండడంతో వాహనదారులకు ఇబ్బంది కలుగుతోంది. పోలీసు శాఖ వెంటనే టైమర్ సమయాన్ని పెంచితే బాగుంటుంది.

–అజయ్, సిద్దిపేట

గుంతలు పూడ్చాలి



అభివృద్ధిపనులు, ఇతరత్రా అవసరాల కోసం తీసిన గుంతలు పూడ్చకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. మున్సిపల్ అధికారులు వెంటనే గుంతలను పూడ్చేయించేలా చర్యలు తీసుకోవాలి. లేకపోతే ఇబ్బందులు తప్పవు

–సురేశ్, సిద్దిపేట

స్పీడ్ బ్రేకర్ల సంఖ్య తగ్గించాలి



పట్టణంలో అన్ని రోడ్లపై ఇష్టానుసారంగా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. దాంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. అధికారులు చొరవ చూపి స్పీడ్ బ్రేకర్ల సంఖ్య తగ్గించేలా చర్యలు తీసుకోవాలి. అవసరం లేనిచోట వాటిని తొలగించాలి.

–కృష్ణ, సిద్దిపేట

మరిన్ని జోన్ వార్తలు 12వ పేజీలో..

స్మృతి వనం

- మరణించిన ఆత్మీయుల జ్ఞాపకార్థం మొక్కలు
- సిద్దిపేటలో విశేష స్పందన

సిద్దిపేట జోన్

ఆప్యాయతను పంచి, జ్ఞాపకాలను మిగిల్చి కాలగమనంలో తిరిగిరాని తీరాలకు చేరుకున్న ఆత్మీయులతో అనుబంధాన్ని సజీవంగా పదిలపరిచే వినూత్న ఆలోచనే ×స్మృతి వనం₹. సిద్దిపేట పట్టణంలో ఏర్పాటు చేసిన ఈ వనానికి విశేష ఆదరణ లభిస్తోంది. తమను విడిచి వెళ్లిన ఆత్మీయుల జ్ఞాపకార్థం నాటుతున్న ఒక్కో మొక్క వారిలో సాన్నిహిత్య భావన కలిగిస్తోంది.

పుట్టిన రోజు మొక్క నాటుతున్న తరహాలోనే చనిపోయిన వారి జ్ఞాపకార్థం కూడా మొక్కలు నాటే వినూత్న ఆలోచనకు కార్యరూపం సిద్దిపేటలోని స్మృతివనం. పట్టణ శివారులోని ప్రశాంత్ నగర్ హిందూ శ్మశానవాటికలో ఏర్పాటు చేసిన స్మృతి వనం ప్రత్యేకతను చాటుతోంది. తమ కుటుంబలో చనిపోయిన వారి పేరిట కుటుంబ సభ్యులు ఇక్కడ నాటుతున్న మొక్కల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. నామమాత్రం రుసుము చెల్లించి చనిపోయిన వారి పేరిట మొక్క నాటితే మున్సిపాలిటీ వాటి సంరక్షణ బాధ్యత చేపడుతుంది. ఐదెకరాల విశాలమైన స్థలంలో ఏర్పాటు చేసిన స్మృతివనం కోసం ప్రభుత్వం రూ. ఇరవై లక్షలు వెచ్చించింది. నాటిన మొక్క చుట్టూ గార్డెనింగ్, మరణించిన వారి పేరిట శిలాఫలకం ఏర్పాటు చేస్తారు. వారి జయంతి, వర్ధంతి రోజున కుటుంబ సభ్యులు కొద్ది సేపు ఆ మొక్క వద్ద సేదతీరేలా వసతులు ఏర్పాటు చేశారు. అవి ఎదిగే వరకు దాని బాధ్యతలను మున్సిపల్ సిబ్బంది పర్యవేక్షిస్తారు. పచ్చదనం పెంపొందించేందుకు ఆత్మీయులను తలచుకునేందుకూ ఒకే చోట అవకాశం కలిగేలా ఏర్పాటు చేసిన స్మృతి వనంపై మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు.





మొక్కలు నాటుతున్న కుటుంబసభ్యులు

నాన్న జ్ఞాపకంగా...

మా నాన్న మచ్చ బోగారెడ్డి అంటే మాకు ఎంతో ఇష్టం. మమ్మల్ని ప్రేమగా పెంచారు. విధి మా నుంచి మా నాన్నను దూరం చేసింది. ఏటా నాన్న పేరిట కార్యక్రమాలు చేస్తుంటాను. సిద్దిపేట స్మృతి వనంలో ఆయన జ్ఞాపకార్థం ఒక మొక్క నాటాను. ఆయన జయంతి, వర్ధంతి రోజున కుటుంబ సభ్యులమంతా కొద్ది సేపు అక్కడ సేదతీరుతాం.

–మచ్చ వేణుగోపాలరెడ్డి

మంచి సంస్కృతి

తల్లిదండ్రులను అందరూ ప్రాణప్రదంగా ప్రేమిస్తారు. వారిని దేవుళ్ళతో వారిని సమానంగా చూస్తాం. కన్నవారి జ్ఞాపకాలు ఎప్పటికీ నాతో ఉంటాయి. వారి పేరిట సృతివనంలో మొక్క నాటాను. మా అమ్మానాన్నల జయంతి, వర్ధంతి రోజున కొద్దిసేపు మొక్కకు నీరు పోసి తృప్తి చెందుతాను.

–కడవేర్గు రాజనర్సు

వసతి గృహాల సమస్యలు పరిష్కరించాలి

సిద్దిపేట ఎడ్యుకేషన్:

సాంఘిక సంక్షేమ హస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ డివిజన్ కన్వీనర్ వర్మ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ వసతి గృహాల్లో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మెనూ సక్రమంగా పాటించడం లేదన్నారు. త్రాగు నీటి కోసం విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న సంబంధిత అధికారులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. వార్డెన్లు వసతి గృహాల్లో విద్యార్థులకు అందుబాటులో ఉండడంలేదన్నారు. హస్టళ్లలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ఆందోళనలు సైతం నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్, సంపత్, శ్రీకాంత్‌లు ఉన్నారు.

ప్రాజెక్టులను నిర్మించింది కాంగ్రెస్ పార్టీయే

చేర్యాల(సిద్దిపేట): తెలంగాణ రాష్ట్రంలో ప్రాజెక్టులకు కాంగ్రెస్ అడ్డుపడుతుందన్న టీఆర్ఎస్ నాయకులు ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టింది కాంగ్రెస్ పార్టీ అన్న సంగతి తెలీదా అని టీపీసీసీ ఎస్సీ సెల్ కన్వీనర్ ముస్త్యాల కిష్టయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కార్యాలయంలో మండల అధ్యక్షుడు కొమ్ము రవి అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి వకుళాభరణం నర్సయ్యపంతులుతో కలిసి మాట్లాడుతూ... వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నపుడే తెలంగాణ ప్రాజెక్టులను ప్రారంభించి పూర్తి స్థాయిలో నిర్మాణాలు చేపట్టారన్నారు. నాడు రైతులకోసం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టిన కాంగ్రెస్ పార్టీని ప్రాజెక్టులకు అడ్డుపడుతుందని బదనాం చేయడం సరికాదన్నారు. ఈ సమావేశంలో బీసీ సెల్ మండల అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు మంచాల చిరంజీవులు, నాయకులు యాదగిరి, మదు, వెంకటశ్, శ్రీనివాస్, రాజు, సంజీవులు, యాదగిరి, బడేమియా, వెంకటయ్య, కరణ్, కృష్ణమూర్తి, రవి, అయిలయ్య, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

లోకల్ వాయిస్

ప్రహరీ నిర్మించాలి



బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు కాంపౌండ్ వాల్ నిర్మించాలి. విద్యార్థుల సంఖ్య ఎక్కువగానే ఉన్నా కళాశాల సమస్యలు పరిష్కరించడం లేదు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ముఖ్యంగా బాలికలు ఎక్కువగా చదువుకునే ఈ కళాశాల అభివృద్ధికి ప్రాధాన్యమివ్వాలి. రాత్రి వేళ ఆకతాయిల ఆగడాలు ఎక్కువవుతున్నాయి.

–బొనగరి మహేందర్, ఏఐఎస్ఎఫ్

కుటుంబ కలహాలతో తండ్రి..

మనస్తాపంతో కొడుకు..

ఇద్దరి బలవన్మరణంతో విషాదం


సంత్రాలు మృతదేహం


చిన్ని మృతదేహం

మద్దూరు(హుస్నాబాద్): కుటుంబ కలహాలతో విసిగి తండ్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోగా, తండ్రి మృతి వార్త తట్టుకోలేక కొడుకు సైతం పురుగుల మందు తాగి తనువు చాలించాడు. ఈ సంఘటన సిద్దిపేట ఇల్లా సలాఖపూర్‌లో చోటు చేసుకుంది. మద్దూరు ఎస్‌ఐ ఎన్ వీరేందర్ తెలిపిన ప్రకారం.. ధర్మారం గ్రామ శివారు పిట్టలగూడానికి చెందిన గుజారాతి సంత్రాలు (55) కుటుంబసభ్యులతో కలిసి సలాఖపూర్ శివారు మర్మాముల గ్రామానికి చెందిన బండి నర్సింహారెడ్డి వ్యవసాయ బావి వద్ద ఉంటున్నాడు. కాగా, సంత్రాలు వేలేరు మండలం సోడసిపల్లికి చెందిన రాజవ్వను రెండో వివాహం చేసుకొన్నాడు. ఆరు నెలల క్రితం మొదటి భార్య భాగ్యమ్మ వద్దకు వచ్చి అక్కడే ఉంన్నాడు. వారం క్రితం రెండో భార్య దగ్గరకు వెళ్లి రావడంతో భాగ్యమ్మ మందలించింది. దీంతో సంత్రాలు మనస్తాపానికి గురై ఈ నెల 24న పురుగుల మందు తాగాడు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. తండ్రి మరణ వార్త విన్న అతని మూడో కుమారుడు గుజరాతి చిన్ని (18).. పురుగుల మందు తాగి ప్రాణాలు విడిచాడు. భాగ్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

హుస్నాబాద్‌లో చైన్‌స్నాచింగ్

పాలిస్తున్న తల్లి మెడలో నుంచి గొలుసు లాక్కెళ్లిన దుండగులు


బాధితురాలు రేణుక

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలోని సబ్ స్టేషన్ సమీపంలో శనివారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డారు. కోహెడ మండలం పోరెడ్డిపల్లెకు చెందిన కవ్వంపల్లి రేణుక, సత్యనారాయణ దంపతులు చంటిపాపతో, తిమ్మాపూర్ మండలం పర్లపెల్లికి బైక్‌పై వస్తున్నారు. మార్గమధ్యలో హుస్నాబాద్ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సత్యనారాయణ బైక్‌ను పక్కకు ఆపగా, రేణుక చంటిపాపకు పాలు పట్టించసాగింది. ఆ సమయంలో ముఖానికి ముసుగులు ధరించిన ఇద్దరు దుండగులు పల్సర్ బైక్‌పై వచ్చి రేణుక మెడలోంచి నాలుగు తులాల బంగారం గొలుసును లాక్కొని వెళ్లారు. దీంతో ఆమె ఒక్కసారిగా భయభ్రాంతులకు గురై కేకలు వేసింది. ఆమె భర్త సత్యనారాయణ అప్రమత్తమయ్యేసరికి దుండగులు పరారయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంజయ్ తెలిపారు.

నోటికాడి బుక్క..అడవి పందుల పాలు

- మొక్కజొన్న చేను ధ్వంసం
- రూ. 60 వేల పంట నష్టం

వర్గల్(గజ్వేల్): అడవిపందులు రైతన్న వెన్ను విరిచేస్తున్నాయి. పంటలను ధ్వంసం చేస్తూ రైతులకు కన్నీటిని మిగులుస్తున్నాయి. వర్గల్ మండలం అనంతగిరిపల్లికి చెందిన కాయిత రాములు సన్నకారు రైతు. ఆరుతడి పంటగా రెండెకరాల్లో మొక్కజొన్న సాగు చేశాడు. ఎకరానికి దాదాపు రూ.15 వేలు వెచ్చించాడు. బోరు బావి ద్వారా పైరుకు నీరందిస్తూ చేనును కంటికి రెప్పలా కాపాడుకున్నాడు. చేను చక్కగా ఎదిగి, కంకులు ఏర్పడి గింజ పాలుపోసుకుంటున్నది. మరో 15 రోజుల్లో పచ్చికంకులను విక్రయిస్తే చాలు..గండం గడచిపోయినట్లే అనుకున్నాడు. అంతలో అడవి పందుల రూపంలో ఆపద విరుచుకుపడింది. శుక్రవారం రాత్రి మందగా అడవి పందులు రాములు చేనుపై విరుచుకుపడ్డాయి. తెల్లారేసరికి కంకులను తినేసి, కర్రలను తొక్కేసి సర్వనాశనం చేశాయి. దాదాపు రూ.60 వేల నష్టం వాటిల్లింది.

కన్నీరే మిగిలింది..

ఎకరానికి రూ.15 వేల చొప్పున రూ.30 వేలు లాగోడి పెట్టిన. 15 రోజులైతే చేను చేతికందుతుండే. ఎకరానికి 6 టన్నుల లెక్కన 12 టన్నుల పచ్చి కంకులొస్తుండే. మార్కెట్ల అమ్మితే రూ.60,000 వస్తుండె. సరిగ్గ అదను చూసి దెబ్బకొట్టినట్టు అడవి పందులు చేనును సర్వనాశనం చేసినయ్. నోటిముందర బుక్కను ఎత్తగొట్టినయ్. సర్కార్ పంట నష్ట పరిహారం ఇప్పించాలె.

– రైతు కాయిత రాములు, అనంతగిరిపల్లి

జాతీయ కరాటే పోటీలకు హుస్నాబాద్ విద్యార్థులు

హుస్నాబాద్: హైదరాబాద్ అంబర్‌పేట్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 27న నిర్వహించే జాతీయ స్థాయి కరాటే పోటీలకు హుస్నాబాద్ సీవీ రామన్ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. హరిచందన, భువనేశ్వర్, యశ్వంత్, అశ్విత తేజ, శరణ్య ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ కె. నారాయణరెడ్డి శనివారం తెలిపారు. జాతీయ స్థాయిలో రాణించి ఈ ప్రాంతానికి పేరు తేవాలని విద్యార్థులకు సూచించారు. జపాన్ కరాటే గ్రాండ్ మాస్టర్ బొల్లి అయిలయ్య, శిక్షకులు శ్రీనాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు కాంట్రాక్ట్ కార్మికుల జిల్లా సదస్సు

సిద్దిపేటఅర్బన్: అటవీ శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల జిల్లా సదస్సును ఆదివారం సిద్దిపేట పట్టణంలోని పద్మశాలీ కల్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు టీఆర్‌ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర కార్యదర్శి మంచె నర్సింలు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 20 ఏళ్లుగా అటవీశాఖలో కాంట్రాక్ట్ కార్మికులుగా చాలీచాలని వేతనాలతో పని చేస్తున్నామని తెలిపారు. ఇందులో పనిచేసే కార్మికులకు రూ.6,500, రూ.3 వేల చొప్పున వేతనాలు చెల్లిస్తున్నారని, అవి కూడా నెలనెలా చెల్లించడం లేదన్నారు. కనీస వేతనం రూ.8,500 చెల్లించి, పీఎఫ్, ఈఎస్‌ఐ, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

మండపాల్లో మంత్రి ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న మంత్రి

సిద్దిపేట జోన్: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం పారుపల్లిలోని పార్వతి మాత వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద భారీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి ని మండప నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కౌన్సిలర్ మచ్చవేణు గోపాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నందిని శ్రీనివాస్ పాల్గొన్నారు.

అబద్ధాలు.. అప్పుల తెలంగాణ

- అబద్ధాల్లో మంత్రి బ్రాండ్‌అంబాసిడర్
- ప్రజాభిప్రాయ సేకరణ హైడ్రామా
- మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ ధ్వజం

అక్కన్నపేట(హుస్నాబాద్): తెలంగాణను సీఎం కేసీఆర్ అప్పుల తెలంగాణగా మార్చారని, మరోపక్క భారీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా మారారని మాజీ ఎంపీ, టీపీసీసీ ఉపాధ్యక్షుడు పొన్నం ప్రభాకర్ ధ్వజమెత్తారు. అక్కన్నపేటలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రం నెత్తిన రూ.1.65 వేల కోట్ల అప్పు ఉందన్నారు. అభివృద్ధి చెందిన ప్రాంతంలో తన పేరు చెప్పుకుంటూ అభివృద్ధి జరగని ప్రాంతాల్లో ప్రతిపక్షాలు అడ్డుపడుతున్నాయని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు.

'మదర్' స్ఫూర్తితో 'లయన్స్' సేవలు

దుబ్బాక: నోబెల్ అవార్డు గ్రహీత మదర్ థెరిస్సా స్ఫూర్తితోనే లయన్స్ క్లబ్ సేవలను చేపడుతున్నట్టు క్లబ్ జిల్లా అధ్యక్షుడు తడ్కమడ్ల ఈశ్వరయ్య అన్నారు. మదర్ థెరిస్సా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని వైద్య విధుల్లో ఉత్తమ సేవలను అందించిన సిబ్బందిని శనివారం దుబ్బాక సామాజిక ఆరోగ్య కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా 200 దేశాల్లో లయన్స్ క్లబ్ ఉచిత సేవలను అందిస్తోందన్నారు. విధులను ఇష్టపడి చేస్తేనే పేరు ప్రతిష్టలు వస్తాయని ఆయన వైద్య సిబ్బందికి సూచించారు. రాష్ట్రంలోనే దుబ్బాక ఆసుపత్రి సిబ్బంది రోగులకు చేస్తున్న సేవలు బాగున్నాయన్నారు. అనంతరం సేవా భావంతో పని చేస్తున్న ఆసుపత్రి సిబ్బంది దెబోరా, శోభ, రేణుకను శాలువాలతో సన్మానించి మెమొంటోలను అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా కమిటీ సభ్యులు కొమురవెల్లి శేఖర్, గంప రమేశ్, దొంతుల రామచంద్రం, సుభాష్, జోజి, సిబి. వెంకటేశం, డాక్టర్లు జ్యోతి, హేమ్‌రాజ్‌సింగ్, సాయిరామ్ పాల్గొన్నారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధంలేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Weekend

సాక్షి
సిద్దిపేట
| ఆదివారం |
ఆగస్టు | 27 | 2017

మేమే తయారు చేసుకున్నాం..



చెరువులో ఉన్న మట్టిని తెచ్చి ఆవుపేడలో కలిపి విగ్రహాలను మేమే తయారు చేశాం. ఆకర్షణ కోసం కాకుండా భక్తితో పూజించాలి. మట్టివిగ్రహాలతో భూమి సారవంతంగా మారుతుంది. పంటలు బాగా పండుతాయి. 108 మట్టిచెట్ల విగ్రహాలకు 108 చెట్ల పేర్లు పెట్టుకుని ప్రతి రోజు పూజిస్తున్నాం. చెరువులో కాకుండా కొబ్బరి చెట్ల వద్దే నిమజ్జనం చేయనున్నాం.

– శిరీష, పదో తరగతి, చెంచల్‌చెర్వుపల్లి

ప్రాధాన్యతను చాటుతున్నాం..

“ పూర్వీకులు నిర్మించిన చెరువులను కాపాడుకునే బాధ్యత అందరిపై ఉంది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయనాలతో తయారు చేసిన వినాయకవిగ్రహాలతో నీటి కాలుష్యంతో అనేక వ్యాధులు వచ్చే అవకాశముంది. చెరువులను రక్షించుకోవాలంటే మట్టివిగ్రహాలను పూజించాలని తొలి ప్రయత్నంగా విద్యార్థుల నుంచే శ్రీకారం చుట్టాం.

– జీవన్‌రెడ్డి, తిరంగా ఫౌండేషన్, నిర్వాహకుడు, చెంచల్‌చెర్వుపల్లి

పర్యావరణ గణపతికి జై

వినాయకుడంటే విఘ్నాలు తొలగించే ఆది దేవుడు.. ఏ శుభకార్యమైనా వినాయకుడి ప్రతిమను ప్రతిష్ఠించి.. పూజించిన తర్వాతే మిగితా తంతును కొనసాగిస్తారు. ఇది అనాదిగా వస్తున్న సంప్రదాయం. కాగా ప్రస్తుతం వినాయక విగ్రహాలను ప్లాస్టర్ ఆఫ్ పారిస్ రసాయనాలతో వాడకం మూలంగా జీవకోటి మనుగడకు పెనుప్రమాదం వాటిల్లడంతో.. వాతావరణం, నీటి కాలుష్య నివారణకు ‘తిరంగా ఫౌండేషన్’ సరికొత్త సంప్రదా యానికి తేరలేపింది. నేటి విద్యార్థులే బావిభారత పౌరులని, ఈ సరికొత్త ప్రయోగానికి విద్యార్థుల నుంచే నాంది పలకాలనే సంకల్పంతో సమాజానికి ఓ చక్కటి సందేశాన్ని ఇచ్చేందుకు ‘తిరంగా ఫౌండేషన్’ పూనుకుంది. కోహెడ మండలం చెంచల్‌చెర్వుపల్లిలో ‘తిరంగా ఫౌండేషన్’ అనేక సామాజిక కార్యక్రమాలతో ప్రజలను చైతన్యపరుస్తోంది. నీటి కాలుష్య నివారణకు మట్టిగణపతుల విగ్రహాలను వినియోగించాలనే కాన్సెప్ట్‌తో సమాజానికి ఆదర్శంగా నిలిచేలా తమ వంతు బాధ్యతను నెరవేర్చే ప్రయత్నం చేస్తోంది...

– హుస్నాబాద్



మట్టి వినాయకులను తయారు చేస్తున్న విద్యార్థినులు

అందరూ దేవుడిని పూజిస్తే.. వీళ్లు ప్రకృతిని ప్రేమిస్తున్నారు

- ఆవుపేడ, చెరువు మట్టి మిశ్రమంతో మట్టి విగ్రహాల తయారీ
- సరికొత్త సంప్రదాయానికి నాంది పలికిన విద్యార్థులు
- 108 మట్టిచెట్ల వినాయకులకు పూజలు..
- చెట్ల వద్దే నిమజ్జనం చేస్తున్న వైనం
- నీటికాలుష్య నివారణకు ఇతోధిక సేవ

జీవవైవిధ్యం, వినాయకచవితి పండుగను ఎందుకు జరుపుకొంటారు.. మట్టివిగ్రహాల ద్వారా కలిగే లాభాలు, వివిధ రసాయనాలతో తయారు చేసే విగ్రహాలవల్ల జరిగే నష్టాలు, మట్టి గణపతుల తయారీ విధానంపై తిరంగా ఫౌండేషన్ సభ్యులు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతోపాటు, యువకులు, ప్రజలకు అవగాహన కల్పిస్తూ.. పర్యావరణ కాలుష్యంపై పెద్దఎత్తున ప్రచారం నిర్వహిస్తోంది.

మట్టి విగ్రహాలనే ఎందుకు పూజించాలి..

‘భిన్నత్వంలో ఏకత్వం’ అన్నట్లు అన్నిదేశాల కంటే మనదేశంలో ఏది చేసినా ఓ గొప్పదనం ఉంటుంది. ఏ కల్చర్ ఫాలో అవుతున్నామో? ప్రతి దాని వెనుక ఒక సైంటిఫిక్ మెథడ్ ఉంటుంది. గ్రామాల్లో ఉండే రైతులు ఆగస్టులో చెరువులోంచి మట్టి తెచ్చి ఇంటికొక్కరు 21 ఔషధ మూలికలు, మొక్కలతో పూజించే వారు. 41 రోజుల తర్వాత వినాయకవిగ్రహంతోపాటు మొక్కలను చెరువులో నిమజ్జనం చేసే వారు. ఈ విధానంతో చెరువులో ఉండే జీవకోటికి ఆహారం లభించేది. ముఖ్యంగా ఎర్రలు (వానపాములు) ఈ ఔషధమొక్కలను తిని రైతుల వ్యవసాయ భూములల్లో విసర్జించేవి. దీని ద్వారా భూమికి ఎరువు లభించి పంటలు పండేవి.



నిమ్మచెట్టు పేరుతో మట్టి విగ్రహం

108 మట్టి చెట్ల వినాయకులు..

గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పర్యావరణ సమతుల్యం పాటించేలా ఆవుపేడ, చెరువుమట్టి మిశ్రమంతో మట్టివిగ్రహాలను తయారు చేసి గ్రామస్తులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు వారం పదిరోజుల నుంచి సెలవు దినాల్లో చెరువులోకి వెళ్లి మట్టి, పశువుల కొట్టం వద్ద నుంచి ఆవు పేడను సమకూర్చి ఈ రెండు మిశ్రమాలతో 108 మట్టి వినాయకుల విగ్రహాలను తయారు చేశారు. ఒక్కో విగ్రహానికి ఒక్కో చెట్టు పేరు పెట్టి ఈ విగ్రహాలను పాఠశాలలో ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు. ఈ విధానంతో గ్రామ యువకులు, ఇతర పాఠశాలలు, గ్రామాలకు ఓ చక్కటి సందేశాన్ని ఇచ్చేలా వినాయక నవరాత్రుల ఉత్సవాలు జరుపుకొంటున్నారు.

ఉపయోగాలు అనేకం..

ఆవుపేడ, చెరువులోని మట్టితో చేసిన వినాయక విగ్రహాలవల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. గ్రామంలో ఉన్న యువకులు, ప్రజలు ఉన్న వనరులను ఉపయోగించుకోకుండా, పట్టణాలకు వెళ్లి వినాయక విగ్రహాలను కొనుగోలు చేయడం ద్వారా వృథా ఖర్చులను తగ్గించుకునే అవకాశం ఉంది. విద్యార్థులే చెరువుకు వెళ్లి మట్టిని తేవడం వల్ల ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మిషన్ కాకతీయ, మన ఊరు మన చెరువులో భాగంగా పూడిక తీయడం, విద్యార్థులకు చెరువుతో ఉన్న సంబంధం పెంపొందుతుంది. దేశంలో మట్టి వినాయకులను తయారు చేసే ఏ ఒక్కరూ ఆవుపేడ కలుపరు. సకల దేవతలు ఆవులో నివసిస్తాయని పండితులు, పామరులు చెబుతుంటారు. మనం జరుపుకొనే ఈ పండుగలు, ఉత్సవాలు, ఆచారాలు, సంప్రదాయాల వెనుక ఏదో ఒక సైంటిఫిక్ మెథడ్ ఉంటుంది. అందులో భాగంగానే ఒక గ్రాము ఆవుపేడలో 300 కోట్ల సూక్ష్మజీవులుంటాయని. ఈ సూక్ష్మ జీవరాశులు భూమికి అవహించడంవల్ల భూసారం పెరుగుతుందని సెంటిఫిక్ మెథడ్ ద్వారా తెలుస్తోంది.

చెట్ల వద్దే నిమజ్జనం..

వినాయక నవరాత్రుల సందర్భంగా తొమ్మిది రోజుల పాటు బొజ్జ గణపయ్య, తన భక్తుల శతకోటి పూజలను అందుకుంటాడు. తొమ్మిది రోజుల అనంతరం విగ్రహాలను గ్రామాల్లోని చెరువుల్లో నిమజ్జనం చేస్తారు. కానీ ఇక్కడి విద్యార్థులు మాత్రం ‘తిరంగా ఫౌండేషన్’ ఆధ్వర్యంలో గ్రామంలోని రహదారులకు ఇరువైపులా ఇటీవల నాటిన కొబ్బరి మొక్కల వద్దే విగ్రహాలను నిమజ్జనం చేస్తారు. దీని ద్వారా మట్టిలో ఉండే లవణాలు, పేడలో ఉండే సూక్ష్మక్రిములతో మొక్కలు తొందరగా చెట్లుగా పెరిగే అవకాశం ఉంటుంది. 108 వినాయకవిగ్రహాలను చెరువులో నిమజ్జనం చేయకుండా ఉండడంతో చెరువులను కాపాడుకోవచ్చనే సందేశం అందిస్తున్నారు. వివిధరకాల రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలను చెరువులో నిమజ్జనం చేసినట్లేయితే చెరువులు నాశనమై, నీరంతా భూమిలో ఇనుకడం మూలంగా ఉష్ణోగ్రత పెరిగి, వర్షాలు కురువకపోవడంతో పర్యావరణం దెబ్బతింటుందని విద్యార్థుల్లో మెదిలిన భావన. అందుకే విద్యార్థులు మట్టిచెట్ల వినాయకుల తయారీతో మహాకార్యానికి శ్రీకారం చుట్టారు.

మట్టివినాయకులను పూజించడమే శ్రేష్టం..



వివిధరకాల రసాయనాలతో వినాయక విగ్రహాలను పూజించడం, తద్వారా చెరువులో నిమజ్జనం చేయడం ప్రాణకోటికి పెనుముప్పు వాటిల్లుతోంది. మట్టితో తయారు చేసిన విగ్రహాలను పూజించడంవల్ల పర్యావరణం, నీటి కాలుష్యం నివారించవచ్చు. రంగు రంగుల డిజైన్లతో చేసి విగ్రహాలను నిమజ్జనం చేయడంవల్ల నీటి కాలుష్యంతో రకరకాల వ్యాధులు సంక్రమిస్తాయి.

– స్నేహ, పదో తరగతి, చెంచల్‌చెర్వుపల్లి



పశువుల కొట్టం నుంచి ఆవుపేడను తీస్తున్న విద్యార్థులు

ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం..



పాఠశాలలో ప్రత్యేకంగా తిరంగా ఫౌండేషన్ మట్టివిగ్రహాలపై అవగాహన కల్పించారు. వారి స్ఫూర్తితో మట్టివిగ్రహాలవల్ల వాటిల్లే లాభనష్టాలపై ప్రజలకు వివరిస్తున్నాం. చెరువువల్ల ఉపయోగాలు తెలుసుకున్నాం. చెరువులు బతికించుకోవాలంటే అందరం మట్టి విగ్రహాలనే పూజించాలి. మేమే మట్టివిగ్రహాలను స్వయంగా తయారు చేసి అవగాహన కలిస్తున్నాం. మా ప్రయత్నం కొంత మందికైనా స్ఫూర్తిని ఇస్తుందని ఆశిస్తున్నాం. అందరం నీటి వనరులను కాపాడుకుంటేనే ఊరు బాగుపడుతుంది.

– రమణ, పదో తరగతి, చెంచల్‌చెర్వుపల్లి



చెరువు నుంచి మట్టిని తోడుతున్న విద్యార్థులు

Weekend

'వినాయకుడు-నేను-సెల్ఫీ

Villageలో వినాయకుడు


సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోని అధిక శాతం ప్రజలు పర్యావరణ గణపతి విగ్రహాలను తమ మండపాల్లో.. ఇళ్లల్లో ప్రతిష్ఠించి 'శ్రీ గణనాథం భజామ్యహం.. శ్రీకరం అగ్రపూజ్య ఫలదం' అంటూ పూజలు చేస్తున్నారు. వీధివీధినా అందంగా అలకరించిన గణేశుడి విగ్రహాలకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మట్టి వినాయకుడితో సెల్ఫీలు తీసుకుని 'సాక్షి'కి పంపారు

– సాక్షి, నెట్‌వర్క్


గండె సంతోశ్, సిద్దిపేట


పుల్కల్ నుంచి ఆంజనేయులు పంపిన చిత్రం


మెదక్‌మున్సిపాలిటీ: సరస్వతీ శిశుమందిర్ గణేశ్ మండలి


పంపిన వారు: చేర్యాల అంజని, సిద్దిపేట


చిన్నారులు, అమీన్‌పూర్, పటాన్‌చెరు


గణేశ్ ప్రతిమతో ఓ భక్తుడు


ఓంకార్ యూత్ అసోసియేషన్, సంగారెడ్డి


సంగారెడ్డి పట్టణ శివారులోని వైకుంఠపురం దేవాలయంలో 18 అడుగుల మట్టి వినాయకుడు


మెదక్‌రూరల్: మంబోజపల్లిలో కొలువుదీరిన గణనాథుడు


గజ్వేల్‌రూరల్: సంగుపల్లిలో ప్రతిష్ఠించిన 22 అడుగుల గడ్డి గణపయ్య


మెదక్‌మున్సిపాలిటీ: పంచముఖి గణేశ్ మండలి ఆధ్వర్యంలో..


జెడ్పీహెచ్‌ఎస్, కోత్లాపూర్‌లో..


వంజరి నాగరాజు, సిద్దిపేట


బి.సన్నిహిత్, అక్షయ్, శివ్వంపేట


శివలీలమ్మ, ఎన్మెపల్లి, రాయికోడ్ మండలం


పంపినవారు: శివ్వ శ్రీనివాస్, సిద్దిపేట


అఖిల్ ఈశ్వర్‌రెడ్డి, బీరంగూడ, పటాన్‌చెరు


పంపిన వారు: మహేశ్ కుల్‌కర్ణి, జహీరాబాద్



మట్టి గణపయ్యను తయారు చేస్తూ ఓ చిన్నారి


ప్రభుత్వ పాఠశాల సిద్దిపేటలో ప్రతిష్ఠించిన మట్టి గణపతి విగ్రహం


శ్రీయాంశ్, గజ్వేల్


ప్రవీణ్, నస్తీపూర్, హత్నూర మండలం


ఆదర్శ ఫ్రెండ్స్ యూత్, నంగునూరు


మట్టి గణపయ్యలతో భక్తుల పారవశ్యం


వడియారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు


ధనుష్, పటాన్‌చెరు


మట్టి వినాయకుడికి రంగులద్దుతున్న ఓ భక్తుడు


విక్రాంత్‌గౌడ్, సుక్రుత్‌గౌడ్, జోగిపేట

ఆకట్టుకుంటున్న కరెన్సీ గణేశ్ మండపం

కుస్నూర్ గ్రామంలో యువజన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని మండపం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. వినాయకుడి మండపాన్ని రూ.50, 20, 10 నోట్లతో అలంకరించారు. మండపం తయారీకి రూ.50 వేల విలువగల నోట్లను వినియోగించారు. – రాయికోడ్(అందోల్)



ఆదరణ.. అదరహో..

- 80 ఏళ్లుగా గణపయ్యకు ఉత్సవాలు
- నిజాం పాలనలోనూ కొనసాగిన వైనం
- మెదక్‌లో బాలభారత్ గణేష్ మండలి ప్రత్యేకత

మెదక్‌జోన్: నిజాం పాలన నిర్బంధంలోనూ వినాయకచవితి ఉత్సవాలను జరిపి.. హిందువుల మనోభావాలను నిలబెట్టిన ప్రత్యేకత మెదక్ పట్టణంలోని బాలభారత్ గణేష్ మండలికే దక్కుతుంది. నాటి నుంచి నేటి వరకు ఈ ఉత్సవాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఆనాడు నైజాం చేపట్టిన అనైతిక పాలనకు ఎదురొడ్డి నిలిచిన స్వాతంత్ర్య సమరయోధుడు బట్టి కిష్టయ్య, కేవల్ శంకరయ్య, అంబాడి పాండురంగం, ముక్క కృష్ణమూర్తి, ఆరుణార్తి విఠల్, బల్దె పెంటయ్య, రెడ్డిశెట్టి రవీందర్, చింతల కృష్ణమూర్తిలతోపాటు మరికొందరు బాలభారత్ గణేష్ మండలిగా ఏర్పడి 1938 నుంచి పట్టణంలోని కుమ్మరిగడ్డ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రతి ఏటా వినాయకచవితి సందర్భంగా విగ్రహాన్ని ప్రతిష్ఠించి నవరాత్రులు ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. నేటికి 79 సంవత్సరాలు కావస్తున్నా.. బాలభారత్ గణేష్ మండలి ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు కొనసాగుతూనే ఉన్నాయి. స్వాతంత్ర్యం రాకముందు నిజాం నిర్బంధ పాలనలోనూ వినాయకుడి మట్టి విగ్రహాన్ని ప్రతిష్ఠించి నైజాం అధికారుల కంటబడకుండా రాత్రి వేళ ప్రత్యేక పూజలు చేసి ఉత్సవాలను కొనసాగించే వారు. నవరాత్రుల అనంతరం ఆనాటి అధికారుల కంట పడకుండా ఓ చిన్నపాటి తట్టలో బొజ్జ గణపయ్య మట్టివిగ్రహాన్ని పెట్టుకుని.. దారివెంట కొందరు కాపలా కాస్తుంటే.. మరికొందరు వెళ్లి చెరువులో నిమజ్జనం చేసే వారు. అంతటి నిర్బంధ సమయంలోనూ ఆది దేవునికి పూజలు చేసిన ఘనత కుమ్మరిగడ్డ బాలభారత్ గణేష్ మండలి దక్కింది. ఆనాడు మొదటగా ఏర్పాటు చేసిన వారిలో అత్యధికులు స్వాతంత్ర్య సమరయోధులు కావడం గమనార్హం. నేటికీ వారి పిల్లలు తల్లిదండ్రుల ఆచారాన్ని కొనసాగిస్తున్నారు. తదనంతరం నేడు పట్టణంలో సుమారు 200 పైచిలుకు వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. మెదక్ పట్టణంలో మొదటిసారిగా వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసింది ఎవరంటే కుమ్మరిగడ్డ బాలభారత్ గణేష్ మండలి అనే అందరూ చెబుతారు. ఇప్పటికీ 9 రోజులపాటు ప్రత్యేక ఉత్సవాలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టి, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ఆనాటి నుంచి సంప్రదాయంగా వస్తోంది. ఎంతో ప్రాముఖ్యతగల ఈ హనుమాన్ ఆలయంలో నవరాత్రి ఉత్సవాల అనంతరం ప్రతి ఇంటికీ ప్రసాదం పంపడం ప్రత్యేకత. దసరా ఉత్సవాల సందర్భంగా నిర్వహించే దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను సైతం నిర్వహిస్తుంటారు. ఈ కుమ్మరిగడ్డ వీధిలోని అనాది దేవాలయంలో వేంకటేశ్వరస్వామి, సత్యనారాయణ, ఆంజనేయస్వామి, సంతోషిమాత, నవగ్రహాలతోపాటు సకల దేవతలు ఇక్కడ కొలువయ్యారు. ప్రతి శ్రావణమాసం, మహాశివరాత్రి సమయంలో పెద్దఎత్తున ఉత్సవాలు కొనసాగుతాయి. మెదక్ పట్టణానికి చెందిన అత్యధిక ప్రజలు కుమ్మరిగడ్డ బాలభారత్ గణేష్‌మండలి వారు ఏర్పాటు చేసిన వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొనడం అనవాయితీగా వస్తోంది.



1996లో బాలభారత్ గణేశ్ మండలి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహం (ఫైల్)



ఆలయంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



కుమ్మరిగడ్డ వీధిలోని పురాతన హనుమాన్ ఆలయం

గణేశ్ మండపాల వద్ద నిఘా పెంచాం

ప్రత్యేక బలగాలను రంగంలోకి దించాం • అసాంఘిక శక్తుల చర్యలను అరికడతాం • నిమజ్జన ప్రాంతాల్లో ప్రత్యేక బందోబస్తు

సంగారెడ్డిక్రైం: వినాయకచవితి, బక్రీద్ పండుగల సందర్భంగా సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల శాంతిభద్రతల విషయంపై సంగారెడ్డి జిల్లా ఎస్పీ, సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జి పోలీస్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డితో ప్రత్యేక ఇంటర్వ్యూ..

సాక్షి: శాంతిభద్రతల విషయంలో మీరు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్పీ: శాంతిభద్రతలపై సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు చేశాం. సంగారెడ్డి జిల్లాకు 429, సిద్దిపేటకు 350 మంది స్పెషల్ ఫోర్స్‌ను రంగంలోకి దించాం.

సాక్షి: భద్రత బలగాలను ఎక్కడెక్కడ మోహరించారు?

ఎస్పీ: సంగారెడ్డి జిల్లాలో జహీరాబాద్, పటన్‌చెరువు, నారాయణఖేడ్, సదాశివపేట, సంగారెడ్డి, కంగ్టి, సిదిపేట జిల్లాలో గజ్వేల్, హూస్నాబాద్, చేర్యాల, దుబ్బాక, తొగుట, సిద్దిపేట ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత చర్యలు చేపట్టాం.

సాక్షి: మండపాలవద్ద సౌండ్ విషయంపై ఎలాంటి నిబంధనలు ఉన్నాయి?

ఎస్పీ: గణేశ్ మండపాల వద్ద నిర్వాహకులు డీజే సౌండ్ పెట్టవద్దని ముందుగానే సమాచారం ఇచ్చాం. ఇతరులకు ఇబ్బంది కలగకుండా చిన్నగా సౌండ్ ఏర్పాటు చేసుకోవచ్చు.

సాక్షి: వినాయక నవరాత్రి ఉత్సవాలు, బక్రిద్ ఒకేసారి రావడంతో భద్రతాపరంగా ఎలాంటి చర్యలు చేపట్టారు?

ఎస్పీ: వినాయకచవితి, బక్రీద్ పండుగల సందర్భంగా శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా అనేక చర్యలు చేపట్టాం. పోలీస్‌స్టేషన్ల పరిధిలో శాంతి కమిటీ సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాం.

సాక్షి: సోషల్ మీడియాలో వచ్చే పుకార్లపై ప్రజలకు ఎలాంటి సూచనలు ఇస్తున్నారు?

ఎస్పీ: సోషల్ మీడియాతో ఓ వైపు లాభం, మరో వైపు నష్టం వాటిల్లుతోంది. అసాంఘిక శక్తులు తప్పుడు పోస్టులు చేసినా, రెచ్చగొట్టే ప్రసంగాలు పెట్టిన వెంటనే పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేయాలి. దానిపై వెంటనే చర్యలు తీసుకుంటాం.



చంద్రశేఖర్‌రెడ్డి

సాక్షి: జిల్లాలో ఎన్ని వినాయక మండపాలకు అనుమతి ఇచ్చారు?

ఎస్పీ: సిద్దిపేట జిల్లాలో 1,877, సంగారెడ్డి జిల్లాలో 3,,506 మండపాలకు అనుమతులు ఇచ్చాం.

సాక్షి: నిమజ్జనం రోజు ఇబ్బందులు కలకుండా ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

ఎస్పీ: ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తుగానే నిమజ్జనం చేసే ప్రాంతాల్లో పోలీసు బందోబస్తుతో ఏర్పాటు చేస్తాం.

భక్తి శ్రద్ధలతో నిమజ్జనాలు జరుపుకోవాలి. చెరువుల్లో నిమజ్జన సమయాల్లో చిన్నపిల్లలను రానీయవద్దు. నిమజ్జన వాహనాల డ్రైవర్లు మద్యం సేవించకుండా నిర్వాహకులు తగిన జాగ్రతలు తీసుకోవాలి.

సాక్షి: ట్రాఫిక్ విషయంలో ఎలాంటి జాగ్రతలు తీసుకుంటున్నారు?

ఎస్పీ: అన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్ నిబంధనలు కఠినంగా అమలు చేస్తున్నాం. గణపతులు నిమజ్జనం చేసే ప్రాంతాల్లో ముందస్తుగానే బారికేడ్లు ఏర్పాట్లు చేస్తాం. ఎప్పటికప్పుడు పోలీసుల నిఘా ఉంటుంది.

సీపీఎస్‌ను రద్దు చేయాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న భాస్కర్ తదితరులు

కోహెడ(హుస్నాబాద్): సీపీఎస్‌ను వెంటనే రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని టీసీపీఎస్ఈఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మండ్ల భాస్కర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీపీఎస్ నిరసన కార్యక్రమానికి సంబందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. సీపీఎస్‌ను వ్యతిరేకిస్తూ సెపెటంబర్ 1వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయాల ఎదుట నల్ల బాడ్జీలు ధరించి ధర్నా నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు చేరాల తిరుపతి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు బుడుగు రాజేందర్, ప్రధాన కార్యదర్శి పచ్చిమట్ల అనిల్‌కుమార్, పాము చంద్రశేఖర్, ఎం.డి.ఫరీద్, జాలిగం బాబు పాల్గొన్నారు.

కందిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి


పంటను పరిశీలిస్తున్న దృశ్యం

జగదేవ్‌పూర్(గజ్వేల్): కంది పంట సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని తెలంగాణ సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డీఎం హెచ్‌కే సింగ్ అన్నారు. సీఎం దత్తత గ్రామాలైన ఎర్రవల్లి, నర్సన్నపేట గ్రామాల్లో విత్తనోత్పత్తి పంటల కింద సాగు చేసిన కంది, సోయాబీన్ పంటలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సోయాబీన్ పంటలు బాగానే ఉన్నాయని చెప్పారు. కంది పంటలో లద్దె పురుగు ఉందన్నారు. లద్దె పురుగు నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఓఎస్‌డీ రాంచంద్రం సలహా మేరకు క్రిమిసంహారక మందును ఒకటి రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు. ఎక్కువ మోతాదులో ఎరువులను వాడొద్దని సూచించారు. కార్యక్రమంలో ఏఓ రమేష్, ఏఈఓ శివకుమార్, రెండు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

నెత్తుటి మరకలకు 69 సంవత్సరాలు

- బైరాన్‌పల్లిలో జలియన్‌వాలాబాగ్‌ను మించిన నరమేధం
- రజాకార్ల దాడిలో 118 మంది గ్రామస్తుల బలి

మద్దూరు(హుస్నాబాద్):

జలియన్‌వాలాబాగ్ దురంతాన్ని తలపించిన వీరాబైరాన్‌పల్లి నెత్తుటి చరిత్రకు ఈ నెల 27వ తేదీతో 69 ఏళ్లు నిండాయి. రజాకార్ల పాశవిక దాడులను ఎదిరించి పోరాడిన బైరాన్‌పల్లి వీరుల ప్రాణత్యాగం మరువలేనిది. బైరాన్‌పల్లి మాతృ భూమి విముక్తి కోసం 118 మంది యోధులు నేలకొరిగారు. 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ప్రజలు స్వేచ్ఛా వాయువులు పీలుస్తుండగా నిజాం రాజు గుప్పిట్లో ఉన్న తెలంగాణ ప్రాంతం మాత్రం రజాకార్ల దురాగతాలకు బలై బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీసింది. నాటి నెత్తుటి మరకలకు నేటితో 69 ఏళ్లు... అది 1948 ఆగస్టు 27వ తేదీ వేకువజామున 4 గంటల ప్రాంతం. నిజాం సైన్యాధిపతి ఖాసీం రజ్వీ సైనికులు(రజాకార్లు) గ్రామంలో తమకు జరిగిన అవమానానికి ప్రతీకారం తీర్చుకునేందుకు 1,200 మంది సైన్యంతో అర్ధరాత్రి 12 గంటలకు పది ట్రక్‌లతో జనగామ నుంచి బయలుదేరారు. రాత్రి 2 గంటలకు లద్నూర్ గ్రామానికి చేరుకొని 3 గంటలకు బైరాన్‌పల్లి గ్రామాన్ని నలు దిక్కులా చుట్టు ముట్టారు. తెల్లవారు జామున 4 గంటలకు ఉల్లెంగల(వడ్ల) నర్సయ్యను గ్రామం చివరకు బహిర్భూమికి వెళ్లడంతో మాటువేసిన రజాకార్లు పట్టుకున్నారు. గ్రామంలోని బురుజు వద్దకు దారి చూపాలని వెంట పెట్టుకొని వస్తుండగా వారిని నెట్టేసి రజాకార్లు గ్రామాన్ని చుట్టుముట్టారంటూ పెద్దగా కేకలు వేస్తూ పరుగులు పెట్టాడు. దళ కమాండర్ ఇమ్మడి రాజిరెడ్డి ప్రజలంతా తగిన రక్షణలో ఉండాలని కోరుతూ నగారా మోగించారు. గ్రామస్తులంతా బురుజు వద్ద గడీలోకి పరుగులు తీశారు. యువకులు గ్రామానికి నాలుగు వైపులా కాపు కాసి శత్రువులను గ్రామంలోకి రాకుండా చూడాలని హెచ్చరికలు జారీ చేశారు. గ్రామాన్ని చుట్టుముట్టిన రజాకార్లను తరిమి వేయడానికి బురుజు పైనుంచి కాల్పులు ప్రారంభించారు. గ్రామస్తులు ఏవైపు నుంచి కాల్పులు జరుపుతున్నారో చూసి రజాకార్లు కూడా కాల్పులు ప్రారంభించారు. కాల్పులు కొనసాగుతున్న సమయంలో బురుజు పైనున్న మందుగుండు సామగ్రిలో నిప్పు రవ్వలు ఎగిసిపడ్డాయి. మందుగుండు సామగ్రి పేలి బురుజుపై ఉన్న వారు నేలకొరిగారు. బురుజుపై నుంచి కాల్పులు ఆగిపోవడంతో రజాకార్లు గ్రామంలోకి చొరబడి దొరికిన వారిని దొరికినట్లు చంపారు. ప్రజలకు హెచ్చరికలు జారీ చేస్తూ... బురుజుపైనున్న కొందరిని కిందకు దింపి వరుసగా నిల్చోబెట్టి దారుణంగా కాల్చి చంపి రక్తదాహాన్ని తీర్చుకున్నారు. గ్రామం మొత్తాన్ని వల్లకాడుగా మార్చారు.


బైరాన్‌పల్లి బురుజు వద్ద నిజాం రజాకార్లకు ఎదురొడ్డిన వీరులు(ఫైల్)

శవాల చుట్టూ బతుకమ్మ ఆట

బతుకు భయంతో పరుగులు పెడుతున్న మహిళలను వెంటాడి పట్టుకున్నారు. అనేక మంది మహిళలపై అత్యాచారానికి పాల్పడ్డారు. గుట్టలుగా పడి ఉన్న శవాల చుట్టూ మహిళలను వివస్త్రలను చేసి బతుకమ్మ ఆటలు ఆడించి కసి తీర్చుకున్నారు. ఈ ఉదంతంలో గ్రామస్తులు 118 మంది వీరామరణం పొందారు. నిజాం రజాకార్లు 25 మంది మృతి చెందారు.

పోరాటానికి గుర్తింపు కరువు

మాతృభూమి విముక్తి కోసం రజాకార్లతో వీరోచిత పోరాటం చేసి నేలకొరిగిన అమరుల త్యాగాలను గత ప్రభుత్వాలు ఏనాడూ పట్టించుకున్న పాపాన పోలేదు. స్వాతంత్ర్య పోరాట సమయంలో జరిగిన జలియన్ వాలాబాగ్ ఘటనను మించిన బైరాన్‌పల్లి పోరాటాన్ని ప్రభుత్వాలు పాఠ్యాంశాల్లో చేర్చకపోవడం శోచనీయమని సర్పంచ్ బర్మ రాజమల్లయ్య ఆవేదన వ్యక్తం చేశారు. అమరుల కుటుంబాలను ప్రభుత్వాలు ఆదుకోకపోవడంతో నేటికీ ఆ కుటుంబాలు దయనీయ పరిస్థితిలో కాలం వెల్లదీస్తున్నాయి. నాటి పోరాటంలో పాలుపంచుకున్న సమరయోధులకు నేటికీ పెన్షన్ అందడం లేదు. స్వరాష్ట్రం కోసం సాగిన తొలి, మలి దశ ఉద్యమాలకు స్ఫూర్తినిచ్చిన వీర బైరాన్‌పల్లి పోరాటాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలని పలువురు కోరుతున్నారు.

ప్రాణాలను అడ్డుపెట్టి..



దొంగ దెబ్బ తీసేందుకు రజాకార్లు గ్రామంలోకి ప్రవేశించడానికి ప్రయత్నం చేశారు. ప్రాణాలను అడ్డుపెట్టి రజాకార్ల కీచక చర్యలను ఎదుర్కొన్నాం. నేటికీ... ఆ నాటి రజాకార్ల దుశ్చర్యలు కళ్ల ముందు కదిలాడుతున్నాం.
– చల్లా చంద్రారెడ్డి. సమర యోధుడు

పర్యాటక కేంద్రంగా..



నిజాం సైన్యాధిపతి ఖాసీం రజ్వీ పైశాచిక దాడులను ఎదుర్కొని దేశంలోనే చరిత్ర సృష్టించి... ప్రజలందరికీ స్ఫూర్తిగా నిలిచిన వీరా బైరాన్‌పల్లిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి. ప్రభుత్వం ఆ దిశగా తగిన చర్యలు తీసుకోవాలి.
– బర్మ రాజమల్లయ్య, సర్పంచ్

జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన సిద్దిపేట విద్యార్థులు

సిద్దిపేట ఎడ్యుకేషన్: గత మూడు రోజులుగా సిద్దిపేట జిల్లా కేంద్రంలో జరుగుతున్న కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ అండర్ 14, 17 విభాగాల్లో సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి 19 మంది విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం తెలిపారు. అండర్ 17 విభాగంలో వాలీబాల్‌లో తిరుపతిరెడ్డి, రోహిత్, కబడ్డీలో పరమేశ్వర్, శివ, ఖోఖోలో సురేష్, శ్రీకాంత్, అండర్ 14 విభాగంలో శేఖర్, నరేష్, పవన్, పండరి, అకాశ్, శ్రీనికాంత్, ప్రకాష్, మహిపాల్, రామ్, అనిల్‌కుమార్ ఎంపికయ్యారు. విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం భగవంతయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

కోహెడరూరల్(హుస్నాబాద్): కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని తపస్(టీపీయూఎస్) సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు రిక్కల రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం కోహెడ మండలంలోని పలు గ్రామాల్లో తపస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 1వ తేదీన ఉపాధ్యాయులందరూ సామూహిక సెలవు పెట్టి ప్రభుత్వానికి నిరసన తెలపాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సింగోజు జనార్ధన్, జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి, మండలాధ్యక్షుడు దేవేందర్‌రావు, రాజిరెడ్డి, వెంకటేశ్వర్లు, సంపత్‌కుమార్, కిష్టారెడ్డి, సత్యానంద్, ధర్మయ్య పాల్గొన్నారు.

గౌడకులస్తుల సంక్షేమానికి కృషి చేయాలి

టీఆర్ఎస్ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లేశంగౌడ్

చేర్యాల(సిద్దిపేట): గౌడకుస్తుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని టీఆర్ఎస్ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుంకరి మల్లేశంగౌడ్ కోరారు. శనివారం మండలంలోని దొమ్మాట, ముస్త్యాల గ్రామాల్లో గౌడ సంఘాల ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పాపన్న విగ్రహం, చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్వాయి పాపన్న గౌడ సంఘం మండలాధ్యక్షుడు మాచర్ల ఆంజనేయులుగౌడ్ అధ్యతన ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కన్వీనర్ ముత్యం నర్సింహులు గౌడ్‌తో కలిసి మల్లేశంగౌడ్ మాట్లాడుతూ గౌడకులస్తుల అబివృద్ధి కోసం ప్రతి గ్రామంలోని సొసైటీకి 10 ఎకరాల భూమి కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల అధ్యక్షులు తాళ్లపల్లి లింగంగౌడ్, బొలగం సత్యనారాయణగౌడ్, సర్పంచ్ నడిమింటి శ్రీనివాస్, ఎంపీటీసీలు బొల్గం రామస్వామిగౌడ్, బొమ్మగోని రవిచందర్‌గౌడ్, కొమురవెల్లి మండల అధ్యక్షుడు మేరుగు కృష్ణాగౌడ్, జిల్లా నాయకులు మేరుగు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు ఆకుల కనకయ్య, అంబాల నాగేశ్వర్, గుడాల చంద్రయ్య, బూరగోని శ్రీనివాస్, బుడిగె గురువయ్య, బుడిగె నారాయణ పాల్గొన్నారు.

ఏఐఎస్‌బీ జాతీయ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

హుస్నాబాద్: పశ్చిమ బెంగాల్‌లోని మద్యంగ్రామ్ జిల్లాలో సెప్టెంబర్ 7, 8, 9వ తేదీల్లో నిర్వహించనున్న ఏఐఎస్‌బీ జాతీయ 3వ మహాసభలను విజయవంతం చేయాలని ఏఐఎస్‌బీ రాష్ట అధ్యక్షుడు గవ్వ వంశీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సభకు తెలంగాణ రాష్ట్రం నుంచి వందమంది ప్రతినిధులు హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్‌బీ నియోజకవర్గ కోఆర్డినేటర్ మాచర్ల శ్రీజన్, నాయకులు శ్రీనివాస్, అజిత్‌కుమార్, బైరి రమేష్, శివకుమార్‌గౌడ్, సుకేష్ పాల్గొన్నారు.

నిజాం పాలన సాగిస్తున్న కేసీఆర్

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రఘునందన్‌రావు

మద్దూరు(హుస్నాబాద్): తెలంగాణ రాష్ట్రం సీఎం కేసీఆర్ నిజాం రజాకార్ల పాలన సాగిస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రఘునందన్‌రావు అన్నారు. శనివారం మండలంలోని వీరా బైరాన్‌పల్లి గ్రామంలోని బురుజు వద్దకు వెళ్లి అమరులకు నివాళులర్పించారు. అనంతరం బీజేపీ ప్రధాన కార్యదర్శి అచార్యతో కలిసి రఘునందన్ మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నాయిని నరోత్తమ్‌రెడ్డి, కొమ్మురి ప్రతాప్‌రెడ్డి, జనగామ జిల్లా అధ్యక్షుడు కేవీఎల్ఎన్ రెడ్డి, సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి శశిధర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రాపాక బుచ్చిరెడ్డి, మండల అధ్యక్షుడు ఇర్రి రాజిరెడ్డి, తోకల ఉమారాణి పాల్గొన్నారు.

448వ రోజుకు చేరిన వేములఘాట్ దీక్షలు



వేములఘాట్ గ్రామస్తుల దీక్షలు

తొగుట(దుబ్బాక): కొమురవెల్లి మల్లన్న సాగర్ రిజర్వాయర్ సామర్థ్యం తగ్గించి గ్రామాలను ముంచొద్దని కోరుతూ వేములఘాట్ గ్రామస్తులు చేపట్టిన నిరసన దీక్షలు నేటికి 448వ రోజుకు చేరాయి. శనివారం దీక్షలో వడ్ల నర్సింలు, కుమార్, నాయిని లింగారెడ్డి, పుల్లయ్యగారి వెంకట్, ముత్తమ్మ స్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాన్ని కాపాడుకునేందుకు ఎంతటి త్యాగాలకైనా భయపడేదిలేదన్నారు. ప్రభుత్వం భారీ రిజర్వాయర్ నిర్మించడాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

అక్కన్నపేట(హుస్నాబాద్): గత మూడు రోజులుగా మండలస్థాయి క్రీడా పోటీలను నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ పోటీల్లో ప్రతిభ కనబరించిన విద్యార్థుల ఎంపిక జాబితాను విడుదల చేశారు. వాలీబాల్ అండర్ 14–17 బాలబాలికల విభాగంలో గౌరవెల్లి పాఠశాల నుంచి డి.అంజనేయులు, సీహెచ్ శర్వానీ, శ్రీకాంత్, వినయ్, జీ.వర్ష, వైష్ణవి, శిరీష, మల్లంపల్లి పాఠశాల నుంచి పి.పావని, కె.రాజు, అజయ్, తీరుమల్స్, రామవరం పాఠశాల నుంచి ఎల్.బన్నీ, పి.బాబు, నవీన్, అంతక్కపేట పాఠశాల నుంచి వికాస్, పి.సిందుజా, అనూష, అక్కన్నపేట పాఠశాల నుంచి సాయికుమార్ జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపియ్యారు. వీరు ఈ నెల 28వ తేదీన సిద్దిపేట జిల్లా వర్గల్ మండల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న పోటీలకు జనన, ఆధార్ కార్డులు తీసుకోరావాలని పీఈటీ జంగపల్లి వెంకటనర్సయ్య తెలిపారు.

సాక్షి సిద్దిపేట

ఆదివారం | ఆగస్టు | 27 | 2017

వెండితెర



సిద్దిపేటలో..

నిన్ను కోరి
వెంకటేశ్వరా కళామందిర్
11.15, 2.15, 6.00,9.00.

శమంతకమణి
శ్రీనివాస్ డీలక్స్
11.15, 2.15, 6.00,9.00

పటేల్ ఎస్ఐఆర్
బాలాజీ డీలక్స్ 11.00, 2.00, 6.00, 9.15.

దువ్వాడ జగన్నాథం
సీతారామాంజనేయ





పంటకు జీవం

ఖరీఫ్‌లో వర్షాలు లేక తల్లడిల్లుతున్న సమయంలో కురిసిన వర్షం పంటకు జీవం పోసింది. గత మూడు రోజులలో కురిసిన వర్షాలతో రైతుల ముఖాల్లో సంతోషం విరిసింది. పంట ఎండుతున్న దశలో కురిసిన వాన వాటికి ప్రాణాధారమైంది.

-ప్రశాంత్ నగర్ (సిద్దిపేట)

'ప్రశ్నించిన రైతులపైనే కేసులా?'

సిద్దిపేటటౌన్: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం కోసం శనివారం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ సమావేశంలో ప్రశ్నించిన రైతులను అరెస్టు చేయడం తగదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చొప్పదండి చంద్రశేఖర్, డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు అన్నారు. డివిజన్ మహిళా అధ్యక్షురాలు వనం సంధ్యారాణితో కలిసి వారు విలేకరులతో మాట్లాడుతూ వయోలా గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉన్నతాధికారుల ఎదుట గోడు వెళ్లబోసుకున్న రైతులను అరెస్టు చేయడాన్ని ఖండించారు. ఒకే ప్రాజెక్టు పరిధిలోని నిర్వాసితులకు వేర్వేరు పరిహారాలు చెల్లిస్తూ రైతులను మోసం చేస్తున్నారన్నారు. ముంపు గ్రామాల్లోనే ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలన్నారు. అభిప్రాయ సేకరణ పూర్తవకముందే చేపట్టిన ప్రాజెక్టుల నిర్మాణాలను ప్రక్రియ పూర్తయే వరకు నిలిపేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నరేశ్, రాజు, మహేందర్, ఎల్లయ్య, పరశురాములు పాల్గొన్నారు.

రైతులపై కేసులు ఎత్తేయాలి

బెజ్జంకి(సిద్దిపేట): ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడితే కేసులు పెట్టడం తగదని సీపీఎం మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్ పేర్కొన్నారు. బెజ్జంకిలో శనివారం విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో కనీస వసతులు విద్యుత్, తాగునీరు, రోడ్ల వసతులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కేసులు ఎత్తేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో లింగం, జంగిలి సంపత్, ప్రభాకర్, అశోక్ పాల్గొన్నారు.

కట్టపై ఫెన్సింగ్ వేయించాలి

కొమురవెల్లి(సిద్దిపేట): తపాస్‌పల్లి రిజర్వాయర్ కట్టపై విరిగిపోయి ప్రమాదకరంగా మారిన ఇనుప ఫెన్సింగ్‌కు మరమతులు చేయించాలని బీజేవైఎం మండలాధ్యక్షుడు స్వామిగౌడ్ అన్నారు. శనివారం ఐనాపూర్‌లో ప్రమాదకరంగా మారిన ఫెన్సింగ్‌ను పరిశీలించారు. నెల రోజులుగా రిజర్వాయర్‌లోకి గోదావరి నీళ్ళు వదలడంతో సందర్శకుల సంఖ్య భారీగా పెరిగిందని, వెంటనే మరమ్మతులు చేయించాలని కోరారు. ఆయన వెంట ప్రశాంత్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, నర్సయ్య, శ్రవణ్, ప్రశాంత్‌కుమార్, భరత్, అంజి ఉన్నారు.

పది క్వింటాళ్ల కందులు సీజ్

చేర్యాల(సిద్దిపేట): మండలంలోని కడవేర్గు గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన పది క్వింటాళ్ల కందులను శనివారం రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. తమకు అందిన సమాచారం ప్రకారం ఓ రైతు ఇంట్లో నిల్వ చేసిన పది క్వింటాల్ల కందులను స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ విజయసాగర్ తెలిపారు. ఈ విషయాన్ని మార్కెటింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

చేర్యాల(సిద్దిపేట): సెప్టెంబర్ 1ని విద్రోహ దినంగా పరిగణిస్తూ కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నా వాల్‌పోస్టర్‌ను చేర్యాలలోని అంబేద్కర్ కూడలి వద్ద ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. నూతన పింఛన్ విధానం అమలైన సెప్టెంబర్1 ఉద్యోగుల పాలిట చీకటి రోజని, ఆరోజున సామూహిక సెలవుగా ప్రకటించి, కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాకు నల్లబ్యాడ్జిలతో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూపీఎస్ నాయకులు బాల్‌రెడ్డి, చంద్రం, కిష్టయ్య, శ్రీనివాస్‌రెడ్డి, ప్రశాంత్‌కుమార్, దామోదర్, చంద్రారెడ్డి, సిద్దయ్య, మల్లేశం, కుమారస్వామి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా మదర్ థెరిసా జయంతి

చేర్యాల(సిద్దిపేట): డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మదర్ థెరిస్సా 107వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆమె సేవలను కొనియాడారు. దేశంలోని అభాగ్యులకు నిస్వార్థంగా ఆమె సేవలందించారని భౌతికశాస్త్ర ప్రొఫెసర్ త్యాగయ్య కొనియాడారు. కార్యక్రమంలో ప్రోగ్రామింగ్ ఆఫీసర్ ఎస్.కె.సాదిక్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు హెచ్.పల్లవి, డి.పుష్ప, శారద, సూర్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజలను మభ్యపెడుతున్న ప్రతిపక్షాలు

చిన్నకోడూరు(సిద్దిపేట): టీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు అసంబద్ధమైన మాటలతో ప్రజలను మోసగిస్తున్నాయని టీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కనకరాజు, పీఏసీఎస్ చైర్మన్ పాపయ్య అన్నారు. ప్రతిపక్షాలు ప్రాజెక్టులను అడ్డుకోవడం సరికాదన్నారు. ప్రాజెక్టులు పూర్తయితే బీడు భూములు బంగారు భూములవుతాయన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణలో ప్రాజెక్టులను పట్టించుకోని ప్రతిపక్షాలు పనులు వేగంగా జరుగుతుంటే జీర్ణించుకోలేకపోతున్నాయని విమర్శించారు. వ్యవసాయానికి 24గంటల కరెంట్ ఘనత టీఆర్ఎస్‌దేనన్నారు.

క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి ముందుంటా: ఎమ్మెల్సీ ఫారూఖ్

సిద్దిపేట టౌన్: క్రైస్తవ సామాజిక వర్గ సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడు ముందుంటానని ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్ అన్నారు. శనివారం సిద్దిపేట సీఎస్ఐ చర్చిలో జరిగిన క్రైస్తవ ఐక్యవేదిక సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. క్రైస్తవుల అంతిమ యాత్ర రథంను అందించనందుకు మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. క్రైస్తవ భవనం నిర్మించాలని,ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెల్లాలని ఎమ్మెల్సీని కోరారు. సికింధర్ తదితరులు ఉన్నారు.

విగ్రహావిష్కరణ అడ్డుకున్న అధికారులు

చేర్యాల(సిద్దిపేట): మండలంలోని వీరన్నపేట మాజీ సర్పంచ్, పీఏసీఎస్ చైర్మన్ ఈశ్వర్‌రెడ్డి విగ్రహావిష్కరణను శుక్రవారం రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. విగ్రహ ఏర్పాటుకు అనుమతించాలంటూ సర్పంచ్, ఈశ్వర్‌రెడ్డి కుటుంబీకులు కలెక్టర్‌కు దరఖాస్తు చేయగా దాన్ని కలెక్టర్ తిరస్కరించారని, అనుమతి లేకుండా ప్రభుత్వ స్థలాల్లో ప్రైవేటు వ్యక్తుల విగ్రహాలు పెట్టడం నిబంధనల ఉల్లంఘనే అవుతుందని తహసీల్దార్ విజయసాగర్ తెలిపారు. విగ్రహాన్ని తొలగించాలని ఆదేశించినట్లు తెలిపారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం

నంగునూరు(సిద్దిపేట): అనారోగ్యంతో మృతిచెందిన ఓ నిరుపేద కుటుంబ సభ్యులకు ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు జయపాల్‌రెడ్డి శుక్రవారం అంత్యక్రియల కోసం ఆర్థికసాయం అందించారు. నంగునూరుకు చెందిన వెల్దండ లింగం గురువారం అనారోగ్యంతో మృతిచెందాడు. వారి కుటుంబ పరిస్థితి తెలుసుకున్న గ్రామస్తులు మంత్రి హరీశ్‌రావుకు సమాచారం అందించగా ఆయన సూచన మేరకు జయపాల్‌రెడ్డి రూ. ఐదు వేల ఆర్థికసాయం అందించారు.

సీపీఎస్ రద్దు చేయాలి

బెజ్జంకి(సిద్దిపేట): సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేసి పాత పింఛన్ విదానాన్ని అమలు చేయాలని ఎస్టీయూ మండలాధ్యక్షుడు వడ్లకొండ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బెజ్జంకిలో విలేకరులతో మాట్లాడారు. పింఛన్ ఉద్యోగుల హక్కు అని, అది సాధించే వరకు సంఘటితంగా ఉద్యమించాలని అన్నారు. ఈనెల 28న సిద్దిపేటలో నిర్వహించే ర్యాలీకి పెద్దసంఖ్యలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆ సంఘం మండల ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా బాధ్యులు గుండా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

Zone Guide

సర్వసభ్య సమావేశం వాయిదా

నంగునూరు(సిద్దిపేట): మండల సర్వసభ్య సమావేశం ఈనెల 28కి వాయిదా వేసినట్లు ఎంపీడీఓ నాగేశ్వర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణం కోసం సిద్దిపేటలో ప్రజాభిప్రాయ సేకరణ నేపథ్యంలో ఎంపీపీ సూచనల మేరకు వాయిదా వేశామన్నారు. సోమవారం మధ్యాహ్నం ఒంటిగంటకు సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీఓ పేర్కొన్నారు.

విద్యుత్ బిల్లుల వసూలు క్యాంపు

నంగునూరు(సిద్దిపేట): సిద్దన్నపేట, పాలమాకుల, నర్మేట, నంగునూరు గ్రామాల్లో ఆదివారం విద్యుత్ బిల్లుల వసూలు క్యాంపు నిర్వహిస్తామని ఏఈ రియాజ్ అహ్మద్ తెలిపారు. ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పంచాయతీ కార్యాలయాల వద్ద నిర్వహించే క్యాంపులో వినియోగదారులు బిల్లులు చెల్లించాలని ఏఈ సూచించారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ దరఖాస్తులు

సిద్దిపేటఎడ్యుకేషన్: సిద్దిపేట పట్టణంలోని అక్షర జూనియర్ కళాశాలలో ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల కో–ఆర్డినేటర్ విఠల్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు వచ్చే నెల నాలుగో తేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా దరఖాస్తు చేసుకోచ్చని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9949453743 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

కేంద్ర పథకాలను వివరించాలి

నంగునూరు(సిద్దిపేట): కేంద్ర సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అమలయ్యేలా చూడాలని బీజేపి మండలాధ్యక్షుడు తిరుపతిరావు పిలుపునిచ్చారు. శనివారం జరిగిన సమావేశంలో కార్యదర్శిగా గంపల మహేందర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఇంటర్వ్యూ



నగేశ్, ఏఓ
అంశం: సాగులో మెలకువలు
కొమురవెల్లి



సాక్షి: కొమురవెల్లి మండలంలో ప్రధానంగా సాగు చేసే పంటలేవి?

ఏఓ: మండలంలో మొత్తం 4వేల200 మంది రైతులున్నారు. వరి, పత్తి, మొక్కజొన్న, కంది పంటలు సాగు చేస్తున్నారు.

సాక్షి: పత్తి సాగు ఏ దశలో ఉంది? రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలేమిటి?

ఏఓ: పత్తి పూత దశలో ఉంది. ఈ దశలో రసం పీల్చే పురుగులు (పచ్చదోమ, పెనుబంక) ఆశించడంతో ఆకులు ఎర్రబడతాయి. దీని నివారణకు లీటర్ నీటిలో మోనోక్రోటోపాస్ 1.5 మి.లీ. లేదా ఆసిపేట్ 1.5 గ్రాములు, ఇమిడాక్లోఫ్రిడ్ 0.4 మి.లీ. కలిపి పిచికారీ చేయాలి.

సాక్షి: వరి సాగు ఏదశలో ఉంది? పంటకు సోకే చీడపీడల నివారణకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

ఏఓ: వరి పంట పొట్టకు వచ్చే దశలో ఉంది. ఈ దశలో శీత్‌రాట్ తెగులు సోకితే దాని నివారణకు మాంకీజెబ్ లేదా ఎగ్జికోలజోల్ రసాయనాన్ని పిచికారీ చేయాలి.

సాక్షి: మొక్కజొన్న పంట సాగు ఏదశలో ఉంది? ఎలాంటి తెగులు సోకే అవకాశముంది?

ఏఓ: ఇప్పుడున్న దశలో మొక్కజొన్నకు కాండం తొలిచే పురుగు సోకే అవకాశముంది. దాని నివారణకు కార్బోఫ్యూకాన్ త్రీజీ గుళికలను మొక్కజొన్న సుడులలో వేయాలి.

సాక్షి: రైతులకు మీరిచ్చే సలహాలు, సూచనలు?

ఏఓ: రైతులు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించాలి. వర్షాలు ఎక్కువగా కురిస్తే ఆకులు వాడిపోతాయి. నివారణకు కార్బోన్‌డెజిన్ రసాయాన్ని పిచికారీ చేయాలి.

–కొమురవెల్లి(సిద్దిపేట)

‘ప్లానింగ్ అండ్ ద పూర్’ గ్రంథ రచయిత?



బి. శ్రీనివాస్ పట్నాయక్
సబ్జెక్టు నిపుణులు
Sky wizards IAS academy.

జనరల్ స్టడీస్ ఎకానమీ ప్రత్యేకం



మాదిరి ప్రశ్నలు

1. చాలా సందర్భాల్లో ద్రవ్యోల్బణం వల్ల ఎక్కువ ప్రయోజనం పొందేవారెవరు?
1) పెన్షనర్లు 2) ఉద్యోగులు
3) వినియోగదార్లు
4) రుణగ్రస్తులు

2. నాబార్డ్ నేరుగా ఎవరికి అప్పు ఇస్తుంది?
1) చిన్న రైతులకు
2) గ్రామ చేతిపనివారికి
3) చిరు వ్యాపారులకు
4) పైవేవీకావు

3. మనదేశంలో నగరీకరణ పెరగడానికి కారణం?
1) నగరంలో పరిశ్రమలు, వ్యాపారం పెరగడం
2) గ్రామీణ ప్రాంతాల్లో అధిక జనాభా ఒత్తిడి
3) వ్యవసాయ రంగంలో అల్ప ఉత్పాదకత
4) పైవన్నీ

4. భారత్‌లో ‘లక్ష్యం ప్రజాపంపిణీ విధానం (TPDS)’ను ఏ సంవత్సరం నుంచి అమలు చేశారు?
1) 1991 2) 1995
3) 1997 4) 2001

5. 20-పాయింట్ పథకాన్ని ఇందిరాగాంధీ ఏ సంవత్సరంలో ప్రకటించారు?
1) 1973 2) 1975
3) 1977 4) 1976

6. భారత ఆర్థిక వ్యవస్థ వెనుకబడి ఉండటానికి కింది వాటిలో ముఖ్య కారణం ఏది?
1) అధిక జనసాంద్రత
2) మూలధన కొరత
3) వినియోగం కాని మానవ వనరులు, సహజ వనరుల సహజీవనం
4) స్వల్ప తలసరి ఆదాయం

7. ‘బాంబే ప్రణాళిక’కు సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
1) ఇది జాతీయ ఆదాయానికి మూడురెట్లు
2) తలసరి ఆదాయాన్ని రెండు రెట్లు పెంచడం లక్ష్యం
3) 15 ఏళ్లకు ఏర్పాటు చేసిన ప్రణాళిక
4) పైవన్నీ

8. ‘దీర్ఘదర్శి ప్రణాళిక’కు సంబంధించి కింది వాటిలో సరైనవి ఏవి?
ఎ) ద్రవ్యోల్బణ రహిత ఆర్థిక సుస్థిరత
బి) సత్వర ఆర్థిక వృద్ధి
సి) సాంఘిక న్యాయం లక్ష్యం
డి) 15 నుంచి 20 ఏళ్ల పరిధి కలిగి ఉండటం
1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
3) బి, సి, డి 4) ఎ, బి, సి, డి

9. వాక్యం (ఎ): రెండో పంచవర్ష ప్రణాళికను భారీ పెట్టుబడుల వ్యూహం ఆధారంగా రూపొందించారు
వాక్యం (బి): పబ్లిక్ రంగం అభివృద్ధి చెందితేనే ప్రైవేట్ రంగ పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఏర్పడుతుంది
1) (ఎ), (బి) వాక్యాలు సరైనవి, (ఎ)కు (బి) సరైన వివరణ
2) (ఎ), (బి) వాక్యాలు సరైనవి, (ఎ)కు (బి) సరైన వివరణ కాదు
3) (ఎ) సరైంది, (బి) సరైంది కాదు
4) (బి) సరైంది, (ఎ) సరైంది కాదు

10. భారతదేశంలో వ్యవసాయ ధరల కమిషన్‌ను ఏ సంవత్సరంలో ఏర్పాటు చేశారు?
1) 1960 2) 1965
3) 1970 4) 1968

11. ఆర్థిక వ్యవస్థలోని వ్యవసాయ రంగం నుంచి ఇతర రంగాలకు పనివారిని మార్పు చేయడానికి సూచించేది?
1) వెనుకబాటు తనం
2) సాంకేతిక పురోగతి
3) ఆర్థిక వృద్ధి 4) ఎక్కువ వేతనాలు

12. పెట్టుబడుల ఉపసంహరణల కమిటీ అధ్యక్షుడు ఎవరు?
1) అరుణ్ జైన్
2) రంగరాజన్ 3) అమర్త్య సేన్
4) ఎల్.కె. ఝా

13. హరిత విప్లవ ప్రయోజనాలు.. ఏ సౌకర్యాలున్న ప్రాంతాలకు పరిమితమైనవి?
1) అధిక దిగుబడి రకాల వంగడాలు ఉన్న సౌకర్యాలు
2) నీటి పారుదల సౌకర్యాలు
3) రసాయన ఎరువుల లభ్యత సౌకర్యాలు
4) పంటల మార్పిడి సౌకర్యాలు

14. ప్రపంచీకరణ అంటే వివిధ దేశాల మధ్య స్వేచ్ఛగా ప్రవహించేది..?
1) వస్తువులు 2) పెట్టుబడులు
3) సాంకేతిక పరిజ్ఞానం
4) పైవన్నీ

15. సమష్టి డిమాండ్ పెరుగుదల కారణంగా ఉత్పన్నమయ్యేది?
1) మందకొడి ద్రవ్యోల్బణం
2) డిమాండ్ ప్రేరిత ద్రవ్యోల్బణం
3) వ్యయ ప్రేరిత ద్రోవ్యోల్బణం
4) సప్లయ్ ప్రేరిత ద్రవ్యోల్బణం

16. ఆర్థిక ప్రణాళికలను అమలు చేయడంలో ఏ దేశాన్ని మార్గదర్శకంగా తీసుకున్నారు?
1) రష్యా 2) జపాన్
3) అమెరికా 4) నార్వే

17. మోక్షగుండం విశ్వేశ్వరయ్య "Planned Economy of India"ను ఏ సంవత్సరంలో రాశారు?
1) 1933 2) 1934
3) 1935 4) 1936

18. భారతదేశ ప్రజల ఆర్థిక సంక్షేమానికి సంబంధించి కింది వాటిలో సరికానిది?
1) ట్రికల్ – డౌన్ బెనిఫిట్
2) వినియోగ వస్తువుల అధిక దిగుమతులు
3) నిలకడతో కూడిన వృద్ధి
4) అసమానతలతో తగ్గింపు

19. రైత్వారీ పద్ధతికి సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
1) దీన్ని లార్డ్ హేస్టింగ్స్ గవర్నర్ జనరల్‌గా ఉన్నప్పుడు ప్రవేశపెట్టారు
2) 1820లో ప్రవేశపెట్టారు. ఇది 52% ఆచరణలో ఉంది
3) దీన్ని థామస్ మన్రో, రీడ్ పర్యవేక్షించారు
4) పైవన్నీ సరైనవే

20. ప్రచ్ఛన్న నిరుద్యోగం అంటే?
1) అన్ని కాలాల్లో ఉద్యోగ లభ్యత
2) విశ్రాంత ఉద్యోగులు
3) పూర్తికాలం ఉద్యోగం లేని వ్యక్తులు
4) తక్కువ మంది కావాల్సిన పనిలో ఎక్కువ మంది పనిచేయడం

21. ఏ విధానంలో గ్రామ భూమి సంయుక్త స్వామ్యం పరిధిలో ఉంటుంది?
1) జమీందారీ విధానం
2) మహల్వారీ విధానం
3) రైత్వారీ విధానం 4) పైవేవీ కావు

22. భారతదేశ వ్యవసాయానికి సంబంధించి కింది వాటిలో సరికానిది?
1) హరిత విప్లవం అంటే వ్యవసాయ ఉత్పత్తుల త్వరిత పెరుగుదల
2) భారత వ్యవసాయం రుతుపవనాల జూదం
3) భారతదేశంలో వ్యవసాయం ద్వితీయ పరిశ్రమ
4) కమతాల సమీకరణ వ్యవసాయం పెరగడానికి ఉపయోగపడుతుంది

23. కింది వాటిలో పేదరికానికి కారణమైన ఆర్థికేతర అంశం ఏది?
1) వ్యవసాయంలో అల్ప ఉత్పాదకత
2) ఆదాయ అసమానతలు
3) అధిక జనాభా పెరుగుదల
4) అధిక నిరక్షరాస్యత

24. ‘ప్లానింగ్ అండ్ ద పూర్’ అనే గ్రంథాన్ని రాసిందెవరు?
1) బి.ఎస్. మిన్‌హాస్
2) వై.కె. అలఘ్ 3) జగదీష్ భగదత్
4) అమర్త్యసేన్

25. ‘కిసాన్ క్రెడిట్ కార్డ్’ పథకాన్ని సూత్రీకరించింది?
1) ఆర్.బి.ఐ. 2) జి.ఐ.సి.
3) ఐ.సి.ఐ.సి.ఐ. 4) నాబార్డ్

26. దేశంలో వేగవంతమైన పారిశ్రామీకరణకు ప్రారంభించిన కొత్త విధానం?
1) ప్రైవేట్ పారిశ్రామికవేత్తలకు వివిధ రకాల రాయితీలను కల్పించడం
2) ప్రత్యేక ఆర్థిక మండళ్లను ఏర్పాటు చేయడం
3) అనేక దేశాలతో వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకోవడం
4) పారిశ్రామిక విధానాల్లో సరికొత్త మార్పులకు ప్రణాళికలు వేయడం

27. మన దేశంలో అంత్యోదయ కార్యక్రమం మొదటగా ఏ రాష్ట్రంలో ప్రారంభించారు?
1) తమిళనాడు 2) ఆంధ్రప్రదేశ్
3) ఒడిశా 4) రాజస్థాన్

28. కింది వాటిలో పరోక్ష పన్నుకు ఉదాహరణ?
1) ఎక్సైజ్ పన్ను
2) ఎస్టేట్ పన్ను 3) ఆదాయ పన్ను
4) సంపద పన్ను

29. కింది వాటిలో దేశంలో పేదరికం ఏర్పడటానికి కారణం?
1) తక్కువ ఉత్పాదకత
2) ఉద్యోగిత లేని ఆర్థిక అభివృద్ధి
3) తక్కువ స్థాయి ఆర్థిక అభివృద్ధి
4) పైవన్నీ

30. సాధారణంగా బ్యాంకు రేటులో పెరుగుదల దేన్ని సూచిస్తుంది?
1) మార్కెట్ వడ్డీ రేటులో పతనం
2) సెంట్రల్ బ్యాంకు.. ఇతర వాణిజ్య బ్యాంకులకు రుణాలు ఇవ్వకపోవడం
3) సెంట్రల్ బ్యాంకు సులభ ద్రవ్యవిధానాన్ని అనుసరించడం
4) సెంట్రల్ బ్యాంకు కఠిన ద్రవ్య విధానాన్ని అనుసరించడం

31. జనాభా డివిడెండ్‌కు సంబంధించిన పూర్తి ప్రయోజనాలు పొందడానికి భారతదేశం ఏం చేయాలి?
1) నైపుణ్య వికాసాన్ని పెంపొందించాలి
2) మరిన్ని సామాజిక భద్రత పథకాలను ప్రవేశపెట్టాలి
3) శిశుమరణాల రేటును తగ్గించాలి
4) ఉన్నత విద్యను ప్రైవేటీకరించాలి

32. జతపరచండి.
జాబితా - I
i) నారిమన్ కమిటీ
ii) సరయూ కమిటీ
iii) మల్హోత్రా కమిటీ
iv) నరసింహం కమిటీ
జాబితా-II
a) లీడ్ బ్యాంక్ పథకం
b) ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు
c) బీమా రంగ సంస్కరణలు
d) బ్యాంకింగ్ సంస్కరణలు
1) i-a, ii-b, iii-c, iv-d
2) i-b, ii-c, iii-d, iv-a
3) i-c, ii-d, iii-a, iv-b
4) i-d, ii-a, iii-b, iv-c

33. జతపరచండి.

బ్యాంకు	స్థాపించిన సంవత్సరం
i) ఐ.సి.ఐ.సి.ఐ.	a) 1955
ii) ఎల్.ఐ.సి.	b) 1956
iii) యు.టి.ఐ .	c) 1964
iv) ఎగ్జిమ్ బ్యాంక్	d) 1982

1) i-a, ii-b, iii-c, iv-d
2) i-b, ii-c, iii-d, iv-a
3) i-c, ii-d, iii-a, iv-b
4) i-d, ii-a, iii-b, iv-c

34. జతపరచండి.
జాబితా-I
i) పుర నమూనా
ii) భారీ పరిశ్రమల వ్యూహం
iii) మానవ అభివృద్ధి సూచిక
iv) నవకల్పనల వృద్ధి రేటు
జాబితా-II
a) ఎ.పి.జె. అబ్దుల్ కలాం
b) మహలనోబిస్
c) మహబూబ్ హక్
d) షుంపీటర్
1) i-a, ii-b, iii-c, iv-d
2) i-b, ii-c, iii-d, iv-a
3) i-c, ii-d, iii-a, iv-b
4) i-d, ii-a, iii-b, iv-c

35. సాధారణ ట్రెజరీ బిల్లుల కాలపరిమితి?
1) 91 రోజులు 2) 94 రోజులు
3) 90 రోజులు 4) 95 రోజులు

36. జతపరచండి.
జాబితా-I
i) మహవీర్ త్యాగి సంఘం
ii) భూతలింగం సంఘం
iii) కె.ఎన్. రాజ్ సంఘం
iv) సి.సి. ఛోక్స్ సంఘం
జాబితా-II
a) ప్రత్యక్ష పన్నుల పరిశీలన
b) పన్ను విధానాల ఆధునికీకరణ
c) వ్యవసాయంపై పన్ను
d) ప్రత్యక్ష పన్నులు
1) i-b, ii-c, iii-d, iv-a
2) i-a, ii-b, iii-c, iv-d
3) i-c, ii-d, iii-a, iv-b
4) i-a, ii-b, iii-d, iv-c

37. కింది వాటిలో ఏ దక్షిణాసియా దేశం స్థూల జాతీయ సంతోషాన్ని ప్రజల సుఖశాంతులకు సూచికగా పరిగణిస్తోంది?
1) భూటాన్ 2) బంగ్లాదేశ్
3) శ్రీలంక 4) ఆఫ్ఘనిస్తాన్

38. ‘వృత్తులవారీ వ్యవస్థకు, ఆర్థికాభివృద్ధికి అవినాభావ సంబంధం ఉంటుంది’ అని పేర్కొన్న వారెవరు?
1) ఎ.జి.బి. ఫిషర్
2) కాలిన్ క్లార్క్ 3) మాల్థస్
4) అమర్త్యసేన్

39. MRTP (Monopolies and Restrictive Trade Practices) చట్టాన్ని ఎప్పుడు ప్రవేశపెట్టారు?
1) 1969 2) 1970
3) 1968 4) 1971

40. మిశ్రమ ఆర్థిక వ్యవస్థకు పునాదులు వేసిన పారిశ్రామిక తీర్మానం ఏది?
1) 1956 2) 1948
3) 1977 4) 1991

సమాధానాలు

1) 4	2) 4	3) 4	4) 3	5) 2
6) 3	7) 4	8) 4	9) 1	10) 2
11) 3	12) 2	13) 2	14) 4	15) 2
16) 1	17) 2	18) 2	19) 4	20) 4
21) 2	22) 3	23) 4	24) 1	25) 4
26) 2	27) 4	28) 1	29) 4	30) 4
31) 3	32) 1	33) 1	34) 1	35) 1
36) 2	37) 1	38) 2	39) 1	40) 2

Who is the author of "I Do What I Do"?




N. Vijayender Reddy
Subject Expert, Hyderabad.

GENERAL AWARENESS

1. Which of the following became the first video to hit 3 billion views on YouTube in August 2017?
   1) "Sorry" by Justin Bieber
   2) "Gangnam Style" by Psy
   3) "See You Again" by Wiz Khalifa
   4) "Blank Space" by Taylor Swift
   5) "Despacito" by Luis Fonsi
2. Which former RBI Governor is the author of the book "I Do What I Do"? (The book will be launched in September 2017)
   1) D. Subbarao
   2) Dr. Y.V. Reddy
   3) C. Rangarajan
   4) Raghuram Rajan
   5) Bimal Jalan
3. Which State government has formed "Maa" Committees to check mid-day meals quality in schools?
   1) Punjab 2) Haryana
   3) Uttar Pradesh 4) Bihar 5) Madhya Pradesh
4. Who was elected as the Chairman of FIFA governance committee in May 2017?
   1) Justice Manmohan Singh
   2) Justice V.K. Shali
   3) Justice Suresh Kait
   4) Justice Mukul Mudgal
   5) Justice G.P. Mittal
5. Who was appointed the chairman of National Commission for Minorities (NCM) in May 2017?
   1) Syed Ghayorul Hasan Rizvi
   2) George Kurian
   3) Sunil Singhi
   4) Vada Dasturji Khurshed
   5) None of these
6. Which Hindi actor was honored with the Master Dinanath Mangeshkar Award in April 2017?
   1) Shah Rukh Khan
   2) Salman Khan
   3) Aamir Khan
   4) Akshay Kumar
   5) Anupam Kher
7. Who won the 2017 Pulitzer Prize in fiction for the book "The Underground Railroad"?
   1) C.E. Morgan
   2) Colson Whitehead
   3) Adam Haslett 4) Kelly Link
   5) Margaret Verble





8. As per an IMF report India will overtake which of the following countries in 2022 as the world's fourth largest economy?
   1) USA 2) China 3) Japan
   4) Germany 5) U.K.
9. Yusra Mardini was appointed as UNHCR Goodwill Ambassador in April 2017. She belongs to:
   1) Turkey 2) Yemen
   3) Syria 4) Greece
   5) Lebanon
10. September 28th marks the death anniversary of Louis Pasteur. It is observed as:
    1) World Tuberculosis Day
    2) World Rabies Day
    3) World Heart Day
    4) World Kidney Day
    5) World Health Day
11. The International Council on Monuments and Sites (ICOMOS) has its headquarters at:
    1) Paris 2) Vienna 3) Rome
    4) Venice 5) The Hague
12. The Executive Secretary of the United Nations Framework Convention on Climate Change (UNFCCC) visited India recently. Her name is:
    1) Christiana Figueres
    2) Patricia Espinosa
    3) Federica Mogherini
    4) Sylvie Goulard
    5) Annick Girardin
13. Pudong International Airport is located in which of the following cities?
    1) Seoul 2) Beijing
    3) Shanghai 4) Hongkong
    5) Tokyo
14. Who is the author of the book "On Balance: An Autobiography"?
    1) Justice Anna Chandy
    2) Justice Leila Seth
    3) Justice Fathima Beevi
    4) Justice Sujata Manohar
    5) None of these
15. Which of the following topped the International Institute for Management Development's (IMD) World Competitiveness list released in June 2017?
    1) Hong Kong
    2) Switzerland 3) Singapore
    4) USA 5) Netherlands
16. Where are the headquarters of the World Water Council?
    1) Zurich, Switzerland
    2) Frankfurt, Germany
    3) Marseille, France
    4) Nairobi, Kenya
    5) Sochi, Russia

KEY

1) 5	2) 4	3) 3	4) 4
5) 1	6) 3	7) 2	8) 4
9) 3	10) 2	11) 1	12) 2
13) 3	14) 2	15) 1	16) 3

పక్కా ప్రణాళికతో పది గ్రేడ్ పాయింట్లు



యార్లగడ్డ వనంరాజు
స్కూల్ అసిస్టెంట్,
జీహెచ్ఎస్.

పదో తరగతిలో పది గ్రేడ్ పాయింట్లు సాధించాలంటే విద్యార్థులు ఇప్పటి నుంచే పక్కా ప్రణాళికతో ప్రిపరేషన్ సాగించాలి. మ్యాథమెటిక్స్ సబ్జెక్టుకు సంబంధించి విద్యార్థులు ముఖ్య భావనలపై దృష్టి సారించాలి. నిరంతర, సమగ్ర మూల్యాంకనం (సీసీఈ) విధానంలోని ప్రశ్నపత్రంపై అవగాహన పెంపొందించుకోవాలి.



అధ్యాయాల విశ్లేషణ: పదో తరగతి గణితంలో మొత్తం 14 అధ్యాయాలున్నాయి. 1 నుంచి 7 వరకు ఉన్న అధ్యాయాలను పేపర్–1గా, 8 నుంచి 14 వరకు ఉన్న అధ్యాయాలను పేపర్–2గా పేర్కొన్నారు.

పేపర్-1:
1. వాస్తవ సంఖ్యలు; 2. సమితులు; 3. బహుపదులు; 4. రెండు చలరాశుల్లో రేఖీయ సమీకరణాల జత; 5. వర్గ సమీకరణాలు; 6. శ్రేఢులు; 7. నిరూపక రేఖాగణితం.

పేపర్-2:
8. సరూప త్రిభుజాలు; 9. వృత్తానికి స్పర్శ రేఖలు– ఛేదన రేఖలు; 10. క్షేత్రమితి; 11. త్రికోణమితి; 12. త్రికోణమితి అనువర్తనాలు; 13. సంభావ్యత; 14. సాంఖ్యకశాస్త్రం.

- వాస్తవ సంఖ్యలు, సమితులు, సంభావ్యత, సాంఖ్యక శాస్త్రం అధ్యాయాలు సాధారణ విద్యార్థికి కూడా సులువుగా అర్థమవుతాయి. శ్రేఢులు, సరూప త్రిభుజాలు, వృత్తానికి స్పర్శరేఖలు–ఛేదన రేఖలు, క్షేత్రమితి, త్రికోణమితి అధ్యాయాలు క్లిష్టమైనవి.
- రెండు చలరాశుల్లో రేఖీయ సమీకరణాల జత, నిరూపక రేఖాగణితం, క్షేత్రమితి అధ్యాయాల్లో ఎక్కువ మార్కులు సాధించడానికి ఆస్కారం ఉంటుంది.
- పబ్లిక్ పరీక్షల్లో రెండు చలరాశుల్లో రేఖీయ సమీకరణాల జత, వర్గ సమీకరణాలు, సాంఖ్యకశాస్త్రం అధ్యాయాల నుంచి మాత్రమే గ్రాఫ్ సమస్యలు ఇస్తారు. సరూప త్రిభుజాలు, వృత్తానికి స్పర్శరేఖలు–ఛేదన రేఖలు అధ్యాయాల నుంచి మాత్రమే నిర్మాణ సమస్యలు వస్తాయి. సరూప త్రిభుజాలు, వృత్తానికి స్పర్శరేఖలు–ఛేదనరేఖలు అధ్యాయాల నుంచి సిద్ధాంతాలు, సిద్ధాంత అనువర్తనాలను ఇస్తారు. సీసీఈ విధానం ప్రకారం ప్రశ్నపత్రంలో ఏ అధ్యాయం నుంచైనా, ఏ సమస్యనైనా అడగొచ్చు. అందువల్ల విద్యార్థులు తప్పనిసరిగా అన్ని అధ్యాయాలను అధ్యయనం చేయాలి.


అధ్యాయాలు-ముఖ్యమైన భావనలు


1. **వాస్తవ సంఖ్యలు:** అకరణీయ సంఖ్యల్లో ఏవి అంతమయ్యే దశాంశాలో, ఏవి అంతం కాని ఆవర్తన దశాంశాలో కనుక్కోవడం, $\sqrt{2}$, $5-\sqrt{3}$, $3\sqrt{2}$, $\sqrt{2}+\sqrt{3}$ మొదలైనవి కరణీయ సంఖ్యలు అని నిరూపించే విధానం, మూడు సంవర్గమాన న్యాయాలు – వాటి నిరూపణ, వాటిపై సమస్యలు.
2. **సమితులు:** సమితులు–రకాలు, సమితుల సమ్మేళనం, ఛేదనానికి సంబంధించిన సమస్యలు.
3. **బహుపదులు:** వర్గ బహుపదులు–రేఖాచిత్రాలు, వర్గ, ఘన బహుపదుల గుణకాలకు, శూన్యాలకు మధ్య సంబంధం. బహుపదుల భాగహార నియమ సమస్యలు.
4. **రెండు చలరాశుల్లో రేఖీయ సమీకరణాల జత:** గ్రాఫ్ పద్ధతి, ప్రతిక్షేపణ పద్ధతి, చలరాశి తొలగింపు పద్ధతుల ద్వారా రేఖీయ సమీకరణాల జత సాధన కనుక్కొనే సమస్యలు.
5. **వర్గ సమీకరణాలు:** వర్గ సమీకరణాన్ని సాధించే సమస్యలు, గ్రాఫ్ పద్ధతి, కారణాంక పద్ధతి, వర్గాన్ని పూర్తి చేయడం ద్వారా సాధించే పద్ధతి, వాటి అనువర్తన సమస్యలు.
6. **శ్రేఢులు:** nవ పదం, n పదాల మొత్తం కనుక్కొనే అంకశ్రేఢి, గుణశ్రేఢి సమస్యలు.
7. **నిరూపక రేఖాగణితం:** రెండు బిందువుల మధ్య దూరం, విభజన సూత్రం, త్రిభుజ వైశాల్యం సూత్రాలపై ఇచ్చే సమస్యలు.
8. **సరూప త్రిభుజాలు:** ప్రాథమిక అనుపాత సిద్ధాంతం, పైథాగరస్ సిద్ధాంతం, వాటి అనువర్తన సమస్యలు, రేఖాఖండాన్ని m:n నిష్పత్తిలో విభజించే నిర్మాణం.
9. **వృత్తానికి స్పర్శరేఖలు–ఛేదన రేఖలు:** వృత్తానికి స్పర్శరేఖలు గీసే నిర్మాణం, అల్ప, అధిక వృత్త ఖండ వైశాల్యాన్ని కనుక్కోవడం.
10. **క్షేత్రమితి:** ఘనాకార వస్తు సముదాయ ఉపరితల వైశాల్యం, ఘన పరిమాణం సమస్యలు.
11. **త్రికోణమితి:** త్రికోణమితి నిష్పత్తులు–సమస్యలు, త్రికోణమితీయ సమీకరణాలు–సమస్యలు.
12. **త్రికోణమితి అనువర్తనాలు:** త్రికోణమితి నిష్పత్తులను ఉపయోగించి శిఖరం, స్తంభం ఎత్తు, నది వెడల్పు, దూరాలు కనుక్కోవడం
13. **సంభావ్యత:** నాణేలు, పాచికలు, పేకముక్క కార్డులకు సంబంధించిన వివిధ రకాల ఘటనల సంభావ్యత సమస్యలు.
14. **సాంఖ్యక శాస్త్రం:** వర్గీకృత దత్తాంశం సగటు, మధ్యగతం బాహుళకాన్ని కనుక్కొనే సమస్యలు, ఓజీవ్ వక్రం నుంచి మధ్యగతాన్ని కనుగొనే గ్రాఫ్ సమస్య.


ప్రిపరేషన్ ఇలా..

- గత పబ్లిక్ పరీక్ష పత్రాలను పరిశీలించి ఎక్కువ సమస్యలు వచ్చే అధ్యాయాలు, వాటిలోని ముఖ్యమైన సమస్యలు, ప్రశ్నల సరళిని, మార్కుల వెయిటేజీని గుర్తించి ప్రిపరేషన్ ప్రారంభించాలి.
- ప్రతి అధ్యాయంలోని సూత్రాలు, నిర్వచనాలను ఒక నోట్‌బుక్‌లో రాసి పెట్టుకుని తరచూ చదువుకుంటూ ఉండాలి.
- వాస్తవ సంఖ్యలు, సమితులు, సంభావ్యత, సాంఖ్యక శాస్త్రం లాంటి సులువైన అధ్యాయాల్లోని సమస్యలన్నింటిని ప్రాక్టీస్ చేయాలి. కష్టమైన అధ్యాయాల నుంచి కనీసం ముఖ్యమైన సమస్యలను సాధన చేయాలి.
- సీసీఈ విధానంలో గణితం విద్యా ప్రమాణాలైన సమస్య సాధన, కారణాలు చెప్పడం, నిరూపణ చేయడం, వ్యక్తపరచడం, అనుసంధానం, దృశ్యీకరణ, ప్రాతినిధ్యపరచడం విభాగాల కింద ప్రశ్నపత్రంలో ఇచ్చే ప్రశ్నల గురించి అవగాహన చేసుకోవాలి. ఇందుకోసం గణిత ఉపాధ్యాయుడి సహకారం తీసుకోవాలి.
- గ్రాఫ్, నిర్మాణం సమస్యలు, సిద్ధాంతాలు కచ్చితంగా వస్తాయి. వాటికి సంబంధించిన అన్ని సమస్యలను సాధన చేయాలి.
- ప్రతి అధ్యాయంలోని బిట్స్‌తోపాటు ఏపీఆర్‌జేసీ, పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షల గత ప్రశ్నపత్రాలు, మోడల్ పేపర్లను ప్రాక్టీస్ చేయాలి.

కింది రెండు బొమ్మల మధ్య ఉన్న 5 తేడాలను గుర్తించండి








ఇక్కడ రంగులలో ఉన్న బొమ్మల నీడలు రెండో వైపున ఉన్నాయి. దేని నీడ ఏదో కనుక్కుని జత కలపండి.

నాన్నా చెప్పవా?

గాలి కింది పొరల్లో ఓజోన్ ఉండటం మంచిది కాదా?

భూగోళాన్ని ఆవరించి ఉన్న వాతావరణాన్ని ట్రోపో ఆవరణం, స్ట్రాటో ఆవరణం, ఐనో ఆవరణం అనే మూడు ప్రధాన భాగాలుగా విభజించారు. వీటిలో ట్రోపో ఆవరణం నేల నుంచి 10 మైళ్ల ఎత్తు దాకా వ్యాపించి ఉంటే, స్ట్రాటో ఆవరణం దీనిపై భాగంలో ఉంది. ఈ రెండు మండలాల్లోనూ ఓజోను ఉన్నప్పటికీ ట్రోపో ఆవరణంలోని ఓజోను జీవులకు హానికలిగిస్తే, స్ట్రాటో ఆవరణంలోని



ఓజోను మాత్రం మొత్తం జీవ జాతికి ఒక పెద్ద రక్షణ కవచంలా నిలుస్తోంది. మూడు ఆక్సిజన్ పరమాణువులతో రూపొందే ప్రత్యేకమైన ఆక్సిజన్ అణువునే ఓజోన్ అంటారు. భూగోళంపై 10 మైళ్ల ఎత్తు నుంచి మొదలు పెట్టి 30 మైళ్ల ఎత్తుదాకా ఉన్న వాతావరణంలో పెద్ద మొత్తంలో ఉన్న ఓజోన్ వాయువు సూర్యుడి నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాల వంటి కొన్ని ప్రమాదకరమైన కిరణాలను అడ్డుకుని, మొత్తం ప్రాణికోటికి మేలు చేస్తోంది. ఒకవేళ ఓజోన్ వాయువు ఈ పని చేయనట్లయితే భూమిపై సంచరించే జీవులలో చర్మ క్యాన్సరు, కంటికి సంబంధించిన జబ్బులు, మరికొన్ని ఇతర వ్యాధులు అపారంగా పెరుగుతాయి. వ్యాధినిరోధక శక్తి బాగా దెబ్బతింటుంది. నేలపై పెరిగే సోయాబీన్ వంటి కొన్ని పంటలు బాగా దెబ్బతినడమే గాక, సముద్రంలో మొత్తం ఆహార చక్రాలకు మూలాధారమైన ఫైటో ప్లాంక్టన్ అనే చిరుమొక్కల పెరుగుదల కూడా బాగా తగ్గిపోతుంది. దాని పర్యవసానం జలచరాలపై చాలా తీవ్రంగా ఉంటుంది. ఆ విధంగా వాతావరణం పై పొరలోని ఓజోన్ వాయువు మన భూగోళానికి మేలు చేస్తుంటే, కింది పొరల్లోని ఓజోన్ వాయువు మాత్రం మనుషుల ఆరోగ్యానికి, పంటలకు హాని చేసే ఓ కాలుష్య కారకంగా నిలుస్తోంది. అయితే కింది పొరల్లో ఉన్నప్పటికీ, పై పొరలో ఉన్నప్పటికీ ఓజోన్‌కి సంబంధించిన రసాయనిక ధర్మాలలో మాత్రం ఎలాంటి మార్పు ఉండదు.

గుర్తించండి

కింద ఇచ్చిన బొమ్మల పేర్లు పజిల్‌లో ఎక్కడ ఉన్నాయో గుర్తించండి.

hippo
bridge
forest
finger
dragon
bicycle
cricket
booties



b	o	o	t	i	e	s	i	g
b	a	h	u	v	a	q	n	o
a	h	i	p	p	o	m	e	e
s	t	e	k	c	i	r	c	l
m	e	f	i	n	g	e	r	c
d	r	a	g	o	n	w	v	y
i	b	r	i	d	g	e	l	c
z	m	d	s	a	n	w	s	i
l	p	f	o	r	e	s	t	b



దారి చూపండి

బయట ఉన్న కాకరకాయ మధ్యలో ఉన్న ఉల్లి, టమాటా, వంకాయల దగ్గరకు వెళ్ళాలి. దారి చూపండి



చుక్కలు కలపండి.. రంగులు వేయండి




మీకు తెలుసా?

పులులు వేటాడటంకోసం సూర్యాస్తమయం కావాలని ఎదురుచూస్తాయి



దవడలకున్న అనుకూలత వల్ల పాములు తమ తలకన్నా పెద్ద జంతువులను కూడా తింటాయి.



అమెరికాలో సరస్సుల్లో ఏటా ఈతగాళ్లకు దొరికే గోల్ఫ్‌బాల్స్ విలువ లక్షాయాభైవేల డాలర్లు



అలారం తయారు చేసిన తొలిరోజుల్లో కేవలం ఉదయం నాలుగు గంటలకు మాత్రమే మోగేది




త్వరపడండి! ఈరోజు మాత్రమే
కొనండి 1 పొందండి 1
ఉచితం
చెల్లించండి ₹ 1
డౌన్ పేమెంట్ ఫర్నీచర్ ఇంటికి తీసుకువెళ్ళండి మిగిలినది 24 EMIలలో చెల్లించండి
ఉచితం
రూ.19,999* ఫర్నీచర్ కొనుగోలుపై
లియోనియా రిసార్ట్‌లో 2 రాత్రులు 3 రోజులు బస
ఉచితం
హోండా యాక్టివా-4G
రూ.99,999* ఫర్నీచర్ కొనుగోలుపై
+
ఉచితం లియోనియా రిసార్ట్‌లో 2 రాత్రులు 3 రోజులు బస
బోడుప్పల్ షోరూం ఇప్పుడు ప్రారంభమయింది
కొనండి డ్రీమ్‌హోమ్ ప్యాకేజ్ (31 పీస్‌ల సెట్) : బ్రెజిలియన్ సోఫా 3+2+ టివి స్టాండ్ + సెంటర్ టేబుల్ + 4 కుర్చీలతో డైనింగ్ టేబుల్ + ప్రీమియం కాట్ కుషన్‌తో+10" స్ప్రింగ్ పరుపు +6 పీస్‌ల బెడ్ షీట్ సెట్+4డోర్‌ల ప్రీమియమ్ వార్డ్‌రోబ్ + 3 పీస్‌ల కిచెన్ సెట్+ 3పీస్‌ల ఫ్రైయింగ్ ఫాన్+షూ ర్యాక్ + ఉచితంగా హోండా యాక్టివా -4జి పొందండి.
EMI ₹ 4771
MRP ₹ 2,25,996 ₹ 99,999
లియోనియా రిసార్ట్‌లో 2 రాత్రులు 3 రోజులు కోసం ఉచిత బస
కొనండి బెవర్లి సోఫా (9 సీటర్) : 3 సీటర్ + 2 సీటర్ + దివాన్ + 1 పఫ్ఫీ మరియు ఉచితం గా సైడ్ టేబుల్ + సెంటర్ టేబుల్ పొందండి.
MRP ₹ 69,996 ₹ 29,999 EMI ₹ 1,431
లియోనియా రిసార్ట్‌లో 2 రాత్రులు 3 రోజులు కోసం ఉచిత బస
వెరోనా సోఫా : రిక్లైనర్ సోఫా సెట్ 3+1+1 (5 సీటర్)
ఆర్ట్ లెదర్ సోఫా 3+1+1
MRP ₹ 79,900 ₹ 39,999 EMI ₹ 1,908
లియోనియా రిసార్ట్‌లో 2 రాత్రులు 3 రోజులు కోసం ఉచిత బస
XX: టేక్‌వుడ్ సోఫాసెట్ 3+2+2 (7 సీటర్)
MRP ₹ 83,000 ₹ 23,999 EMI ₹ 1,145
లియోనియా రిసార్ట్‌లో 2 రాత్రులు 3 రోజులు కోసం ఉచిత బస
లండన్: ఎల్ టైప్ సోఫా (7 సీటర్) కొనండి మరియు పొందండి లియోనియా రిసార్ట్‌లో 2 రాత్రులు 3 రోజులు కోసం ఉచిత బస
MRP ₹ 65,000 ₹ 22,999 EMI ₹ 1,050
యాంటియాక్ : సాలిడ్ ఉడెన్ డైనింగ్ టేబుల్
4 సీటర్ (2 కుర్చీలు + 1 బెంచ్) MRP ₹ 43,500 ₹ 16,999
6 సీటర్ (4 కుర్చీలు + 1 బెంచ్) MRP ₹ 47,500 ₹ 19,999
8 సీటర్ (3 కుర్చీలు + 1 బెంచ్ + ఆర్మ్స్‌తో 2 కుర్చీలు) MRP ₹ 76,500 ₹ 29,999
EMI ₹ 811
డైసీ కాట్
క్వీన్ సైజ్ MRP ₹ 37,998 ₹ 16,999
కింగ్ సైజ్ MRP ₹ 41,998 ₹ 18,999
EMI ₹ 811
డైనింగ్ టేబుల్
4 సీటర్ MRP ₹ 30,900 ₹ 11,999
6 సీటర్ MRP ₹ 40,900 ₹ 15,999
EMI ₹ 572
జెస్సికా : డైనింగ్ టేబుల్
4 కుర్చీలతో MRP ₹ 18,500 ₹ 7,999
6 కుర్చీలతో MRP ₹ 26,500 ₹ 10,999
EMI ₹ 382
గాంజెల్స్ : కొనండి సింగిల్ బెడ్ మరియు పొందండి ఉచితం రూ. 6,000 విలువ గల పరుపు
MRP ₹ 17,995 ₹ 9,999
EMI ₹ 477
ప్రీమియం క్వాలిటీ వార్డ్‌రోబ్ : మెంబ్రేన్ ఫినిష్
ఎక్స్‌ట్రా లార్జ్ సైజ్
కొనండి 1 పొందండి 1 ఉచితం
2 డోర్ MRP ₹ 32,500 ₹ 15,999
4 డోర్ MRP ₹ 46,500 ₹ 26,999
EMI ₹ 763
షూ ర్యాక్
ఫెర్న్ : 2 డోర్ MRP ₹ 3,998 ₹ 1,999
వీనస్ : 3 డోర్ MRP ₹ 5,998 ₹ 2,999
సెంటర్ టేబుల్
క్రిస్టల్ MRP ₹ 5,500 ₹ 1,999
మొనాకో MRP ₹ 9,500 ₹ 3,999
Buy 1 Get 1 FREE
మార్చుకోండి
మీ పాత ఫర్నీచర్ 20% వరకు తగ్గింపు
ఏదైనా కాట్ కొనండి & పొందండి పరుపు ఉచితం
ఏదైనా సోఫా సెట్ కొనండి & పొందండి సెంటర్ టేబుల్ ఉచితం
మ. 1.00 గం. లోగా షాపింగ్ చేయండి & ఆశ్చర్యకరమైన బహుమతి పొందండి
An ISO-9001:2008 Certified Company
BANTIA Furnitures
Affordable Lifestyles Since 1955
ఉ. 11.00 ముందుగా షాపింగ్ చేయండి మరియు పొందండి అదనంగా 20% డిస్కౌంట్ కూపన్ కోడ్‌ను ఉపయోగించండి : Special20 www.bantia.in
సికింద్రాబాద్ : ✆ 040-27841562/63/65 కొంపల్లి : ✆ 93905 88000 / 27841563 అత్తాపూర్ : ✆ 32956006 / 35957007 కూకట్‌పల్లి : ✆ 23059000/32943003
ఎ.ఎస్.రావ్ నగర్ : ✆ 27141562 / 9393130908 దిల్‌సుఖ్‌నగర్ : ✆ 24556877 / 32954004 జూబ్లీహిల్స్ : ✆ 27841563/93931 30921 బోడుప్పల్ : ✆ 29704550 / 27841562/63

కన్నుల పండుగ...

వినాయక చవితి వేడుకలు కన్నుల పండుగగా జరుగుతున్నాయి. వీధివీధినా మండపాలను అలంకరించి గణనాథుడికి రకరకాలపూలు, పత్రితో భక్తిశ్రద్ధలతో పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. పర్యావరణ హితంగా ఉండేలా ఈ సారి మట్టి విగ్రహాల వైపు ఎక్కువగా మొగ్గు చూపారు. ఉత్సాహంగా ఫొటోలు దిగుతూ యువత సందడి చేశారు. –సిద్దిపేట జోన్





హలో సాక్షి..

సిద్దిపేట:	98665 53321
సిద్దిపేట రూరల్:	90109 09073
సిద్దిపేట అర్బన్:	99859 16666
చిన్నకోడూరు:	97054 44264
నంగునూరు:	97053 47326
బెజ్జంకి:	94405 01027
చేర్యాల:	80961 45250
కొముురవెల్లి	95055 07605



public demand

సిగ్నల్ టైమర్ పెంచండి



సిద్దిపేట పట్టణంలోని విక్టరీ టాకీస్ కూడలి వద్ద ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్ టైమర్ సమయం తక్కువగా ఉండడంతో వాహనదారులకు ఇబ్బంది కలుగుతోంది. పోలీసు శాఖ వెంటనే టైమర్ సమయాన్ని పెంచితే బాగుంటుంది.

–అజయ్, సిద్దిపేట

గుంతలు పూడ్చాలి



అభివృద్ధిపనులు, ఇతరత్రా అవసరాల కోసం తీసిన గుంతలు పూడ్చకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. మున్సిపల్ అధికారులు వెంటనే గుంతలను పూడ్చేయించేలా చర్యలు తీసుకోవాలి. లేకపోతే ఇబ్బందులు తప్పవు

–సురేశ్, సిద్దిపేట

స్పీడ్ బ్రేకర్ల సంఖ్య తగ్గించాలి



పట్టణంలో అన్ని రోడ్లపై ఇష్టానుసారంగా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. దాంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. అధికారులు చొరవ చూపి స్పీడ్ బ్రేకర్ల సంఖ్య తగ్గించేలా చర్యలు తీసుకోవాలి. అవసరం లేనిచోట వాటిని తొలగించాలి.

–కృష్ణ, సిద్దిపేట

మరిన్ని జోన్ వార్తలు 12వ పేజీలో..

స్మృతి వనం

- మరణించిన ఆత్మీయుల జ్ఞాపకార్థం మొక్కలు
- సిద్దిపేటలో విశేష స్పందన

సిద్దిపేట జోన్

ఆప్యాయతను పంచి, జ్ఞాపకాలను మిగిల్చి కాలగమనంలో తిరిగిరాని తీరాలకు చేరుకున్న ఆత్మీయులతో అనుబంధాన్ని సజీవంగా పదిలపరిచే వినూత్న ఆలోచనే ×స్మృతి వనం₹. సిద్దిపేట పట్టణంలో ఏర్పాటు చేసిన ఈ వనానికి విశేష ఆదరణ లభిస్తోంది. తమను విడిచి వెళ్లిన ఆత్మీయుల జ్ఞాపకార్థం నాటుతున్న ఒక్కో మొక్క వారిలో సాన్నిహిత్య భావన కలిగిస్తోంది.

పుట్టిన రోజు మొక్క నాటుతున్న తరహాలోనే చనిపోయిన వారి జ్ఞాపకార్థం కూడా మొక్కలు నాటే వినూత్న ఆలోచనకు కార్యరూపం సిద్దిపేటలోని స్మృతివనం. పట్టణ శివారులోని ప్రశాంత్ నగర్ హిందూ శ్మశానవాటికలో ఏర్పాటు చేసిన స్మృతి వనం ప్రత్యేకతను చాటుతోంది. తమ కుటుంబలో చనిపోయిన వారి పేరిట కుటుంబ సభ్యులు ఇక్కడ నాటుతున్న మొక్కల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. నామమాత్రం రుసుము చెల్లించి చనిపోయిన వారి పేరిట మొక్క నాటితే మున్సిపాలిటీ వాటి సంరక్షణ బాధ్యత చేపడుతుంది. ఐదెకరాల విశాలమైన స్థలంలో ఏర్పాటు చేసిన స్మృతివనం కోసం ప్రభుత్వం రూ. ఇరవై లక్షలు వెచ్చించింది. నాటిన మొక్క చుట్టూ గార్డెనింగ్, మరణించిన వారి పేరిట శిలాఫలకం ఏర్పాటు చేస్తారు. వారి జయంతి, వర్ధంతి రోజున కుటుంబ సభ్యులు కొద్ది సేపు ఆ మొక్క వద్ద సేదతీరేలా వసతులు ఏర్పాటు చేశారు. అవి ఎదిగే వరకు దాని బాధ్యతలను మున్సిపల్ సిబ్బంది పర్యవేక్షిస్తారు. పచ్చదనం పెంపొందించేందుకు ఆత్మీయులను తలచుకునేందుకూ ఒకే చోట అవకాశం కలిగేలా ఏర్పాటు చేసిన స్మృతి వనంపై మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు.





మొక్కలు నాటుతున్న కుటుంబసభ్యులు

నాన్న జ్ఞాపకంగా...

మా నాన్న మచ్చ బోగారెడ్డి అంటే మాకు ఎంతో ఇష్టం. మమ్మల్ని ప్రేమగా పెంచారు. విధి మా నుంచి మా నాన్నను దూరం చేసింది. ఏటా నాన్న పేరిట కార్యక్రమాలు చేస్తుంటాను. సిద్దిపేట స్మృతి వనంలో ఆయన జ్ఞాపకార్థం ఒక మొక్క నాటాను. ఆయన జయంతి, వర్ధంతి రోజున కుటుంబ సభ్యులమంతా కొద్ది సేపు అక్కడ సేదతీరుతాం.

–మచ్చ వేణుగోపాలరెడ్డి

మంచి సంస్కృతి

తల్లిదండ్రులను అందరూ ప్రాణప్రదంగా ప్రేమిస్తారు. వారిని దేవుళ్ళతో వారిని సమానంగా చూస్తాం. కన్నవారి జ్ఞాపకాలు ఎప్పటికీ నాతో ఉంటాయి. వారి పేరిట స్మృతివనంలో మొక్క నాటాను. మా అమ్మానాన్నల జయంతి, వర్ధంతి రోజున కొద్దిసేపు మొక్కకు నీరు పోసి తృప్తి చెందుతాను.

–కడవేర్గు రాజనర్సు

వసతి గృహాల సమస్యలు పరిష్కరించాలి

సిద్దిపేట ఎడ్యుకేషన్:

సాంఘిక సంక్షేమ హస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్‌ఎఫ్ డివిజన్ కన్వీనర్ వర్మ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ వసతి గృహాల్లో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మెనూ సక్రమంగా పాటించడం లేదన్నారు. త్రాగు నీటి కోసం విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న సంబంధిత అధికారులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. వార్డెన్లు వసతి గృహాల్లో విద్యార్థులకు అందుబాటులో ఉండడంలేదన్నారు. హస్టళ్లలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ఆందోళనలు సైతం నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్, సంపత్, శ్రీకాంత్‌లు ఉన్నారు.

ప్రాజెక్టులను నిర్మించింది కాంగ్రెస్ పార్టీయే

చేర్యాల(సిద్దిపేట): తెలంగాణ రాష్ట్రంలో ప్రాజెక్టులకు కాంగ్రెస్ అడ్డుపడుతుందన్న టీఆర్‌ఎస్ నాయకులు ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టింది కాంగ్రెస్ పార్టీ అన్న సంగతి తెలీదా అని టీపీసీసీ ఎస్సీ సెల్ కన్వీనర్ ముస్త్యాల కిష్టయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కార్యాలయంలో మండల అధ్యక్షుడు కొమ్ము రవి అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి వకుళాభరణం నర్సయ్యపంతులుతో కలిసి మాట్లాడుతూ... వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నపుడే తెలంగాణ ప్రాజెక్టులను ప్రారంభించి పూర్తి స్థాయిలో నిర్మాణాలు చేపట్టారన్నారు. నాడు రైతులకోసం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టిన కాంగ్రెస్ పార్టీని ప్రాజెక్టులకు అడ్డుపడుతుందని బదనాం చేయడం సరికాదన్నారు. ఈ సమావేశంలో బీసీ సెల్ మండల అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు మంచాల చిరంజీవులు, నాయకులు యాదగిరి, మదు, వెంకటశ్, శ్రీనివాస్, రాజు, సంజీవులు, యాదగిరి, బడేమియా, వెంకటయ్య, కరణ్, కృష్ణమూర్తి, రవి, అయిలయ్య, మహెందర్ తదితరులు పాల్గొన్నారు.

లోకల్ వాయిస్

ప్రహరీ నిర్మించాలి



బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు కాంపౌండ్ వాల్ నిర్మించాలి. విద్యార్థుల సంఖ్య ఎక్కువగానే ఉన్నా కళాశాల సమస్యలు పరిష్కరించడం లేదు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ముఖ్యంగా బాలికలు ఎక్కువగా చదువుకునే ఈ కళాశాల అభివృద్ధికి ప్రాధాన్యమివ్వాలి. రాత్రి వేళ ఆకతాయిల ఆగడాలు ఎక్కువవుతున్నాయి.

–బొనగరి మహేందర్, ఏఐఎస్‌ఎఫ్

వెండితెర



సిద్దిపేటలో..

నిన్ను కోరి
వెంకటేశ్వరా కళామందిర్
11.15, 2.15, 6.00,9.00.

శమంతకమణి
శ్రీనివాస్ డీలక్స్
11.15, 2.15, 6.00,9.00

పటేల్ ఎస్ఐఆర్
బాలాజీ డీలక్స్ 11.00, 2.00, 6.00, 9.15.

దువ్వాడ జగన్నాథం
సీతారామాంజనేయ





పంటకు జీవం

ఖరీఫ్‌లో వర్షాలు లేక తల్లడిల్లుతున్న సమయంలో కురిసిన వర్షం పంటకు జీవం పోసింది. గత మూడు రోజులలో కురిసిన వర్షాలతో రైతుల ముఖాల్లో సంతోషం విరిసింది. పంట ఎండుతున్న దశలో కురిసిన వాన వాటికి ప్రాణాధారమైంది.

-ప్రశాంత్ నగర్ (సిద్దిపేట)

‘ప్రశ్నించిన రైతులపైనే కేసులా?’

సిద్దిపేటటౌన్: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం కోసం శనివారం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ సమావేశంలో ప్రశ్నించిన రైతులను అరెస్టు చేయడం తగదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చొప్పదండి చంద్రశేఖర్, డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు అన్నారు. డివిజన్ మహిళా అధ్యక్షురాలు వనం సంధ్యారాణితో కలిసి వారు విలేకరులతో మాట్లాడుతూ వయోలా గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉన్నతాధికారుల ఎదుట గోడు వెళ్లబోసుకున్న రైతులను అరెస్టు చేయడాన్ని ఖండించారు. ఒకే ప్రాజెక్టు పరిధిలోని నిర్వాసితులకు వేర్వేరు పరిహారాలు చెల్లిస్తూ రైతులను మోసం చేస్తున్నారన్నారు. ముంపు గ్రామాల్లోనే ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలన్నారు. అభిప్రాయ సేకరణ పూర్తవకముందే చేపట్టిన ప్రాజెక్టుల నిర్మాణాలను ప్రక్రియ పూర్తయే వరకు నిలిపేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నరేశ్, రాజు, మహేందర్, ఎల్లయ్య, పరశురాములు పాల్గొన్నారు.

రైతులపై కేసులు ఎత్తేయాలి

బెజ్జంకి(సిద్దిపేట): ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడితే కేసులు పెట్టడం తగదని సీపీఎం మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్ పేర్కొన్నారు. బెజ్జంకిలో శనివారం విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో కనీస వసతులు విద్యుత్, తాగునీరు, రోడ్ల వసతులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కేసులు ఎత్తేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో లింగం, జంగిలి సంపత్, ప్రభాకర్, అశోక్ పాల్గొన్నారు.

కట్టపై ఫెన్సింగ్ వేయించాలి

కొముురవెల్లి(సిద్దిపేట): తపాస్‌పల్లి రిజర్వాయర్ కట్టపై విరిగిపోయి ప్రమాదకరంగా మారిన ఇనుప ఫెన్సింగ్‌కు మరమతులు చేయించాలని బీజేవైఎం మండలాధ్యక్షుడు స్వామిగౌడ్ అన్నారు. శనివారం ఐనాపూర్‌లో ప్రమాదకరంగా మారిన ఫెన్సింగ్‌ను పరిశీలించారు. నెల రోజులుగా రిజర్వాయర్‌లోకి గోదావరి నీళ్ళు వదలడంతో సందర్శకుల సంఖ్య భారీగా పెరిగిందని, వెంటనే మరమ్మతులు చేయించాలని కోరారు. ఆయన వెంట ప్రశాంత్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, నర్సయ్య, శ్రవణ్, ప్రశాంత్‌కుమార్, భరత్, అంజి ఉన్నారు.

పది క్వింటాళ్ల కందులు సీజ్

చేర్యాల(సిద్దిపేట): మండలంలోని కడవేర్గు గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన పది క్వింటాళ్ల కందులను శనివారం రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. తమకు అందిన సమాచారం ప్రకారం ఓ రైతు ఇంట్లో నిల్వ చేసిన పది క్వింటాల్ల కందులను స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ విజయసాగర్ తెలిపారు. ఈ విషయాన్ని మార్కెటింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

చేర్యాల(సిద్దిపేట): సెప్టెంబర్ 1ని విద్రోహ దినంగా పరిగణిస్తూ కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నా వాల్‌పోస్టర్‌ను చేర్యాలలోని అంబేద్కర్ కూడలి వద్ద ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. నూతన పింఛన్ విధానం అమలైన సెప్టెంబర్1 ఉద్యోగుల పాలిట చీకటి రోజని, ఆరోజున సామూహిక సెలవుగా ప్రకటించి, కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాకు నల్లబ్యాడ్జిలతో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూపీఎస్ నాయకులు బాల్‌రెడ్డి, చంద్రం, కిష్టయ్య, శ్రీనివాస్‌రెడ్డి, ప్రశాంత్‌కుమార్, దామోదర్, చంద్రారెడ్డి, సిద్దయ్య, మల్లేశం, కుమారస్వామి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా మదర్ థెరిసా జయంతి

చేర్యాల(సిద్దిపేట): డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మదర్ థెరిస్సా 107వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆమె సేవలను కొనియాడారు. దేశంలోని అభాగ్యులకు నిస్వార్థంగా ఆమె సేవలందించారని భౌతికశాస్త్ర ప్రొఫెసర్ త్యాగయ్య కొనియాడారు. కార్యక్రమంలో ప్రోగ్రామింగ్ ఆఫీసర్ ఎస్.కె.సాదిక్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు హెచ్.పల్లవి, డి.పుష్ప, శారద, సూర్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజలను మభ్యపెడుతున్న ప్రతిపక్షాలు

చిన్నకోడూరు(సిద్దిపేట): టీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు అసంబద్ధమైన మాటలతో ప్రజలను మోసగిస్తున్నాయని టీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కనకరాజు, పీఏసీఎస్ చైర్మన్ పాపయ్య అన్నారు. ప్రతిపక్షాలు ప్రాజెక్టులను అడ్డుకోవడం సరికాదన్నారు. ప్రాజెక్టులు పూర్తయితే బీడు భూములు బంగారు భూములవుతాయన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణలో ప్రాజెక్టులను పట్టించుకోని ప్రతిపక్షాలు పనులు వేగంగా జరుగుతుంటే జీర్ణించుకోలేకపోతున్నాయని విమర్శించారు. వ్యవసాయానికి 24గంటల కరెంట్ ఘనత టీఆర్ఎస్‌దేనన్నారు.

క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి ముందుంటా: ఎమ్మెల్సీ ఫారూఖ్

సిద్దిపేట టౌన్: క్రైస్తవ సామాజిక వర్గ సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడు ముందుంటానని ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్ అన్నారు. శనివారం సిద్దిపేట సీఎస్ఐ చర్చిలో జరిగిన క్రైస్తవ ఐక్యవేదిక సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. క్రైస్తవుల అంతిమ యాత్ర రథంను అందించనందుకు మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. క్రైస్తవ భవనం నిర్మించాలని,ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెల్లాలని ఎమ్మెల్సీని కోరారు. సికింధర్ తదితరులు ఉన్నారు.

విగ్రహావిష్కరణ అడ్డుకున్న అధికారులు

చేర్యాల(సిద్దిపేట): మండలంలోని వీరన్నపేట మాజీ సర్పంచ్, పీఏసీఎస్ చైర్మన్ ఈశ్వర్‌రెడ్డి విగ్రహావిష్కరణను శుక్రవారం రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. విగ్రహ ఏర్పాటుకు అనుమతించాలంటూ సర్పంచ్, ఈశ్వర్‌రెడ్డి కుటుంబీకులు కలెక్టర్‌కు దరఖాస్తు చేయగా దాన్ని కలెక్టర్ తిరస్కరించారని, అనుమతి లేకుండా ప్రభుత్వ స్థలాల్లో ప్రైవేటు వ్యక్తుల విగ్రహాలు పెట్టడం నిబంధనల ఉల్లంఘనే అవుతుందని తహసీల్దార్ విజయసాగర్ తెలిపారు. విగ్రహాన్ని తొలగించాలని ఆదేశించినట్లు తెలిపారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం

నంగునూరు(సిద్దిపేట): అనారోగ్యంతో మృతిచెందిన ఓ నిరుపేద కుటుంబ సభ్యులకు ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు జయపాల్‌రెడ్డి శుక్రవారం అంత్యక్రియల కోసం ఆర్థికసాయం అందించారు. నంగునూరుకు చెందిన వెల్దండ లింగం గురువారం అనారోగ్యంతో మృతిచెందాడు. వారి కుటుంబ పరిస్థితి తెలుసుకున్న గ్రామస్తులు మంత్రి హరీశ్‌రావుకు సమాచారం అందించగా ఆయన సూచన మేరకు జయపాల్‌రెడ్డి రూ. ఐదు వేల ఆర్థికసాయం అందించారు.

సీపీఎస్ రద్దు చేయాలి

బెజ్జంకి(సిద్దిపేట): సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేసి పాత పింఛన్ విదానాన్ని అమలు చేయాలని ఎస్టీయూ మండలాధ్యక్షుడు వడ్లకొండ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బెజ్జంకిలో విలేకరులతో మాట్లాడారు. పింఛన్ ఉద్యోగుల హక్కు అని, అది సాధించే వరకు సంఘటితంగా ఉద్యమించాలని అన్నారు. ఈనెల 28న సిద్దిపేటలో నిర్వహించే ర్యాలీకి పెద్దసంఖ్యలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆ సంఘం మండల ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా బాధ్యులు గుండా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

Zone Guide

సర్వసభ్య సమావేశం వాయిదా

నంగునూరు(సిద్దిపేట): మండల సర్వసభ్య సమావేశం ఈనెల 28కి వాయిదా వేసినట్లు ఎంపీడీఓ నాగేశ్వర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణం కోసం సిద్దిపేటలో ప్రజాభిప్రాయ సేకరణ నేపథ్యంలో ఎంపీపీ సూచనల మేరకు వాయిదా వేశామన్నారు. సోమవారం మధ్యాహ్నం ఒంటిగంటకు సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీఓ పేర్కొన్నారు.

విద్యుత్ బిల్లుల వసూలు క్యాంపు

నంగునూరు(సిద్దిపేట): సిద్దన్నపేట, పాలమాకుల, నర్మేట, నంగునూరు గ్రామాల్లో ఆదివారం విద్యుత్ బిల్లుల వసూలు క్యాంపు నిర్వహిస్తామని ఏఈ రియాజ్ అహ్మద్ తెలిపారు. ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పంచాయతీ కార్యాలయాల వద్ద నిర్వహించే క్యాంపులో వినియోగదారులు బిల్లులు చెల్లించాలని ఏఈ సూచించారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ దరఖాస్తులు

సిద్దిపేటఎడ్యుకేషన్: సిద్దిపేట పట్టణంలోని అక్షర జూనియర్ కళాశాలలో ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల కో-ఆర్డినేటర్ విఠల్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు వచ్చే నెల నాలుగో తేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా దరఖాస్తు చేసుకోచ్చని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9949453743 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

కేంద్ర పథకాలను వివరించాలి

నంగునూరు(సిద్దిపేట): కేంద్ర సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అమలయ్యేలా చూడాలని బీజేపి మండలాధ్యక్షుడు తిరుపతిరావు పిలుపునిచ్చారు. శనివారం జరిగిన సమావేశంలో కార్యదర్శిగా గంపల మహేందర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఇంటర్వ్యూ

నగేశ్, ఏఓ
అంశం: సాగులో మెలకువలు
కొమురవెల్లి



సాక్షి: కొమురవెల్లి మండలంలో ప్రధానంగా సాగు చేసే పంటలేవి?

ఏఓ: మండలంలో మొత్తం 4వేల200 మంది రైతులున్నారు. వరి, పత్తి, మొక్క జొన్న, కంది పంటలు సాగు చేస్తున్నారు.

సాక్షి: పత్తి సాగు ఏ దశలో ఉంది? రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలేమిటి?

ఏఓ: పత్తి పూత దశలో ఉంది. ఈ దశలో రసం పీల్చే పురుగులు (పచ్చదోమ, పెనుబంక) ఆశించడంతో ఆకులు ఎర్రబడతాయి. దీని నివారణకు లీటర్ నీటిలో మోనోక్రోటోపాస్ 1.5 మి.లీ. లేదా ఆసిపేట్ 1.5 గ్రాములు, ఇమిడాక్లోప్రిడ్ 0.4 మి.లీ. కలిపి పిచికారీ చేయాలి.

సాక్షి: వరి సాగు ఏదశలో ఉంది? పంటకు సోకే చీడపీడల నివారణకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

ఏఓ: వరి పంట పొట్టకు వచ్చే దశలో ఉంది. ఈ దశలో శీత్‌రాట్ తెగులు సోకితే దాని నివారణకు మాంకోజెబ్ లేదా ఎగ్జికోలజోల్ రసాయనాన్ని పిచికారీ చేయాలి.

సాక్షి: మొక్కజొన్న పంట సాగు ఏదశలో ఉంది? ఎలాంటి తెగులు సోకే అవకాశముంది?

ఏఓ: ఇప్పుడున్న దశలో మొక్కజొన్నకు కాండం తొలిచే పురుగు సోకే అవకాశముంది. దాని నివారణకు కార్బోప్యూకాన్ త్రీజీ గుళికలను మొక్కజొన్న సుడులలో వేయాలి.

సాక్షి: రైతులకు మీరిచ్చే సలహాలు, సూచనలు?

ఏఓ: రైతులు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించాలి. వర్షాలు ఎక్కువగా కురిస్తే ఆకులు వాడిపోతాయి. నివారణకు కార్బోన్‌డెజిన్ రసాయాన్ని పిచికారీ చేయాలి.

–కొమురవెల్లి(సిద్దిపేట)



మిరుదొడ్డి(దుబ్బాక): చినుకు పడిందంటే చాలు మండల పరిధిలోని చెప్యాలలో సీసీ రోడ్లు సైతం సమస్యగా మారుతున్నాయి. సీసీ రోడ్లపై మట్టి చేరడంతో కురిసిన వర్షాలకు చిత్తడిగా మారుతున్నాయి. నడవలేని స్థితికి చేరుతున్నాయి. పంచాయతీ వద్ద వేసిన సీసీ రోడ్డు అధ్వానంగా ఉంది. అధికారులు సమస్యకు పరిష్కారం చూపాలి.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9989066762

SUNDAY SPECIAL

ఫోన్ కొట్టు.. 'టీ పట్టు'



దుకాణాల వద్ద టీ అమ్ముతున్న రమేశ్

- ఐదు నిమిషాల్లోనే కోరుకున్న టీ
- పదిహేనేళ్లుగా టీ విక్రయమే జీవనాధారం
- దుబ్బాకలో మొబైల్ టీ

పట్టణ కేంద్రానికి చెందిన నిరుపేద దంపతులు పుట్ట జ్యోతి రమేశ్‌లకు ఒక మంచి ఐడియా వచ్చింది. రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితి వారిది. ఇతరులపై ఆధారపడి జీవించకుండా తన స్వశక్తితో పైకి ఎదగడానికి ఆహర్నిశలు శ్రమిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు.కుటుంబాన్ని పట్టిపీడిస్తోన్న పేదరికాన్ని తరిమేయడానికి మంచి మార్గంలో నడుస్తూ శభాష్ అనిపించుకుంటున్నాడు రమేష్.

–దుబ్బాక

దుబ్బాక:ఒక ఐడియా రమేష్ జీవితాన్నే మార్చినట్లుగా వీరి జీవితాన్నే మార్చేసింది. తమ దగ్గర ఉన్న కొద్దిపాటి డబ్బులతో లీటర్ పాలను కొనుగోలు చేసి, ఇంటి వద్ద తయారు చేసుకున్న టీ(చాయి)ని ప్లాస్కులో పోసుకుని ముందుగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ టీ.. టీ అంటూ సైకిల్‌పై తిరిగాడు. ఇలా తిరుగుతూనే తన ఫోన్ (9951238195)నంబర్‌ను ప్రతి ఒక్కరికి ఇచ్చాడు. టీ ఇటు అధికారుల అవసరాలు తీర్చగా అటు రమేశ్ కుటుంబానికి అసరా ఇచ్చింది.

కుటుంబానకి ఆసరా కల్పిస్తున్న చాయ్..

ఇలా గత 15 ఏళ్లుగా మొబైల్ టీ రమేశ్ కుటుంబానికి జీవనాధారమైంది. లీటర్ పాలతో ప్రారంభమైన టీ నేడు 20 లీటర్లకు చేరింది. రోజుకు రూ. 500 వరకు సంపాధిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. టీ అమ్మగా వచ్చిన డబ్బుతో ఇటీవల తన కూతురు రాజశ్రీ వివాహం చేశాడు. చిలికి చిలికి గాలివానలా రమేశ్ తయారు చేస్తున్న టీ పట్టణంలోని వారికి తెలిసింది. టీ ఎప్పుడు తాగాలనిపిస్తే అప్పుడే రమేశ్ ఫోన్ నంబర్‌కు ఫోన్ కొట్టడంతోనే ఐదు నిమిషాల్లోనే మనముందర పసందైనా, వేడి వేడి టీ వచ్చి చేరుతుంది. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, వ్యాపార లావాదేవీలు నిర్వహించుకునే వారందరూ ఫోన్ కొట్టి టీ తెప్పించుకోవడం అలవాటు చేసుకున్నారు. ప్రభుత్వమేదైనా సహాయం అందిస్తే తన టీ కొట్టును మెరుగ్గా చేసుకుంటానని రమేశ్ చెప్పాడు.

ఇంటింటికీ తిరుగుతూ..



నా వద్ద ఉన్న కొద్దిపాటి డబ్బులతో తయారు చేసుకున్న టీని ఇంటింటికీ తిరుగుతూ గత పదిహేనేళ్లుగా అమ్ముకుంటున్నా. వచ్చిన డబ్బులతోనే కుటుంబాన్ని పోషించుకుంటున్నా. ప్రభుత్వమేమైనా ఆర్థిక సహాయం చేస్తే వాహనం కొనుగోలు చేసుకుని స్వయం ఉపాధి పొందుతా.

– పుట్ట రమేశ్, మొబైల్ టీ నిర్వహాకుడు, దుబ్బాక



సైకిల్‌పై టీ అమ్ముతున్న రమేశ్

న్యూస్ బాక్స్

కరపత్రం ఆవిష్కరణ

రాయపోలు(దుబ్బాక):సీపీఎస్ రద్దును కోరుతూ ఈ నెల 28న జిల్లా కేంద్రం సిద్ధిపేటలో జరిగే భారీ ర్యాలీని జయప్రదం చేయాలని టీటీయూ దౌల్తాబాద్ మండల అధ్యక్షుడు సుద్దాల భిక్షపతి, ప్రధాన కార్యదర్శి ఆది జగన్ కోరారు. ఈ మేరకు ముద్రించిన కరపత్రాన్ని శనివారం ఆవిష్కరించారు. సిద్ధిపేటలోని ప్రధాన చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 16 ఉపాధ్యాయ సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పెన్షన్ విద్రోహ దినంగా పాటించాలి

మిరుదొడ్డి(దుబ్బాక): సెప్టెంబర్ ఒకటిన ఉపాధ్యాయ ఉద్యోగులు పెన్షన్ విద్రోహ దినంగా పాటించాలని వివిధ ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శనివారం మిరుదొడ్డిలో సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ పెన్షన్ విద్రోహ దినం వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు అందె రాంచంద్రం, కె. యాదగిరి, ర్యాకం మల్లేశం, శివాజి, అమరేందర్‌రెడ్డి, నాగేందర్, వెంకటనర్సింహులు, శ్రీనివాస్, అంజనేయులు, బాలకృష్ణ, రాజమణి, శ్రీలత, పద్మ, స్వర్ణలత, జ్యోతి, అపర్ణ, చంద్రశేఖర్, గౌతమి, జగదీశ్వర్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వ్యాక్సినేషన్

రాయపోలు(దుబ్బాక):తట్టు, రుబెల్లా వ్యాక్సినేషన్ కార్యక్రమం కొనసాగుతుంది. రాయపోలు మండలం బేగంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ఇందుప్రియాల్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులతో పాటు గ్రామంలోని చిన్నారులకు వ్యాక్సిన్ వేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి డా.రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కల అందజేత

మిరుదొడ్డి(దుబ్బాక): హరితహారం కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని ఖాజీపూర్‌లో ఇంటింటికీ మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. నీడ, పండ్లనిచ్చే మొక్కలను సర్పంచ్ పెర్క మధు గ్రామస్తులకు అందించారు.

కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన



రామారంలో పుస్తకాలు అందజేస్తున్న సభ్యులు

రాయపోలు(దుబ్బాక):పదవ తరగతి పూర్తయిన తర్వాత విద్య, ఉద్యోగం, ఉపాధి అవకాశాలను తెలియజేస్తూ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. బార్న్ టు సర్వ్, వాట్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం దౌల్తాబాద్, రాయపోలు మండలాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. దౌల్తాబాద్ మండల పరిధిలోని తిర్మలాపూర్, ముబారస్‌పూర్, రాయపోలు మండలంలోని రాయపోలు, రాంసాగర్, రామారం, వడ్డేపల్లి, బేగంపేట ఉన్నత పాఠశాలల్లోని 10వ తరగతి విద్యార్థులకు పలు సూచనలిచ్చారు. కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించే అంశాలతో ముద్రించిన పుస్తకాలను విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఆయా సంస్థల సభ్యులు మధు, శివకాంత్, సతీష్ ఉన్నారు.

మొక్కల విశిష్టతపై కళా ప్రదర్శన

దుబ్బాక:అటవీ శాఖ ఆధ్యర్యంలో నిర్వహిస్తున్న మూడవ విడత హరితహారంలో భాగంగా శనివారం దుబ్బాక మండలం హసన్‌మీరాపూర్‌లో మొక్కల విశిష్టతపై తెలంగాణ సాంస్కృతిక సారథి సభ్యుల బృందం కళా ప్రదర్శన చేపట్టింది. కార్యక్రమంలో కళాకారులు చీకోడు నర్సింలు, బిట్ల ఎల్లం, డప్పు బాబు, ముక్కపల్లి భార్గవీ, జింక దేవదాస్, ఆస రామారావు, ముప్పారం ప్రకాశ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

లోకల్ వాయిస్

సూచికల బోర్డులు ఏర్పాటు చేయాలి



మిరుదొడ్డి(దుబ్బాక): ధర్మారం బస్ స్టాపు, మిరుదొడ్డి చౌరస్తా వద్ద, సరైన సీడ్ బ్రేకర్లు, ప్రమాద సూచికలు లేక వాహనాలు అదుపు తప్పుతున్నాయి. దీంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ ప్రాంతంలో మూల మలుపుల వద్ద కొత్త వాహనదారులకు అవగాహన లేక పోవడంతో అడపాదడప ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు. వాహనాల వేగానికి అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. ఇప్పటికైనా అధికారులు సమస్యను పరిష్కారించాలి.

– అసికం రామస్వామి, ధర్మారం



వెండితెర



దుబ్బాక:జయ జానకి నాయక (శ్రీనివాస11.00,2.00,6.009.00
గజ్వేల్:జయ జానకి నాయక 11.00,2.00,6.0,9.0 -సంతోష్
గజ్వేల్: 11.00,2.00,6.00, 9.00 నేనేరాజు నేనే మంత్రి(యాదగిరి)

న్యూస్ బాక్స్

దరఖాస్తుల ఆహ్వానం

మిరుదొడ్డి(దుబ్బాక): ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్‌లో చేరే విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎస్వీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కన్కటి బాలకిషన్ తెలిపారు. శనివారం మిరుదొడ్డిలో ఆయన మాట్లాడుతూ 14 సంవత్సరాలు నిండి బడి మధ్యలో మానివేసిన వారికి టెన్త్ చదువుకోవడానికి అవకాశం ఉందన్నారు. అలా గే 15 సంవత్సరాలు నిండి 10వ తరగతి పూర్తయిన వారందరు ఇంటర్మీడియట్ కోర్సు చేసే అవకాశం ఉందన్నారు. ఓపెన్ ఇంటర్, ఓపెన్ టెన్త్ చదవాలనుకున్న వారు సెప్టెంబర్ 4వ తేదీలోపు ఎస్వీ జూనియర్ కాలేజీలలో అడ్మిషన్లు పొందవచ్చని తెలిపా రు. పూర్తి వివరాల కోసం సెల్: 9866648681 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

దీన్ దయాళ్ మార్గంలో నడవాలి

దుబ్బాక:

పండిత్ దీన్ దయాళ్ శర్మ జీవితం యువతకు ఆదర్శమని బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు దూలం వెంకట్ గౌడ్ అన్నారు. దీన్ దయాళ్ శర్మ శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని శనివారం దుబ్బాక పట్టణ కేంద్రంలోని శ్రీ చైతన్య డిగ్రీ కళాశాలలో బీజేవైఎం ఆధ్వర్యంలో దీన్ దయాళ్ జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. దీన్ దయాళ్ జీవితమంతా దేశ సేవకు అంకితం చేశారని, ఆయన ఆశయాలను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు పగడాల నరేందర్, కిష్టంగారి రమేశ్‌రెడ్డి, సుంకు ప్రవీణ్, పున్న శివ కుమార్, శివశంకర్, రవీందర్, వికాస్ గౌడ్, మహేందర్, సప్తగిరి, మనోజ్, వేణు, నవీన్, బోయ రాజశేఖర్, సత్యం, దేవరాజ్, బాచి, పుర్మ రంజిత్ రెడ్డి,పుర్మనరేశ్ ఉన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

దుబ్బాకరూరల్(దుబ్బాక):దుబ్బాక మండలం పెద్దచీకోడ్ లో శుక్రవారం పేకాట స్థావరాలపై పోలీసులు దాడి చేసి ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు సీఐ నిరంజన్, ఎస్ఐ సుభాష్ గౌడ్ తెలిపారు. ఈసందర్భంగా సీఐ విలేకరులతో మాట్లాడుతూ పేకాట ఆడుతున్నారని తగిన సమచారం మేరకు గ్రామ శివారులోని పశువుల పాకలో పేకాట ఆడుతుండగా పట్టుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.53045 నగదు, తొమ్మిది సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

లీకేజీని అరికట్టండి



మిరుదొడ్డి(దుబ్బాక):మిషన్ భగీరథ పైపులైన్ లీకవడంతో తాగునీరు కలుషితం అవుతోందని మండల పరిధిలోని ధర్మారం గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలలుగా తాగు నీరు వృథా అవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. లీకవుతున్న నీటితో తాగు నీరు కలుషితంగా మారుతోందని, సంబంధిత అధికారులు తక్షణమే పట్టించుకుని పైపులైన్ లీకేజీని అరికట్టాలని జనం డిమాండ్ చేస్తున్నారు.

గణపతి బొప్పా మోరియా



రాయపోలులో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



మిరుదొడ్డిలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

దుబ్బాక రూరల్, మిరుదొడ్డి, రాయపోల్,తొగుట:వినాయక చవితిని నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో ఘనంగా నిర్వహించారు. వివిధ రూపాల్లో బొజ్జగణపయ్య భక్తులకు కనువిందుచేశాడు.

పోలీసుల కృషి అభినందనీయం

ఎమ్మెల్యే రామలింగారెడ్డి

దుబ్బాకరూరల్(దుబ్బాక):పోలీసుల సహకారంతో ప్రభుత్వ ఆస్పత్రిలో సీసీ కెమెరాలు బిగించడం అభినందించాల్సన విషయమని రాష్ట్ర శాసనసభ అంచనాల కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే రామలింగారెడ్డి తెలిపారు. శుక్రవారం దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రిలో సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రులు పేద ప్రజలకు వరంలాంటి వన్నారు. పేద ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి డబ్బులు వృథా చేసుకోకుడదని, ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే వైద్యం చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సీఐ నిరంజన్, ఎస్ఐ సుభాష్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎల్లారెడ్డి, డాక్టర్ సాయిరాం నాయకులు ఆస స్వామి, రొట్టె రమేశ్, గన్నె భూంరెడ్డి, తౌడ శ్రీనివాస్, పర్షకృష్ణ, బండి రాజు, గన్నె సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.



కంప్యూటర్ గదిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామలింగారెడ్డి

ఎమ్మెల్యే పరామర్శ

రాయపోలు(దుబ్బాక):మాతృవియోగం పొందిన సర్పంచుల కుటుంబాలను శుక్రవారం దుబ్బాక ఎమ్మెల్యే రామలింగారెడ్డి పరామర్శించారు. దౌల్తాబాద్ మండల పరిధిలోని దొమ్మాట సర్పంచ్ మోహన్ రావు తల్లి గంగ మ్మ రెండురోజుల క్రితం మృతి చెందారు. అలాగే శేరిపల్లిబందారం సర్పంచ్ నవనీత తల్లి దౌల్తాబాద్ లోఅనారోగ్యంతో మృతిచెందారు.

కుక్కకాటుతో ఇద్దరికి గాయాలు

రాయపోలు(దుబ్బాక):వీధిలో ఆడుకుంటున్న చిన్నారులపై వీధి కుక్క దాడిచేసింది. తీవ్రంగా గాయపరిచింది. ఇద్దరు చిన్నారులకు తీవ్రంగా గాయాలయ్యాయి. వినాయక చవితి పర్వదినం నాడు రాయపోలు మండలం టెంకంపేటలో చోటుచేసుకున్న సంఘటన వివరాలు స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన శేరి స్వామి కొడుకు రాజు (6) ఇంటి మందు వీధిలో ఆడుకుంటున్నాడు. కాగా అక్కడికి వచ్చిన ఓ వీధి కుక్క రాజును తీవ్రంగా గాయపరిచింది. అక్కడి నుంచి పక్కవీధిలో ఆడుకుంటున్న దర్శనం రాజయ్య కొడుకు చరణ్ (7)ను గాయపరిచింది. ఇద్దరు చిన్నారులకు తీవ్రంగా గాయాలయ్యాయి. వారిని వెంటనే గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో తలకు గాయాలైన రాజును హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి, కంటికి గాయాలైన చరణ్‌ను సరోజినీ కంటి ఆసుపత్రికి తరలించారు.

Zone Guide

నేడు కాంగ్రెస్ యువగర్జన

రాయపోలు(దుబ్బాక):రాయపోలులో ఈ నెల 27న మండల కేంద్రం కాంగ్రెస్ యువగర్జన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు దౌల్తాబాద్, రాయపోలు మండల కాంగ్రెస్ అధ్యక్షులు దశరథరెడ్డి, రాజిరెడ్డి తెలిపారు. మాజీ మంత్రి సునీతాలక్ష్మారెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహా, మెదక్ పార్లమెంటు ఇన్‌చార్జి శ్రవణ్‌కుమార్ రెడ్డి తదితరులు దౌల్తాబాద్‌లో పార్టీ జండావిష్కరణ చేస్తారని, అక్కడి నుంచి రాయపోలు వరకు బైక్‌ర్యాలీ నిర్వహించి సభను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి రాయపోలు, దౌల్తాబాద్ మండలాలకు చెందిన కార్యకర్తలు భారీగా తరలిరావాలని వారు పిలుపునిచ్చారు.

రేపు ఎస్సీ కార్పొరేషన్ ఇంటర్వ్యూలు

దుబ్బాక:దుబ్బాక నగర పంచాయతీ పరిధిలోని ధర్మాజీపేట, మల్లాయపల్లి, చెల్లాపూర్, మల్లాయపల్లి, దుంపలపల్లి, లచ్చపేట, చేర్వాపూర్ గ్రామాలకు చెందిన ఎస్సీ నిరుద్యోగులకు ఎస్సీ కార్పొరేషన్ ఇంటర్వ్యూలను ఈ నెల 28న నిర్వహిస్తున్నట్లు కమిషనర్ భోగీశ్వర్ తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్‌లో 51 యూనిట్లను ప్రభుత్వం మంజూరు చేసిందని, ఇందులో ఏపీజీవీబీ(దుబ్బాక)-14 యూనిట్లు, ఎస్‌బీఐ(దుబ్బాక)-13 యూనిట్లు, ఆంధ్రబ్యాంకు(దుబ్బాక)-12 యూనిట్లు, ఏపీజీవీబీ(చిట్టాపూర్)-12 యూనిట్లు మంజూరైనట్లు వెల్లడించారు. అర్హులైన ఎస్సీ లబ్ధిదారులు ఈ నెల 28న మధ్యాహ్నం 3 గంటలకు నగర పంచాయతీ కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూలకు నిర్ణీత దరఖాస్తులతో పాటు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతోపాటు పాస్ ఫొటోతో రావాలన్నారు.

ఇంటర్వ్యూ

సమ్రిన్‌బేగం
అంశం : వ్యవసాయం
ఏఈఓ మిరుదొడ్డి



సాక్షి: మొక్కజొన్నలో నీటి యాజమాన్యం ఏవిధంగా చేపట్టాలి?

అధికారి: వర్షాధారం కింద సాగయ్యే మొక్కజొన్నకు వర్షాలే ఆధారం కాబట్టి శ్రమ పడాల్సిన అవసరం లేదు. ఆరుతడి పంటగా సాగు చేసే మొక్కజొన్న సాగుకు పూతకు ముందు, పూత దశలో, గింజలు పాలు పోసుకునే దశలో బాగా నీరు పెట్టుకోవాలి. విత్తనాలు విత్తిన తర్వాత చేలలో నీరు నిలవ్వకుండా చూసుకోవాలి. నీరు నిలిస్తే విత్తనాలు సరిగ్గా మొలకెత్తవు. పంట కాలంలో 6 నుంచి 8 తడుల వరకు నీరు అందిస్తే సరిపోతుంది.

సాక్షి: అంతర పంటల వల్ల రైతులకు ఏవిధమైన లాభం చేకూరుతుంది?

అధికారి: మొక్కజొన్నలో ఆరుతడి పంటల సాగుతో అనేక లాభాలు ఉన్నాయి. సాగులో ఒకే పంటకు బదులుగా రెండు పంటలు వేసుకుంటే తీవ్ర వర్షా భావాల వల్ల కలిగే పరిస్థితుల్లో ఒక పంట నష్టపోయినా మరో పంటతో ఆదాయం పొందడానికి అవకాశం ఉంది. మొక్కజొన్న సాళ్లల్లో కందిగానీ, వేరుశనగ, అపర పంటలను అంతర పంటలుగా సాగు చేస్తే కష్టాల నుంచి గట్టెక్కడానికి అవకాశం ఉంది.

సాక్షి: రసాయన ఎరువుల వాడకాన్ని ఏవిధంగా తగ్గించుకోవచ్చు?

అధికారి: ముఖ్యంగా రబీ సీజన్‌లో వేరుశనగ వంటి పప్పు జాతి పంటలను సాగు చేయడం వల్ల భూమిలో స్థిరికరించడం జరుగుతుంది. దీంతో భూమిలో నత్రజని లభ్యమవుతుంది. కాగా ఖరీఫ్‌లో సాగయ్యే మొక్కజొన్న సాగుకు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించుకోవచ్చు. పెట్టుబడి తగ్గడంతో పాటు రైతుకు రాబడి అధికమవుతుంది.

సాక్షి: ఏ దశలో పంటను కోయాలి?

అధికారి: కంకులు ఎండిపోయే దశలో ఉన్నప్పుడు కంకిని చూసిన తర్వాత కోయాలి.

-మిరుదొడ్డి





గజ్వేల్‌రూరల్ : గజ్వేల్ –ప్రజ్ఞాపూర్ నగర పంచాయతీ పరిధిలోని 10వ వార్డు సాయి బాబా దేవాలయానికి వెళ్లే మార్గంలో మురుగు కాల్వ అధ్వానంగా మారింది. దీంతో మురుగునీరు నిలిచిపోయి దుర్గంధం వెదజల్లడంతో పాటు దోమలు, ఈగలు వృద్ధి చెందుతున్నాయి.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9010144459

రయ్.. రయ్!

SUNDAY SPECIAL

డ్రైవింగ్‌పై యువత ఆసక్తి చూపుతోంది. ఉన్నత చదువులు పూర్తి చేసినా ఉద్యోగ అవకాశాలు కరువైన తరుణంలో చోదక వృత్తి వారికి తరుణోపాయంగా మారింది. ఈ రంగంలో రాణించే అవకాశాలు బోలెడు ఉండడంతో వాటిని అందిపుచ్చుకునేందుకు శిక్షణా కార్యక్రమాలవైపు మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వ కృషి ఫలితంగా నిరుద్యోగ యువతకు డ్రైవింగ్‌లో శిక్షణ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ సౌజన్యంతో 'సెట్విన్' సంస్థ గజ్వేల్‌లో శిక్షణ చేపడుతోంది.. గత జూలై 6న గజ్వేల్ పట్టణంలోని మినీ స్టేడియంలో మెదక్ పార్లమెంటు సభ్యుడు కొత్త ప్రభాకర్‌రెడ్డి, 'గడా' ఓఎస్డీ హన్మంతరావు కారు డ్రైవింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సెట్విన్ ఆధ్వర్యంలో జరుగుతున్న డ్రైవింగ్ శిక్షణలో భాగంగా యువతకు నెల రోజుల పాటు వాహనం నడపడంపై ప్రత్యేక తర్ఫీదునిచ్చారు.



శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి(ఫైల్)

- సర్కారు ప్రోత్సాహం.. సెట్విన్ సహకారం
- పూర్తికావొచ్చిన మొదటి విడత శిక్షణ
- ఉపాధి కల్పించడమే సంస్థ లక్ష్యం



ఇంజిన్ పనితీరుపై శిక్షణ

గజ్వేల్‌రూరల్ : ప్రతి రోజు ఒక్కో వ్యక్తికి సుమారు 6కిలోమీటర్ల మేర ఒకేసారి నలుగురిని కారులో ఎక్కించుకుని శిక్షణ కల్పించారు. మధ్యమధ్యలో మరో 3 రోజుల పాటు వాహనంలో ఉండే విడిభాగాలు, వాటి ఉపయోగం, అత్యవసర సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన అంశాలు, రోడ్డుపై ప్రయాణిస్తున్న సమయంలో ఎలా మెదులుకోవాలనే అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతి రోజు ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు మొదటి దశలో 70మందికి నెల రోజుల పాటు డ్రైవింగ్‌పై శిక్షణ ఇచ్చారు. సెట్విన్ సంస్థ ఆధ్వర్యంలో ఇస్తున్న శిక్షణలో భాగంగా ముందుగా శిక్షణ పొందుతున్న అభ్యర్థికి వాహనంపై పూర్తి అవగాహన కల్పించడంతో పాటు లెర్నింగ్ లైసెన్స్ ఇప్పించారు. శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత ఆర్టీఓ అధికారుల సమక్షంలో మరోసారి పరీక్షించి పూర్తి స్థాయి లైసెన్స్‌ను అందించనున్నారు. సెట్విన్ సంస్థ అందిస్తున్న ఉచిత డ్రైవింగ్ శిక్షణకు రెండో విడతలో మరో 30మంది ఎంపికయ్యారు. వీరిలో 20మంది పురుషులు ఉండగా... 10మంది మహిళలు ఉన్నారు. వీరికి సైతం డ్రైవింగ్‌పై నెల రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. రెండో విడతలో భాగంగా మరో వారం రోజుల్లో వీరికి శిక్షణ ప్రారంభించేందుకు సెట్విన్ సంస్థ చర్యలు చేపడుతోంది.

శిక్షణ పొందడం సంతోషంగా ఉంది ..



ప్రభుత్వం అందిస్తున్న ఈ పథకంతో నాలాంటి నిరుద్యోగ యువతకు ఎంతో మేలు చేకూరుతుంది. ఉన్నత చదువులు పూర్తి చేసుకున్నప్పటికీ ప్రభుత్వ ఉద్యోగం కోసమే ఎదురు చూడకుండా ఇలాంటి శిక్షణను సద్వినియోగం చేసుకుని ఉపాధి మార్గాన్ని ఎంచుకునేందుకు ఎంతగానో దోహదపడుతోంది. –రామస్వామి, పిడిచెడ్, గజ్వేల్

ఉచిత శిక్షణ బాగుంది..



ప్రభుత్వ కృషితో సెట్విన్ సంస్థ మోటారు డ్రైవింగ్‌లో అందించిన ఉచిత శిక్షణ బాగుంది. ప్రైవేటుగా డ్రైవింగ్ శిక్షణ పొందాలంటే ఖర్చుతో కూడుకున్న పని. నిరుద్యోగ యువతకు ఇలాంటి శిక్షణ ఎంతగానో సహాయ పడుతుంది. –ఎండీ సాదక్‌పాష, గజ్వేల్

న్యూస్ బాక్స్

నియోజకవర్గానికి 4700 గ్యాస్ కనెక్షన్లు మంజూరు

గజ్వేల్ : గజ్వేల్ నియోజకవర్గంలో గ్యాస్‌లేని పేదలకు మొదటి విడతలో 4700 గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేస్తున్నట్లు డీఎస్ఓ వెంకటేశ్వర్లు చెప్పారు. శనివారం ప్రజ్ఞాపూర్‌లోని శేషమా ఇండేన్ గ్యాస్ గోదాన్ని తనిఖీ చేసి సిలిండర్ల నిల్వలు పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి గ్యాస్ కన్‌క్షన్ అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని పేర్కొన్నారు. త్వరలోనే నియోజకవర్గంలో ఇప్పటి వరకు గ్యాస్ అందకుండా మిగిలిపోయిన వారికి కనెక్షన్లు ఇస్తామన్నారు.కార్యక్రమంలో శేషమా ఇండేన్‌గ్యాస్ నిర్వాహకుడు నంబూరి రామలింగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

విద్యార్థినులు ఆత్మస్థైర్యం కోల్పోవద్దు

గజ్వేల్‌రూరల్ : విద్యార్థినులు ఆత్మస్థైర్యం కోల్పోకుండా ఉండాలని ప్రముఖ న్యాయవాది, రాజు ఫౌండేషన్ చైర్మన్ టీ. రాజు సూచించారు. శనివారం గజ్వేల్‌లో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గజ్వేల్ పట్టణంలోని ఎడ్యుకేషన్ హబ్‌లో విద్యార్థినులకు రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో కరాటే శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. బాలికల స్వీయ సంరక్షణకు, మానసిక, శారీరక ధృడత్వం కొరకు కరాటేను ఆయుధంగా మార్చుకోవచ్చన్నారు. ఇప్పటికే విద్యార్థినులకు కరాటే బ్లాక్ బెల్ట్ 6వ డాన్, గిన్నీస్ రికార్డ్ హోల్డర్ కరాటే లక్ష్మీ, బ్లాక్ బెల్ట్ 7వ డాన్ రవి, బ్లాక్ బెల్ట్ 7వ డాన్ జహంగీర్‌లు డెమో తరగతులు ఇవ్వడం జరిగిందని, సోమవారం నుంచి విద్యార్థినులకు ప్రత్యేక తరగతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. అదే విధంగా తమ ఫౌండేషన్ తరపున గ్రంథాలయాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణకు తరలిన నేతలు

గజ్వేల్‌రూరల్ : సిద్దిపేటలోని వయోలా గార్డెన్స్‌లో శనివారం నిర్వహించిన కాళేశ్వరం ప్రాజెక్టుల ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమానికి గజ్వేల్ నుంచి నేతలు తరలివెళ్లారు. గజ్వేల్–ప్రజ్ఞాపూర్ నగర పంచాయతీ చైర్మన్ గాడిపల్లిభాస్కర్, వైస్ చైర్మన్ దుంబాల అరుణ, టీఆర్ఎస్ గజ్వేల్ మండలశాఖ అధ్యక్షుడు మద్దూరి శ్రీనివాస్‌రెడ్డి, టీఆర్ఎస్వీ ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు మాదాసు శ్రీనివాస్, నాయకులు వంటేరు నారాయణరెడ్డి, ఆకుల దేవేందర్, దయాకర్‌రెడ్డి వెళ్లారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



బహుమతులు అందజేస్తున్న అధికారులు,పాలకులు

ములుగు(గజ్వేల్): విద్యార్థుల్లో దాగివున్న నైపుణ్యాన్ని వెలికితీయడానికి ఆటల పోటీలు దోహదపడుతాయని జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రెట్రీ సుజాత పేర్కొన్నారు. ములుగు మండలంలో గత రెడురోజులుగా నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీలు శనివారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో కూడా రాణించాలని సూచించారు. కాగా మండలంలోని 9 జిల్లా పరిషత్ ఉన్నత, 4 ప్రాథమికోన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు కోకో, వాలీబాల్, కబడ్డీ పోటీల్లో తలపడ్డారు. గెలుపొందిన విద్యార్థులకు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రెట్రీ సుజాతతో పాటు ఎంఈఓ వెంకటేశ్వర్‌గౌడ్, సర్పంచ్ కైలాసంలు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు సిద్దిరాంరెడ్డి, భాస్కర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, పాష తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండల కేంద్రమైన మర్కూక్‌లో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీల్లో గెలుపొందిన 4 ఉన్నత, 5 ప్రాథమికోన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు సర్పంచ్ నర్సింలు, ఎంఈఓ వెంకటేశ్వర్‌గౌడ్, మర్కూక్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు అమర్‌నాథ్‌రావు, పాములపర్తి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుగుణాకర్ బహుమతులు ప్రదానం చేశారు.

లోకల్ వాయిస్

పాడుబడ్డ బావిని పూడ్చాలి



వర్గల్(గజ్వేల్): మండలంలోని ఏ ఊర్లో చూసినా పాడుబడ్డ పాత బావులు కన్పిస్తున్నయ్. సర్కారు గిప్పుడెప్పుడో పాత బావులను పూడ్చేస్తమని చెప్పింది. మా ఊర్లో తొవ్వ పక్కకే పెద్ద పాత బాయి వచ్చిపోయేటోళ్లను భయపెడుతోంది. గిసొంటి బావులను పూడిస్తే రోడెంట పోయేటోళ్లకు గుబులు పోతది.
–కొంతం భూమయ్య (జబ్బాపూర్)

మరిన్ని జోన్ వార్తలు 12వ పేజీలో...



వెండితెర



దుబ్బాక:జయ జానకి నాయకి
(శ్రీనివాస11.00,2.00,6.009.00
గజ్వేల్:(సంతోష్)
జయ జానకి నాయకి
11.00,2.00, 6.00, 9.00
గజ్వేల్: 11.00,2.00,6.00, 9.00
నేనేరాజు నేనే మంత్రి (యాదగిరి)

న్యూస్ బాక్స్

రేపు టీటీఎఫ్ ఆధ్వర్యంలో సీపీఎస్ రద్దుకు ర్యాలీ

గజ్వేల్‌రూరల్ : సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ టీటీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 28న గజ్వేల్ పట్టణంలో ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని ఆశాఖ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రం పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ అతిథిగృహ ఆవరణలో సెపెటంబర్ 1న నిర్వహించ తలపెట్టిన సామూహిక సెలవు వాల్‌పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు పాపిరెడ్డి, కార్యదర్శి జోగు శ్రీనివాస్‌లతో పాటు గజ్వేల్, దౌల్తాబాద్, వర్గల్, మర్కూక్ మండలాల బాధ్యులు శ్రీనివాస్, పర్వతం నర్సయ్య, మల్లికార్జున్, పాల్గొన్నారు.

గుండెపోటుతో టీఆర్ఎస్ నేత మృతి



సాంబయ్య (ఫైల్)

జగదేవ్‌పూర్(గజ్వేల్):గుండెపోటుతో టీఆర్ఎస్ మండల సీనియర్ నాయకులు మృతి చెందిన సంఘటన శనివారం మండలంలోని వట్టిపల్లిలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలిలా.. గ్రామానికి చెందిన వండ్ల సాంబయ్య(40) అనే వ్యక్తి తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. టీఆర్ఎస్ వ్యవస్థాపన నుంచి పార్టీకి సేవలు అందిస్తూ వస్తున్నారు. గ్రామంలో ఉంటూ తన కులవృత్తి చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. శుక్రవారం కుటుంబ సభ్యులతో కలిసి వినాయక చవితి పూజల్లో పాల్గొన్నారు.

టీఆర్ఎస్ నాయకుల పరామర్శ...

టీఆర్ఎస్ నాయకుడు సాంబయ్య మృతి చెందడంతో మాజీ గజ్వేల్ ఇన్‌చార్జి కేశినేని నర్సింహారెడ్డి, మండలాధ్యక్షులు యాదవరెడ్డి, సీనియర్ నాయకులు ప్రతాప్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, యాదగిరి, రంగారెడ్డి, రాములు, సత్యం, సర్పంచ్‌లు మహేందర్, కరుణాకర్, సుధాకర్‌రెడ్డి, రవి, సర్పంచ్ యాదమ్మ ఎల్లయ్య తదితరులు సాంబయ్య కుటుంబాన్ని పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. అలాగే మండల విశ్వకర్మ సంఘం మండలాధ్యక్షులు ఆగమాచారి, సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు.

ప్రకృతి ప్రేమికుడు



జగదేవ్‌పూర్(గజ్వేల్):మండలంలోని తిగుల్‌నర్సాపూర్ గ్రామానికి చెందిన బూతుకురి మహేందర్‌రెడ్డి చెట్లపై ప్రేమతో తమ పొలంలో ప్రకృతి వనం చేస్తున్నారు. ఈ రైతు సొంత డబ్బులతో ఇటీవల 6 రకాల భారీ చెట్లు తీసుకువచ్చి పొలం ఆవరణలో నాటారు. మామిడి, కొబ్బరి, ఉసిరి వివిధ రకాల చెట్లను నాటుతూ ప్రకృతిపై తనకున్న ప్రేమను చాటుతున్నారు. పొలం గట్ల చుట్టూ టేకు మొక్కలు నాటారు.

గణపతి బొప్పా మోరియా



వర్గల్‌లో..



సంగుపల్లిలో..



గజ్వేల్‌లో..



జగదేవ్‌పూర్‌లో..

గజ్వేల్ జోన్ బృందం: వినాయక చవితిని నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో ఘనంగా నిర్వహించారు. వివిధ రూపాల్లో బొజ్జగణపయ్య భక్తులకు కనువిందుచేశాడు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

జగదేవ్‌పూర్(గజ్వేల్):పేదల బియ్యం పెద్దల పాలవుతున్నాయి. అధికారులు ఎన్ని చర్యలు తీసుకున్నా ఆక్రమార్కుల ఆక్రమాలకు అడ్డుకట్ట పడడం లేదు. స్వయంగా శనివారం ఓ లారీలో ఆక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని అధికారులు జగదేవ్‌పూర్‌లో పట్టుకున్నారు. వాటికి సంబంధించిన వివరాలిలా.. జగదేవ్‌పూర్‌లోని ఓ ప్రెటోల్ బంకుల్లో శుక్రవారం రాత్రి నుంచి ఏపీ 22డబ్ల్యూ3770 నంబర్ లారీలో లోడ్ చేసి కవరు కప్పి ఉండడంతో అనుమానం వచ్చిన గ్రామస్తులు శనివారం సివిల్ సప్లయ్ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే డిప్యూటీ తహసీల్దార్ యతీష్, విఆర్ఓ జ్యోతి అక్కడికి చేరుకుని లారీని పరిశీలించారు. లారీలో బస్తాలల్లో పరిశీలించగా 50 కిలోల బస్తాల్లో నిండిన ఉన్న బియ్యం, నూకలు కనిపించడంతో వెంటనే సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం సమాచారాన్ని సివిల్ సప్లయ్ అధికారి(ఎఎస్ఓ) వెంకటేశ్వర్‌కు అందించారు. ఆయన హుటహుటిన జగదేవ్‌పూర్‌కు చేరుకుని పోలీస్‌స్టేషన్‌లో ఉన్న లారీని పరిశీలించారు. బస్తాల్లో ఉన్నా బియ్యాన్ని పరిశీలించి పీడీఎస్ బియ్యంగా నిర్ధారించారు. పూర్తి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌కు చెందిన అయిత రామ్ అనే వ్యాపారి కోలనుపాక నుంచి లారీలో 136 బస్తాలల్లో బియ్యం, నూకలను నింపుకుని జగదేవ్‌పూర్ మీదుగా రంగారెడ్డి జిల్లా వైపు వెళ్తుండగా గ్రామస్తులు తమకు సమాచారం ఇచ్చారని తెలిపారు. 136 బస్తాలల్లో 65 క్వింటాళ్ల వరకు బియ్యం ఉన్నాయని చెప్పారు. లారీ, యాజమని మీద కేసు నమోదు చేశామని వివరించారు. ఈ పాస్ విధానం రాక ముందు బియ్యాన్ని నిల్వ చేసి ఇలా దాణ కోసం తరలిస్తున్నారని అనుమానం వ్యక్తం చేశారు. ఎవరైనా రేషన్‌బియ్యం అమ్మినా, కోనుగోలు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



రేషన్‌బియ్యంతో పట్టుబడిన లారీ

Zone Guide

28న కలెక్టరేట్ ఎదుట టీఎస్‌యూటీఎఫ్ ధర్నా

గజ్వేల్‌రూరల్ : కేజీబీవీలలో పనిచేస్తున్న కాంట్రాక్టు టీచర్లు, ఎస్ఓ, ఇతర సిబ్బందికి సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 28న కలెక్టరేట్‌ల ఎదుట ధర్నా నిర్వహించడం జరుగుతుందని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంద్రారెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు, హెల్త్ కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేస్తూ గతంలో టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టడం జరిగిందని గుర్తు చేశారు. కానీ ఇప్పటి వరకు ఎలాంటి స్పందన లేదని... 28న చేపట్టనున్న ధర్నా కార్యక్రమానికి కేజీబీవీ ఉద్యోగులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా మథర్‌థెరిసా జయంతి



జగదేవ్‌పూర్(గజ్వేల్):సమాజసేవకురాలు మథర్‌థెరిసా 107వ జయంతి సందర్భంగా శనివారం జగదేవ్‌పూర్‌లోని ఎస్వీఎన్ పాఠశాల ఆధ్వర్యంలో ఆమె జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్ర పటానికి పూలమాలాలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ



దిలిప్‌కుమార్
అంశం : హరితహారం
ఎంపీడీఓ ములుగు

సాక్షి: మూడో విడత హరిత హారంలో భాగంగా గ్రామాల్లో మొక్కలు నాటడం పూర్తయిందా?

అధికారి: ములుగు పాత మండలంలోని 23 గ్రామపంచాయతీల్లో ఇప్పటివరకు 3 లక్షల మొక్కలు నాటడం పూర్తి కాగా మరో 2 లక్షల 10 వేల మొక్కలను నాటాల్సి వుంది.

సాక్షి: మిగిలిన మొక్కలను ఎప్పటివరకు నాటుతారు?

అధికారిః మరో వారం రోజుల్లో నాటడం పూర్తి చేస్తాం.

సాక్షి: ఇంటింటికీ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎన్ని గ్రామాల్లో పూర్తి చేశారు?

అధికారిః సీఎం ఆదేశాలమేరకు కార్యక్రమం కింద మొదటగా మండల కేంద్రమైన మర్కూక్‌ను ఎంపిక చేసి 930 ఇళ్లలలో మొక్కలు నాటడం పూర్తిచేయడం జరిగింది.

సాక్షి: తర్వాత ఏ గ్రామంలో ఈ ఇంటింటికీ మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతారు?

అధికారిః మండలంలో ఒక గ్రామాన్ని ఎంచుకోని కార్యాక్రమాన్ని ప్రారంభిస్తాం. 23 గ్రామ పంచాయతీల్లో ఇంటింటికీ మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం జరిగింది.

సాక్షిః హరితహారంతో పాటు పరిశుభ్రత పనులేమైనా చేపడుతున్నారా?

అధికారిః మర్కూక్‌లోని ఎస్సీవాడలో పరిశుభ్రత పనులు చేపట్టడం జరుగుతుంది.

సాక్షి: పరిశుభ్రతలో ఏఏ పనులను చేపడుతున్నారు.

అధికారిః మురుగు కాల్వలను శుభ్రం చేయడం, చెత్తా చెదారాన్ని తొలగించి గుంతలు చదును చేసి మొక్కలు నాటే పనులు చేపడతాం. –ములుగు



హుస్నాబాద్‌రూరల్: అక్కన్నపేట మండలం గొల్లకుంట గ్రామంలో బురదరోడ్డతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్యాస్ బండి రోడ్డుపైనే నిలబడటంతో బురదలో నుంచి సిలిండర్లను తెచ్చుకోవడానికి అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి బురదరోడ్డును బాగు చేయాలని వార్డు సభ్యురాలు రాజవ్వ కోరారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9440945276

పొద్దంతా కష్టపడితే రూ.రెండు వందలే..

- అప్పులు తీర్చడంతోనే సరి..
- బతుకుపోరులో ఆటో డ్రైవర్లు



గిరాకీ లేక ఖాళీగా ఉన్న ఆటోలు

కోహెడరూరల్(హుస్నాబాద్): బతుకుదెరువు కోసం ఆటోలను నమ్ముకున్న డ్రైవర్ల పరిస్థితి దారుణంగా మారింది. వీరు రోజంతా కష్టపడితే వచ్చే సంపాదనలో ఖర్చులు పోగా మిగిలేది రూ.200 మాత్రమే. దీంతో కుటుంబాన్ని ఎలా పోషించేదని వాపోతున్నారు. మండల కేంద్రమైన కోహెడతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో సుమారు 160 ఆటోలు తిరుగుతున్నాయి. పొద్దంతా తిరిగితే వీరికి వచ్చేవి రూ.700. ఇందులో డీజిల్‌కు రూ.200, ఫైనాన్స్‌కు రూ.300 పోగా రూ.200 మాత్రమే మిగులుతున్నాయి. దీంతో కుటుంబ భారాన్ని మోయలేక సతమతమవుతున్నారు. రెక్కాడితేగాని డొక్కాడని విధంగా ఆటో డ్రైవర్ల కుటుంబాలు విలవిల్లాడుతున్నాయి. ఆర్టీఏ, పోలీసు తదితర అధికారులు వేస్తున్న జరిమానాలతో లబోదిబోమంటున్నారు. ఆర్సీ, ఇన్సూరెన్స్, పొల్యూషన్ తదితరాల వంకతో రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు ఆటో డ్రైవర్ల నుంచి వసూలు చేస్తున్నారు.

ఆత్మాభిమానంతో...

ఒకరి కింద పని చేయడమెందుకని... ఆత్మాభిమానంతో ఆటో రంగంపై అడుగు పెట్టిన డ్రైవర్లకు బతుకుపోరులో సవాలక్ష సమస్యలు ఎదురవుతున్నాయి. ముందు నుయ్యి.. వెనుక గొయ్యి అనే చందంగా మారింది ఆటో డ్రైవర్ల పరిస్థితి. ఈ రంగం నుంచి మరోరంగానికి వెళ్లలేరు. ఇందులో ఉంటూ సంపాదించుకోలేకపోతున్నామని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పార్కింగ్ సమస్య..

ఎక్కడికి వెళ్లినా ఆటోలకు పార్కింగ్ సమస్య పట్టి పీడిస్తోంది. ఉన్న ఊర్లో కూడా పార్కింగ్ ఎక్కడ చేయాలో తెలియని పరిస్థితి. ఇక వేరే ఊరికి వెళ్తే చెప్పనక్కర లేదు.

మండల కేంద్రంలో పార్కింగ్ స్థలం కేటాయించాలని పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆటో డ్రైవర్లు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గిరాకీ లేక..



ప్రస్తుత పరిస్థితుల్లో ఇంటికో ద్విచక్ర వాహనం ఉంది. ఎక్కువ మంది ఆటోలను ఆశ్రయించడం లేదు. దీంతో ఫైనాన్స్ అప్పులు తీరక సతమతమవుతున్నాం. గతంలో అందరూ ఆటోలనే ఆశ్రయించారు. ఇప్పుడు పరిస్థితి మారింది. గిరాకీ లేక ఇబ్బంది పడుతున్నాం.

– జాలిగం నరేశ్, తంగళ్లపల్లి

అప్పులే..



పొద్దంతా ఆటో నడిపితేనే పూట గడిచేది. ప్రస్తుతం ఆటోలు నడవకపోవడంతో కుటుంబ పోషణ భారమవుతోంది. ఇంట్లో ఖర్చులు అధికమవుతున్నాయి. ఆటో ఫైనాన్స్, ఇంట్ల ఖర్చుల కోసం డబ్బులు చాలడం లేదు. ఆటోను నమ్ముకుంటే అప్పులే మిగులుతున్నాయి.

– మంద తిరుపతి, కోహెడ

న్యూస్ బాక్స్

కళాకారులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

హుస్నాబాద్ : తెలంగాణ ఉద్యమంలో ధూంధాం వేదికలపై కళా ప్రదర్శనలు ఇస్తూ ప్రజలను చైతన్యవంతం చేసిన కళాకారులకు తెలంగాణ సాంస్కృతిక సారథిలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని టీఆర్ఎస్ నాయకుడు, కళాకారుడు కల్లెం లక్ష్మణ్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ ప్రాంతానికి చెందిన 25 మంది కళాకారులు మూడు సంవత్సరాలుగా ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. సీఎం కేసీఆర్ 550 మంది కళాకారులకు సారథిలో ఉద్యోగ అవకాశాలు కల్పించడం సంతోషమే అన్నారు. మిగతా కళాకారుల బాధలను గుర్తించి సారథిలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు.

ఆర్థిక సాయం అందజేత

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని కుందనవానిపల్లి గ్రామానికి చెందిన పొన్నాల దుర్గయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం అతని కుటుంబానికి హుస్నాబాద్ శాసనసభ్యుడు వొడితెల సతీష్‌కుమార్ ఆర్థిక సాయం పంపించారు. హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ లింగాల సాయిన్న, టీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మాక్య నారాయణ, సర్పంచ్ ఎలేటి నిర్మల ఆధ్వర్యంలో ఆ కుటుంబానికి ఎమ్మెల్యే పంపిన చెక్‌ను అందజేశారు. టీఆర్ఎస్ నాయకులు సంపత్, నందయ్య, కన్నం కొమురయ్య, తిరుపతి, పొన్నాల రవీ, పొన్నాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మదర్‌థెరీసాకు నివాళి

కోహెడ(హుస్నాబాద్): మండల కేంద్రంలో బాలల హక్కుల ప్రజావేదిక ఆధ్వర్యంలో శనివారం మదర్‌థెరీసా 107వ జయంతిని ఘనంగా నిర్వహించారు. జిల్లా సంయుక్త కార్యదర్శి పిడిశెట్టి రాజు థెరీసా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక కోహెడ నర్సింగ్‌హోంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాజు, రమేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని జోన్ వార్తలు 12వ పేజీలో...

మంత్రి హరీశ్‌రావు చిత్రపటానికి క్షీరాభిషేకం

హుస్నాబాద్: పట్టణంలో గిరిజన కమ్యూనిటీ హాల్ కోసం 20 గుంటల స్థలంతో పాటు రూ.కోటి మంజూరు చేసిన మంత్రి హరీశ్‌రావుతో పాటు ఎంపీలు కెప్టెన్ లక్ష్మీకాంతారావు, వినోద్‌కుమార్, ఎమ్మెల్యే సతీష్‌కుమార్ చిత్రపటాలకు శనివారం గిరిజనులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ సభ్యుడు మాలోతు బీలునాయక్ మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో గిరిజనులకు అన్యాయం జరిగిందన్నారు. సిద్దిపేట జిల్లాలో చేరిన తర్వాతనే గిరిజనులు అభివృద్ధి చెందుతున్నారని అన్నారు. గిరిజనులు అధికంగా ఉన్న హుస్నాబాద్‌కు త్వరలో గిరిజన సంక్షేమ కార్యాలయం మంజూరు కాబోతుందని మంత్రి హరీశ్‌రావు చేసిన ప్రకటనతో గిరిజనులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. రూ.60 కోట్లతో తండాలకు రహదారులు వేస్తామని చెప్పడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లక్ష్మణ్‌నాయక్, నాయకులు శంకర్‌నాయక్, రాములు నాయక్, రమేష్‌నాయక్, వెర్సి నాయక్, కృష్ణనాయక్, తుక్యారాం, భూక్య రాజు, మోహన్‌నాయక్, భాస్కర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధికి బాటలు

తెలంగాణ రాష్ట్రం అధికారంలోకి వచ్చిన తర్వాతనే గిరిజనుల అభివృద్ధికి బాటలు వేసిందని గిరిజన సంఘాల నాయకులు అన్నారు. గిరిజనుల సంక్షేమం కోసం వరాల జల్లు కురిపించిన మంత్రి హరీశ్‌రావు, ఎంపీలు కెప్టెన్ లక్ష్మీకాంతారావు, వినోద్‌కుమార్, ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌కు శనివారం హుస్నాబాద్, అక్కన్నపేట మండలాలకు చెందిన గిరిజన నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు కిషన్‌నాయక్, భిక్షపతినాయక్, శంకర్‌నాయక్, మోహన్‌నాయక్, తిరుపతినాయక్, రమేష్‌నాయక్, జవహర్‌లాల్, లింగానాయక్, కిషన్, ఈర్యా పాల్గొన్నారు.

హుస్నాబాద్‌రూరల్: గిరిజన అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ భూక్య మంగ అన్నారు. శనివారం సాయంత్రం మండల పరిషత్ కార్యాలయంలో గిరిజన సంఘాల ప్రతినిధులతో కలిసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు మంత్రి తన్నీర్ హరీశ్‌రావు, ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ గిరిజనుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. డీటీడీ కార్యాలయం హుస్నాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు మంత్రి హరీశ్‌రావు హామీ ఇచ్చారన్నారు. గిరిజన అభివృద్ధికి నిధులు మంజూరు చేసిందుకు గిరిజన సంఘాల నాయకులు స్వీట్లు పంచుకున్నారు. సమావేశంలో ఉపాధ్యాయ సంఘం నాయకుడు కిషన్‌నాయక్, టీఆర్ఎస్ యువజన మండల అధ్యక్షుడు భూక్య రమేశ్, జవహర్‌లాల్, ఉపాధ్యాయులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు భిక్షపతినాయక్, శ్రీనివాస్, గుగులోతు శంకర్‌నాయక్, మోహన్‌నాయక్, తిరుపతినాయక్, ధారావత్ కిషన్, ఈర్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.


లోకల్ వాయిస్


కంచె ఏర్పాటు చేయాలి



కోహెడరూరల్(హుస్నాబాద్): రాంచంద్రాపూర్ గ్రామంలో ఇళ్ల మధ్యలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె లేకపోవడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. స్తంభాల మధ్య ఎక్కువ దూరం ఉండటంతో విద్యుత్ తీగలు వేలాడుతున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయకపోవడంతో మూగజీవాలు మృతువాత పడుతున్నాయి. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని మనవి.

– కట్టుకోజ్వాల వెంకటచారి





వెంకటేశ్వర థియేటర్:
గౌతమ్‌నంద
వెంకటేశ్వర కళామందిర్:
మాయామాల్
(భీమదేవరపల్లి)
అన్నపూర్ణ టాకీస్:
నక్షత్రం
(ముల్కనూర్)

ఈ రోడ్డుపై ప్రయాణం సాగేనా?



కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని కుర్రెల్ల గ్రామం నుంచి కోహెడ వరకు గల రోడ్డు చిన్నపాటి వర్షానికే చిత్తడిగా మారు తోంది. ప్రయాణానికి ఆటంకంగా మారుతోంది. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని కుర్రెల్ల గ్రామానికి చెందిన మల్లేశం కోరారు.

కొలువుదీరిన గణనాథులు



పూజలు చేస్తున్న మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్



లద్నూర్‌లో పూజలందుకుంటున్న గణనాథుడు



వినాయకుడిని తీసుకెళ్తున్న గాంధీనగర్ యువకులు

హుస్నాబాద్: గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వినాయక విగ్రహాలు పట్టణంలో మండపాల్లో కొలువు దీరాయి. శుక్రవారం ప్రత్యేక వాహనాల్లో వినాయక విగ్రహాలను డప్పు చప్పుళ్లతో ఊరేగించారు. మండపాలను విద్యుత్ కాంతుల మధ్య అలంకరించారు. వాడవాడలా నిత్యపూజలతో వినాయకుడి నామస్మరణతో మారుమోగుతోంది. పట్టణ పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో శనివారం మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట డీసీసీ అధికార ప్రతినిధి కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, నాయకులు చిత్తారి రవీందర్, కోమటి సత్యనారాయణ, గురాల లింగారెడ్డి, పున్న సారయ్య, బొల్లి శ్రీనివాస్, అక్కు శ్రీనివాస్, పచ్చిమట్ల సంపత్, వాల నవీన్ తదితరులున్నారు.

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ పట్టణంలోని శివాజీనగర్‌లో పర్యావరణ పరిరక్షణకు యూత్ సభ్యులు మండపం ఎదుట హరితహారం మొక్కలు నాటారు. రసాయన విగ్రహాలతో వాతావరణం కలుషితమవుతుందని, కాలుష్యాన్ని నివారించడానికి 20 మొక్కలు నాటారు. జ్యోతినగర్‌లో చిన్నారులు భజనలు చేశారు. గోదాంగడ్డ యువత ధ్వని కాలుష్య నివారణకు మైక్ సెట్‌ను వాడటం లేదు. శుక్రవారం పట్టణంలో తీరొక్క రూపాల గణనాథులు కొలువుదీరారు.

హుస్నాబాద్‌రూరల్: వినాయక నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. హుస్నాబాద్ నుంచి వినాయక ప్రతిమలను కొనుగోలు చేసి ట్రాక్టర్లు, ఆటోల్లో గ్రామాలకు తరలించారు. కోలాటం, జానపద నృత్యాలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

కోహెడ(హుస్నాబాద్): మండల వ్యాప్తంగా శుక్రవారం వినాయక చవితి పండుగను ఘనంగా నిర్వహించారు. గణనాథుడి విగ్రహం ఎదుట భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. కుటుంబాలను చల్లంగా చూడాలను లంబోదరుడిని వేడుకున్నారు.

మద్దూరు(హుస్నాబాద్): ప్రథమ పూజలందుకొనే గణనాథుడు భక్తులకు దీవెనలు అందించేందుకు మండలంలోని అన్ని గ్రామాల్లో గల వాడవాడలా కొలువుదీరాడు. శుక్రవారం నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.

వందశాతం మరుగుదొడ్లు నిర్మించాలి

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ ఉమ్మడి మండలంలో వందశాతం మరుగుదొడ్లు నిర్మించాలని, స్వశక్తి మహిళలకు సంఘాల లీడర్లు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ కొత్త అశోక్‌రెడ్డి అన్నారు. శనివారం మండల సమాఖ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వశక్తి సంఘాలకు బ్యాంకుల నుంచి లింకేజీ అందిస్తూ ప్రభుత్వం స్వయం ఉపాధికి చేయూతనిస్తోందన్నారు. సంఘంలోని సభ్యులు మరుగుదొడ్డి నిర్మించుకోవాలని అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ఏపీఎంలు రాజు, శ్రీనివాస్, సీసీలు రమేశ్, ప్రసాద్, శివచరణ్ తదితరులున్నారు.

యజ్ఞంలా హరితహారం

అక్కన్నపేట(హుస్నాబాద్): ఆకుపచ్చ తెలంగాణ రాష్ట్రమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న తరుణంలో మండలంలో అధికారులు, ప్రజాప్రతినిధులు యజ్ఞంలా హరితహారం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. శనివారం మండలంలోని నందారం, పోతారం(జే) గ్రామాల్లో మొక్కలు సుమారు 2 వేల మొక్కలను ఈ రెండు గ్రామాల్లో నాటారు. అనంతరం ఎంపీపీ నందారం గ్రామంలో మధ్యాహ్న భోజనం గదుల నిర్మాణాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కొత్త అశోక్‌రెడ్డి, సర్పంచ్‌లు సమ్మయ్య, సత్యవతి, ఎంపీటీసీ భానోతు భాస్కర్‌నాయక్, ఉపాధి హామీ ఈసీ ప్రభాకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అప్పుల పాలవుతున్న రైతులు

అక్కన్నపేట (హుస్నాబాద్): వరి పంటకు ఏ రోగం వచ్చిందో తెలియక రైతులు తీవ్రంగా నష్టపోతూ అప్పుల పాలవుతున్నారని మాజీ సర్పంచ్ కర్ణకంటి శ్రీశైలం ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటైన మండల కేంద్రంలో వ్యవసాయ అధికారుల జాడే లేదన్నారు. వరి కాండం ఎర్రబడి ఆకులు రాలిపోతున్నాయన్నారు. రైతులు రకరకాల మందులు పిచికారీ చేసినా పంటలు ఎండిపోతున్నాయన్నారు. వ్యవసాయ అధికారులు వరి పంటను పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు.

ధర్నాను జయప్రదం చేయండి

హుస్నాబాద్‌రూరల్: ఈ నెల 28న తలపెట్టిన కేజీబీవీ ఉద్యోగుల ధర్నాను జయప్రదం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జి.తిరుపతిజాదవ్ అన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కేజీబీవీ ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రాల్లో ధర్నా చేస్తున్నట్లు చెప్పారు. ధర్నా పోస్టర్‌ను శనివారం కేజీబీవీ ఆవరణలో ఉద్యోగులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో మమతయాదవ్, సంధ్యారాణి, హేమలత, గంగాభవాని, అనిత, రమాదేవి, రాజమణి, అనిత, కళావతి, వరదేవి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

హుస్నాబాద్: సీపీఎస్‌ను రద్దు చేయాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేశాయి. శనివారం పట్టణంలో హుస్నాబాద్, అక్కన్నపేట మండలాలకు చెందిన జాక్టో సమావేశం నిర్వహించారు. ఈ నెల 28న సిద్దిపేటలో నిరసన ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సంఘ నాయకులు గంగిశెట్టి మహేందర్, గాంధీ, సిద్ధిరాములు, వేముల శ్రీనివాస్, కోటిచింతల రవి, భిక్షపతి, తిరుపతి, సంతోష్‌కుమార్, రవి కుమార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బస్సును పునరుద్ధరించాలని వినతి

కోహెడరూరల్(హుస్నాబాద్):

మండలంలోని తంగళ్లపల్లి మీదుగా హుస్నాబాద్ నుంచి బెజ్జంకి వరకు బస్సును పునరుద్ధరించాలని కోరుతూ శనివారం హుస్నాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్‌కు తంగళ్లపల్లి గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. కొన్ని రోజుల క్రితం గ్రామానికి చెందిన యువకులు బస్సు డ్రైవర్‌తో గొడవ పడటంతో బస్సును నిలిపివేసినట్లు చెప్పారు. మరోసారి ఇలాంటి పరిణామాలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకుంటామని మేనేజర్‌కు హామీ ఇచ్చారు. పాము శ్రీకాంత్ పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

కోహెడరూరల్(హుస్నాబాద్):

తాటిచెట్టు పైనుంచి పడి గీతకార్మికుడికి గాయాలైన సంఘటన మండలంలోని తంగళ్లపల్లిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... ఆ గ్రామానికి చెందిన గీతకార్మికుడు పిల్లి కిష్టయ్య ఎప్పటిలాగే శనివారం తాటిచెట్టు ఎక్కడానికి వెళ్లాడు, చెట్టు దిగే సమయంలో ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో అతని ఎడమ చెయ్యి విరిగింది. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించి సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పిల్లి కిష్టయ్యను ప్రభుత్వం ఆదుకోవాలని గౌడ సంఘం అధ్యక్షుడు పచ్చిమట్ల శ్రీనివాస్‌గౌడ్, పిల్లి సంపత్‌గౌడ్ కోరారు.

ఇంటర్వ్యూ



స్వరూపరాణి
అంశం : పౌష్టికాహారం
కోహెడ అంగన్‌వాడీ సూపర్‌వైజర్

సాక్షి: ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కింద కోహెడ మండలంలో ఎన్ని గ్రామాలున్నాయి?

అధికారి : ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కింద 21 గ్రామాలున్నాయి.

సాక్షి: అంగన్‌వాడీ సెంటర్లు ఎన్ని ఉన్నాయి?

అధికారి : మండలంలో 52 అంగన్‌వాడీ సెంటర్లున్నాయి.

సాక్షి: అంగన్‌వాడీ సెంటర్లకు ఎలాంటి సరుకులు పంపిణీ చేస్తున్నారు?

అధికారి : పాలు, గుడ్లు, పప్పు, నూనె, బియ్యం, బాలామృతం, మురుకులు, పెరుగు పంపిణీ చేస్తున్నాం. ఎలాంటి అవకతవకలకు తావులేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

సాక్షి: గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్నారా?

అధికారి : అందిస్తున్నాం. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంతో పాటు కోడి గుడ్డు, ప్రతి రోజూ 200 మి.లీ పాలు అందజేస్తున్నాం. గర్భిణులు, బాలింతలకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు చేస్తున్నాం.

సాక్షి: మండలంలో అంగన్‌వాడీ పోస్టులు ఎన్ని ఖాళీలున్నాయి?

అధికారి : శ్రీరాములపల్లి, విజయనగర్ కాలనీ, శనిగరం, నకిరె కొమ్ముల గ్రామాల్లో నాలుగు ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

సాక్షి: ఖాళీ పోస్టులను ఎలా భర్తీ చేస్తారు?

అధికారి : ఖాళీల వివరాలను ఉన్నతాధికారులకు నివేదించాం. త్వరలోనే భర్తీ చేస్తాం.

– కోహెడ(హుస్నాబాద్)